
# ఆంధ్ర సచిత్ర వారపత్రిక



# బలము మరియు శక్తి కోసం—బోర్న్‌విటా!



## బోర్న్‌విటా రుచి సాటిలేనిది..

## ఇందుకు కిటుకు—కోకో!

కోకో, పాలు, పంచదార మరియు మాల్ట్‌తో నిర్దేశితమైన పద్ధతి ప్రకారం మిశ్రణము చేసిన ఫలితము. అధిక శక్తి నిచ్చే పానీయము—బోర్న్‌విటా! బోర్న్‌విటాను వేడి పాలలో కలపండి. ఈ రుచికరమైన పానీయము వలన శక్తి మరియు బలము పొందండి.




బలము, శక్తి మరియు రుచి కోసం

**కాడ్‌బరీస్ బోర్న్‌విటా**


తప్పక చూడండి!
అనుభవించు రాజా అనుభవించు!
దర్శకత్వం కె. బాలచందర్
సంగీతం యమ్.యస్.విశ్వనాథం
PRODUCTIONS


తప్పక చూడండి!
పి.ఎస్.ఆర్. పిక్చర్స్ వారి
స్క్రీన్‌ప్లే:దర్శకత్వం:గిడుతూరి సూర్యం * నిర్మాత:పింజల సుబ్బారావు
ఆంధ్ర:రాయల - నైజాం:దివ్యదత్తా - సీడెడ్:జయలక్ష్మి - మైసూర్:పారిజాత మూవీస్.
స్టూడియో వాహిని

## ముఖచిత్రం

16—2—68 సంచిక ముఖచిత్రం ఆకర్షణీయంగా వుంది.

పాఠకుల అభిరుచుల కనుగుణంగా ముఖచిత్రాలు ప్రచురిస్తున్న మీరు అభినందనీయులు

బి. భాస్కరరావు ( లక్నో )

* * *

23—2—68 తారీఖుగల ఆంధ్రసచిత్రవార పత్రిక యొక్క ముఖచిత్రం ఆకర్షణీయముగా వున్నది. ముఖచిత్రములోని పుష్పములు చాల అందముగా కన్పడుచున్నవి. ముఖచిత్ర రచన చేసిన,కె. శంకరరావు గారికి నా అభినందనములు తెలుప ప్రార్థన. ఇటువంటి ముఖచిత్రములు తరుచుగా ప్రచురింప మని నాకోరిక.

—ఎల్. గ్లాడిస్టన్, (భీమవరం).

* * *

ఎన్నోరోజులతర్వాత23-2-68ఆంధ్రసచిత్ర వారపత్రిక ముఖచిత్రం—నామనసు నాకర్షించింది. ముచ్చటగొలిపే రంగుల్లో ఆహ్లాదకరమైన పువ్వులెంత మనోహరంగా వున్నయో ఎలా చెప్పమంటారు? ఈమధ్య వచ్చే ముఖచిత్రాలతో విసుగెత్తిన కాలంలో యీసంచిక రమణీయంగా రూపు దాల్చింది. అటువంటి చక్కని ముఖచిత్రాలనే తరచుగా వేసి, పాఠకుల నానందింపజేస్తారని ఆశిస్తున్నాను.

డాక్టర్. కె. కమల (వైజాగ్)

## కథలు

మీ వారపత్రికలో 16—2—68 వ తేదీన శ్రీ కె. సభాగారు వ్రాసిన కథ "ఆకాశగంగ" ఒకసారికి రెండుసార్లు చదివితిని. న్యాయవాదవృత్తిని చక్కగ విమర్శించినారు. కథగాదు యథార్థముగా జరిగిన సంఘటనవలె చదువుతుంటే తోస్తుంది.

శ్రీ కె. సభాగారికి నా ధన్యవాదాలు. లోగడ కూడా వారు వ్రాసిన కథ మృత్యుంజయుడు హాస్పిటల్ స్టాఫు దినచర్యలను చక్కగా హాస్య ధోరణిలో విమర్శించినారు. ఈసారి కూడా శ్రీ కె. సభాగారు ఇంజనీర్లు— కంట్రాక్టర్ల మీద ఒక కథ వ్రాస్తారని ఆశిస్తున్నాను. వారు వ్రాసిన దాంట్లో ఏమాత్రం అతిశయోక్తి లేదు. కండ్లకు కట్టినట్లు కన్పడే యదార్థ ఘటనలే చక్కగా విమర్శనా దృష్టితో వ్రాయగల నేర్పు సభాగారికే తగును.

బి. సూర్యప్రకాశరావు, (విజయవాడ).

* * *

23—2—68 సంచిక ముఖచిత్రం అత్యంత మనోహరంగ వున్నది.

ఆసంచికలో 'అధికారి' కథ నేటి మన సమాజానికి అనుగుణంగ వున్నది.

—అన్నల నరసింహారావు, (పాలకొల్లు)

# ఉత్తరాలు

## వ్యాసాలు

16—2—68 పత్రిక చాలా బాగుంది. పత్రిక వారవారమునకు వినూత్న కాంతుల వెదజల్లుతూ దర్శనమిస్తున్నది. ఇందులో ముఖ్యంగా "ఉమెన్ కార్టూన్", 'ధర్మపథం', నారాయణరెడ్డిగారి గేయం చాలా బాగున్నాయి. అన్నింటి కన్నా కౌటిల్య గారి 'బాలసాహితి' కథ తలమానికము. పత్రికకే హైలైట్. కె. రామలక్ష్మిగారి 'ప్రశ్నావళి' జవాబులు గూడా సూక్ష్మంగా చాలా బాగుంటున్నాయి. ఈ వారం కార్టూన్లన్నీ కడుపుబ్బ నవ్వించాయి.

టి. మురళీధర్‌గౌడు ( చెన్నూరు )

* * *

ప్రతివారం ఆంధ్ర సచిత్రవారపత్రిక మా యింట్లో అందరూ చదవడానికి అందులోని ధర్మపథం, ప్రశ్నావళి, మొదడుకి మేత వంటి మంచి మంచి శీర్షికలు కారణం.

ప్రశ్నావళి శీర్షికతోబాటు, వారం వారం తప్పనిసరిగా ఒక వ్యాసం వ్రాస్తున్న శ్రీమతి రామలక్ష్మి గార్కి మా అభినందనలు.

శాంతమూర్తి ( హైదరాబాద్ )




# ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 8—3—'68

శ్రీప్లవంగనామ సం॥ ఫాల్గుణ బహు॥ శుద్ధ ...

సంపుటము : 60 సంచిక : 27

స్థాపితము:

1908

ముఖ్య సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము

7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1


పోస్టుద్వారా

| | |
|---|---|
| సంవత్సర చందా | 26.00 |
| 6 మాసముల చందా | 13.00 |
| 3 మాసముల చందా | 6.50 |


## విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి షీలా.

( ఫొటో : ప్రభాకర్ )


నిన్న
నేడు

# కాశ్మీర్ తర్వాత కచ్ కథ

కచ్ఏవార్డు, రయిల్వే బడ్జెట్టు, ప్రయివేటు సేనల సృష్టి ఈ వారం విశేషాలు.

**పాఠం నేర్చుకోరు**

కాంగ్రెసువారు దేనినీ మరిచిపోరు, ఏదీ నేర్చుకోరు. సెప్టెంబరు 2, 1946 నుంచి కాంగ్రెసు కేంద్రంలో అధికారంలో ఉంది. కాశ్మీరు సమస్యని ఐ. రా. స. కి పంపటంలో పెద్ద పొరపాటు చేసింది. ఈ పొరపాటు భారతదేశం రక్తాన్ని తోడేస్తోంది. మన దేశానికి రోజుకి ఒక కోటి రూపాయలు ఖర్చవుతున్నాయి. దీనికంతా కారణం శ్రీ నెహ్రూగారి తెలివి తక్కువ తనమే అనాలి — ఆయన అనవసరంగా కాశ్మీరు సమస్య అయిక్యరాజ్య సమితికి పంపారు. ఆయన దివ్య దృష్టికి మహారాజా హరిసింగ్ తన రాజ్యాన్ని భారత దేశానికి ఇవ్వడం సరిగ్గా కనిపించలేదు. మరొక వారం పోరాడి ఉంటే పాకిస్తాన్‌ని కాశ్మీరులో నుంచి తోసివేసి ఉండవచ్చు.

శ్రీ నెహ్రూ ఒక్క కాశ్మీరు సమస్యనే కాదు, షేక్ అబ్దుల్లాని కూడా సృష్టించారు. ఈయన 'నేను భారతీయుడినికాను కాశ్మీరీని' అంటాడు. కాశ్మీరు భారత దేశంలో భాగం కాదని ఆయన అభిప్రాయం.

**కచ్ కథ**

కచ్ కథ కూడా ఇంతే. కాశ్మీరులో లాగే కచ్‌లోనూ పాకిస్తాన్ మొదట దండెత్తడం జరిగింది, భారతదేశం పాకిస్తాన్‌ని బయటికి తోసివేసి ఉండవచ్చు కాని ఊరుకోకుండా ప్రపంచ న్యాయస్థానానికి వెళ్ళింది. భారతదేశం కేసు గెలిచిందంటున్నారు కొందరు. పాకిస్తాన్‌కి 10 శాతం భూమి మాత్రమే వచ్చిందిట.

**కోర్టు నిర్మాణం**

కోర్టు నిర్మాణం గురించి ఆలోచించాలి. పాకిస్తాన్ తన తరఫున ఇరాన్ నుంచి ఒకముస్లిమ్ న్యాయమూర్తిని పేర్కొన్నది. ఈ న్యాయమూర్తి మహమ్మదీయుడని వేరే చెప్పనక్కరలేదు. భారతదేశం యుగోస్లావియానుంచి ప్రతినిధిని పేర్కొన్నది. అంటే భారత దేశానికి పశ్చిమ రాజ్యాలమీద నమ్మకం లేదన్నమాట — కమ్యూనిస్టులే మన స్నేహితులని సిద్ధాంతం. అయితే పశ్చిమ రాజ్యాలే, వాటిలో అమెరికా, బ్రిటన్, జర్మనీలే మనకి డబ్బు ధారపోశాయి! బీహారు, ఉ. ప్ర. లలో కరువు వచ్చినప్పుడు పశ్చిమరాజ్యాలే సహాయం చేశాయి. (రష్యా తప్ప తక్కిన కమ్యూనిస్టు రాజ్యాలు కావలసినంత సానుభూతి మాత్రం ఇచ్చాయి. ఈ సానుభూతితో కడుపులు నిండవు.)

ఇప్పుడు షేక్అబ్దుల్లా కాశ్మీరు సమస్యనికూడా ప్రపంచ న్యాయస్థానానికి పంపమనవచ్చు. పాకిస్తాన్‌కి కచ్‌లో సైనికస్థావరం ఒకటి ఏర్పడబోతున్నది. పోరాటంలో సాధించనిది న్యాయస్థానం ద్వారా సాధించ గలుగుతోంది!

**రహస్యం**

కాంగ్రెసు ప్రభుత్వం నిజాన్ని ఎప్పుడూ బయటపెట్టదు. స్వాతంత్ర్యం రాగానే డచ్ నిపుణులు కచ్ ప్రాంతాలలో కట్టలు కట్టే పథకం ఒకటి తయారుచేసి ఇచ్చారు. పాకిస్తాన్‌తో యుద్ధం అయిన కాలానికి ఈ పథకాన్ని ఎంత అశ్రద్ధచేశారో తెలిసింది. శ్రీ ఎస్. కె. డే పథకాలమీద వందలకోట్లు ఖర్చు చేశారు. రష్యా పెట్టించిన పెద్ద కర్మాగారాలలో డబ్బు పోశారు—కాని భారత దేశం శాంతి భద్రతలకి కావలసిన రోడ్లు వెయ్యలేదు.

**రయిల్వే బడ్జెటు**

రయిల్వే బడ్జెట్టులో విశేషం ఏమీ లేదు, పారిశ్రామిక మాంద్యం రయిల్వే ఆదాయాన్ని తగ్గించింది. కరువుభత్యం హెచ్చించటంతో ఖర్చుపెరిగింది. మొత్తం 'నిధి'కి భారతదేశం చందా కొంతకాలంగా పెరగలేదు...

ఆర్థిక కారణాలవల్ల భారతదేశం అప్పులవాళ్ళని అప్పుతీర్చేవ్యవధిని పెంచమంటున్నది. ఈ పద్ధతిమీదనే రయిల్వే శాఖ ఆర్థికశాఖని తన అప్పుతీర్చేవ్యవధిని పెంచమని అడిగి ఉండవచ్చు. అలా కాకుండా బీదప్రజలని ధర హెచ్చింపుల ద్వారా దండిస్తోంది,

రాబోయే బడ్జెట్టులో శ్రీ రామ్‌సుభగ్ సింగ్ తపాలా, తంతి రేట్లు పెంచవచ్చు...

**1945లో**

1945లో సర్ ఎడ్వర్డ్ బెంథాల్ మూడవ తరగతి టిక్కెట్టుని ఒక దమ్మిడీ పెంచుతానంటే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెసుపార్టీ ఆయన ప్రతిపాదనని రద్దు చెయ్యగలిగింది. నేడు రయిల్వే ధరలని ఇష్టం వచ్చినట్లు పెంచుతున్నారు.

.నేడు

నా అనుభవం మీద చెప్తాను. ఒకప్పుడు రయిళ్లలో వెళ్లటం సుఖంగా ఉండేది, ఎయిర్ కండిషన్ లేకపోయినా సరే ఢిల్లీలో ఎందరో రయిల్వే హోటళ్లకి వెళ్లి తిని వచ్చేవారు. ధరలు సరసంగా ఉండేవి మంచి భోజనం రు 3.50కి వచ్చేది. ఇప్పుడు ప్రజలు కేవలం అవసరం ఉండటంచే రయిళ్లలో వెడుతున్నారు. ఎయిర్ కండిషన్డ్ పెట్టెలు కూడా శుభ్రంగా ఉండవు పాయిఖానాల సంగతి సరేసరి. భోజనాలు తినలేము సాధారణ జనానికి అందుబాటులో లేకుండా పోతున్నది రయిలు ప్రయాణం.

ప్రయాణీకుల సంఘం ఒకటి, స్వాతంత్ర్యం తర్వాత, అమలులోకి వచ్చింది దాని నిండా ప్రభుత్వ ప్రతినిధులే. ఈ రోజుల్లో రయిల్లో ప్రయాణం చేసే మంత్రిగారెవరు? ఒకవేళ చేశారే అనుకుందాము, వారికి జరిగే మర్యాద మరొక రకంది. వర్గ, జాతి రహిత సమాజం కోసం శ్రీ నెహ్రూ 'వి. ఐ. పి.' అనే వ్యక్తిని సృష్టించాడు. ఈ రకం వ్యక్తి రయిలులో ప్రయాణం చేసినా ప్రత్యేకంగా మర్యాదలు జరుగుతాయి.

## ప్రజలే నిర్ణయించాలి

మంచీ చెడ్డా డబ్బులుపెట్టి టిక్కెట్టు కొనే సామాన్య ప్రజలకి తెలియాలి కాని ఇతరులకి ఎలా తెలుస్తుంది?

భారతదేశంలో కొత్త పోకడ ఒకటి కనిపిస్తోంది. ప్రయివేటు సేనలు సృష్టి అవుతున్నాయి. రా. స్వ. సే. సం. వారికి స్వంతసేన ఉంది. కమ్యూనిస్టుల సంగతి సరేసరి — ఈ ఏటికి 75000 మంది సైనికులని తయారు చేస్తారుట. వారిలో వామ పక్షంవారు 'గోపాల్ సేన'ని సృష్టించారు. మహారాష్ట్రలో శివసేన ఉంది. సం. సో. పా. వారికి సేనలేక పోయినా సభ్యులు ఏ యుద్ధంలో కయినా, ఏ వీధిలో జరిగినా, ఉరకటానికి సిద్ధంగా ఉన్నారు; గిడ్డంగులని దోచే, బలవంతంగా భూములని పంచిపెట్టే ఉద్యమాన్ని లేవదీస్తారుట.

ఇక్కడ అనుకుంటున్నారు — 1. 1946లో ఒక ఆడమనిషి వంటి నిండా నగలుపెట్టుకుని ఒంటరిగా వీధి మీదకెడితే ఆమెకి ఏ ప్రమాదమూ ఉండేదికాదు. ఈనాడు ఒక చిన్నపిల్లవానికి వెండిపోగులు పెట్టుకుని బయటికి [illegible]డం లేదు. 2. ఔరంగజేబు తర్వాత కేంద్రంలో అధికారం ఎలా సడలి పోయిందో నేడు అలాగే ఢిల్లీలో అధికారం సడలిపోతోంది. ఔరంగజేబు వారసులలో ఐకమత్యం లేదు. నేడు అటువంటి పరిస్థితే ఏర్పడింది.

బ్రిటీషువారు భారతదేశాన్ని ఒకటిగా చేశారు. దక్షిణాదివారు ఉత్తరదేశంలో, ఉత్తరాదివారు దక్షిణ ప్రాంతంలో ఉద్యోగాలు చేసేవారు, ఏపేచీ ఉండేది కాదు. సివిల్‌సర్వీస్ నిర్మాణం 'ఉక్కు నిర్మాణం' అనేట్లుగా ఉండేది. 1947 నుంచి ఈ బలం క్షీణిస్తూ వస్తోంది. దానికి మారుగా మరేదీ రాలేదు. ఇక భాషాసమస్యతో ప్రాంతీయాభిమానాలు చెలరేగాయి. జరగవలసినదంతా జరుగుతుంది. ●




తెలతెలవారుతోంది. చెరువులో కమలాలు మత్తుగా బద్ధకంగా విచ్చుకోలేక ముడుచుకు పోతున్నాయి.

*అతి పలచని అరుణ కిరణాలు విరగని చీకట్లలోనే కాంతులను చూపిస్తున్నాయి.*

*ప్రకృతి మొత్తం మత్తుగా ఆవులిస్తోంది. మైకం వదిలించుకొంటూ పక్షులు గొంతు సవరించుకొన్నాయి.*

ప్రకృతి మైకపు చూపులకు రాగరంజితుడైన అరుణుడు ఆవిడకు తన నులి వెచ్చని కరాలతో చక్కిలిగిలి పెడుతున్నాడు—

ఒకచేత్తో తెల్లచీర నల్లనిఅంచు కొద్దిగా కాళ్ళమించి పైకి పట్టుకుని, మరొకచేతిని గట్టువిూద ఆనించి ఆచేతి విూద కొద్దిగా వెనక్కుజరిగి, చెరువులోని నీళ్లలో కాళ్ళ జీరాడేసి లోపలికి చూసుకోలేక చూపులను చుట్టు ప్రక్కలకు తిప్పిన వారిజ ఒక్కసారి ఉలిక్కిపడింది—

ఆమెనలా ఉలికిపడేలా చేసినవి మరొక జతకళ్ళు—ఆకళ్ళు రామచంద్రవి—

వారిజ ఉలికి పడేవరకూ తను వారిజకేసి కళ్ళప్పగించి చూస్తున్నానని రామచంద్రకే తెలీదు—వారిజ ఉలికిపాటువల్ల తానున్న తన్మయత్వంలోంచి బయటికి రాగలిగాడు—బాహ్యస్మృతిరాగానే భరింపరాని లజ్జ ఆవేశించింది—చటుక్కున తలవంచుకుని చకచక అడుగులువేస్తూ కదిలిపోయాడు—

ఏదో తన్మయత్వంలో ఉన్నట్లున్న అతనిచూపు—అంతలో కలిగిన బెదురు—ఏదో తప్పుచేసినవాడిలా లజ్జతో చకచకా కదిలిపోతున్న కాంతి వంతమైన అతని ఆకృతి—ఇవన్నీ ఒకదానిని మించిన వేగంతో మరొకటి వారిజ మనసును ఆవరించుకున్నాయి—కొన్ని క్షణాలు అలాగే కూర్చుని నవ్వి అక్కడినుంచి లేచింది.

ఆ తరువాతి రోజుకూడ అతను కనిపించాడు వారిజకు. కానీ, ఈసారి పరకులా గబగబ నడిచిపోలేదు—ఒకసారి వారిజవంక చూసి తలవంచుకున్నాడు

## కొత్త సీరియల్ ప్రారంభం



కొద్దిసేపట్లోనే మళ్లీ తలెత్తి వారిజ వంక చూసాడు—అప్రయత్నంగా వారిజ నవ్వింది—

సిగ్గుపడినట్లు తల తిప్పుకుని నెమ్మది నెమ్మదిగా కదిలిపోయాడు—

ఆ తరువాతి రోజు వారిజ అతనికోసం చూస్తూ కూచుంది—బాగా తెల్లవారి పోతుండగా నెమ్మదిగా వస్తున్నాడు అతను—వారిజను అతడు చూసాడనటానికి గుర్తుగా తల బాగా వంచుకుని ఎటూ తిప్పకుండా ఏటికేసి వస్తున్నాడు. బాగా దగ్గరగా చూడగలిగింది అతణ్ణి—పచ్చని శరీరచ్ఛాయ—చిన్నకళ్లు—రేఖలుగా సాగిన కనుబొమలలో, పలచని చెక్కిళ్లలో, కొద్దిగా ముడుచుకున్నట్లున్న పెదవులలో ఏదో అమాయకత్వం కనిపిస్తోంది—పెద్ద రూపసి అనడానికి లేకపోయినా ఒక వింత ఆకర్షణ ఉంది మనిషిలో—

'ఇంత ఆలస్యంగా వచ్చారేం?'

ఉలిక్కిపడి తలెత్తాడు—ఎదురుగా సౌందర్యదేవతలా చిరునవ్వు మెరుస్తోన్న వారిజ—

ఆ ప్రభాత కాంతులలో పులకరింతలతో విప్పుకొంటోన్న కమలంలా స్నిగ్ధంగా మెరిసిపోతోంది నిజునా—ఎన్నాళ్లనుండో పరిచయం ఉన్నదానిలా అతి చనువుగా అడిగేస్తోంది—

చిత్రం! తనకూ ఆమె అపరిచితలా కనిపించటంలేదు—

తెల్లని జరీచీర తెల్లని జాకెట్టు—తెల్లని ముత్యాల గొలుసు—తెల్లని పువ్వులు—

ఆ ధవళ తేజోరాశిలో కాంతి పుంజం గర్భాన కటిక చీకటిలా నల్లని నల్ల పూసలతాడు కంఠాన్ని చుట్టుకొని అతణ్ణి భయపెట్టింది—

ఆనల్ల పూసలమీద నిలిచిన చూపులు బలవంతాన మరల్చుకుని సమాధానం చెప్పాడు—

'ఈపాటికి మీరు వెళ్లిపోతారను కున్నాను—' కిలకిల నవ్వింది వారిజ—ఆ నవ్వులలో అప్పుడప్పుడే చైతన్యం పుంజు కొంటోన్న ప్రకృతి యావత్తూ ఊగిపోయింది—

ప్రకృతి సిద్ధంగా బిడియస్థుడైన అతని బిడియం కరిగిపోయింది—

కనురెప్పలెత్తి, తనను తినుమరిచి ఏదో అపూర్వదృశ్యం చూస్తోన్నట్లు మధుర విభ్రాంతితో నిలిచి పోయాడు—అప్పుడు తెలిసింది వారిజకి—అతని కన్నులలో అమాయకత్వం మాత్రమేకాక తైక్ష్ణ్యం కూడా ఉందని—

వన్నెమారిన బిడియమేకాక అంచి మారిన ఆత్మాభిమానానికి కూడా అతని అంతరంగం నెలవని—

'ఇప్పుడు వెళ్లిపోతారా మరి?'

చిలిపిగా అడిగింది—.

ఏదో ఆర్ద్రత అంతర్లీనమైన చిలిపి తనం, చైతన్యం—తొణికిసలాడే ఆ తళ తళలాడే కన్నుల్లోకి ఒక్క రెండు క్షణాలు చూసి చటుక్కున తలవంచుకుని అన్నాడు—

'అంత తేలిగ్గా కదలలేననిపిస్తోంది—అయినా వెళ్ళిపోడానికే ప్రయత్నిస్తాను—'

గిర్రున వెనక్కు తిరిగి రెండడుగులు వేశాడు—

'ఆగండి—' నవ్వుతో అంది వారిజ—అవిడ ఆమాట అంటుందని ముందే ఊహించినట్లు ఆగి దగ్గరగా వచ్చాడు రామచంద్ర—

'రెండు రోజుల్నించీ ఎందుకంత తెల్లవారుజామునే వస్తున్నారు మీరిక్కడికి?'

'రెండు రోజుల్నించీ వస్తున్నది మీరు—నేను చాలా కాలంగా రోజూ వస్తున్నాను—తెల్లవారితే అందరూ వస్తారు. అందుకని తెల్లవారుజామునే వచ్చి ఏటిలో ఈతలు కొట్టుకుంటాను—'

'మరి ఏటిలో దిగకుండానే వెళ్లిపోయారేం?'

రామచంద్ర సమాధానం చెప్పలేదు. తలెత్తి ఒక్కసారి వారిజ కళ్లలోకి చూసాడు—'సమాధానం మీకు తెలుసు—' అన్నట్లు—

'మీ ఏకాంతానికి అంతరాయంగా నేను దాపురించానన్నమాట!'

నవ్వింది వారిజ—

'దాపురించలేదు — సాక్షాత్కరించారు—అంతరాయంలా కాదు—ఆశించని అదృష్టంలా...'

'కవిత్వం చెపుతున్నారు...'

'నేను కవినికాదు—కనీసం రచయితనైనా కాను—మామూలు రైతును—'

'మీరు చదువుకోలేదా?'

ఆశ్చర్యంగా అడిగింది వారిజ—

'ఎగ్రికల్చరల్ పాసయ్యాను—స్వంత వ్యవసాయం చేసుకుంటున్నాను—'

'ఓహో...'

అని ఆగింది వారిజ.

'మీరు......?' సందేహపు తెరలు చీల్చుకుంటూ అడిగాడు—

'నేనా? నేను?...ఏమో, నాకేంతెలుసు?'

'అదేమిటి?'

'మన మెవరమో మనకు తెలియక పోవటమే కదా సృష్టి రహస్యం!'

'వేదాంతం మాట్లాడుతున్నారా?'

'కాస్త లోతుగా ఆలోచిస్తే ఈ జీవితంలో వేదాంతంగా పరిణమించని దేది?'

'నిజమే! లోతుగా ఆలోచిస్తే ప్రతిదీ వేదాంతంలానే అనిపిస్తుంది—కాని అప్పుడు వేదాంతం అంటే చప్పిడి శూన్యత్వం కాదని, మమతా మానవతలతో అల్లుకున్న దివ్యత్వపు సోపానపంక్తని అర్థమవుతుంది—'

కళ్లువిప్పార్చుకుని చూసింది వారిజ—అంతలో అప్రయత్నంగా ఆ నల్లని కళ్లలో తెల్లని నీటిబిందువులు మిలమిల

# చీకటి కడుపున...

లాడాయి—

కలవర పడ్డాడు రామచంద్ర—

'ఉహూ! మిమ్మల్ని గురించి ఏమీ అడగను—కానీ ఆ నీటిబిందువులు!... అవి తుడిచెయ్యండి!— నా కారణంగా ఆ అందమైన కళ్లలో కన్నీరు చోటు చేసుకుంటె నేను సహించలేను—'

వారిజ చప్పున కళ్ళు తుడుచుకుంది—

'అవి కన్నీళ్లు కావు — మీ కారణంగా రాలేదు—నా గురించి చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు—'

ఒక్క క్షణం ఆగి అల్లరిగా నవ్వి అంది వారిజ—

'కానీ—ఇలా మనం నిలబడి మాట్లాడు కొంటూంటె నలుగురూ ఏమనుకుంటారు? అప్పుడే చూడండి—ఏటికొచ్చే వాళ్లంతా మనకేసి ఎలా చూస్తున్నారో?'

రామచంద్ర ముఖం ఎర్రబడిపోయింది—వడిలిపోయిన ముఖంతో 'వస్తాను' అంటూ అడుగు ముందుకు కదిపాడు—

'రండి—మా ఇంటికి వీలు చూసుకుని—రామాలయం తెలుసుగా! దాని కెదురుగా ఉన్న సందులో పెంకుటిళ్ల మధ్య పెద్ద మేడ నాదీ' వస్తారుగా?'—

రామచంద్ర సమాధానం చెప్పలేదు—

వడిగా కదిలిపోయాడు—ఏటి దిక్కుకు కాదు—వెనక్కు— అతడు కనుమరుగయే వరకూ అక్కడే నిలబడిపోయింది వారిజ—

ఏటికి వచ్చేపోయే జనం తనను వింతగా చూసి నవ్వుకోవటం తెలుసు వారిజకి—ఇలాంటి విషయాలకు విలువనిచ్చేదశ దాటి పోయింది ఆమె జీవితంలో—

నవ్వులూ వెక్కిరింతలూ, ప్రశంసలూ మన్ననలూ అన్నీ ఒకటే ఆవిడకిప్పుడు—

బరువుగా అడుగులు వేస్తూ తన ఇంటికి కదిలింది వారిజ—

* * *

వారిజ అనుకున్నట్లే రామచంద్ర ఆరోజు మరునాడూ కూడా వారిజ ఇంటికి రాలేదు—ఏటి గట్టున కనిపించనూ లేదు—

అయినా వారిజ తెల్లవారుజామున ఏటి గట్టున కూర్చోవటం మానలేదు—

దూరంగా కనిపిస్తోన్న ఆకృతిని చూడగానే గుండె ఝల్లుమంది వారిజకు—అతనే! వస్తున్నాడు — పరవాలేదు—తన బ్రతుకులోనూ ఇంకా కొంత మాధుర్యం మిగిలిఉంది—

వారిజను చూసి ఒక్క క్షణకాలం ఆగిపోయి మళ్లీ ముందుకు అడుగులు వేసాడు. రామచంద్ర—

'రెండు రోజులుగా రావటం లేదే?'

మామూలుగా అడిగింది వారిజ—

అతను తలఎత్తి వారిజ ముఖంలోకి చూసాడు—

'రాకుండా ఉండగలనేమో—నన్ను నేను పరీక్షించు కోవటానికి ఆగిపోయాను—'

'ఊ.!' ఏమయింది పరీక్షాఫలితం?'

'తెలుస్తోందిగా!'

వారిజ కళ్ళు వింతగా మెరిసాయి — ఆ మెరుపుల్ని ఏరుకోకుండా ఉండటం రామచంద్రవశం కాలేదు.

'మీరే జయించారు — మా యింటికి రాకుండా ఉండగలిగారుగా!'

విస్మారంగా అంది వారిజ—

'కాదు — ఓడిపోబట్టే మీ ఇంటికి రాలేక పోయాను—'

'అంటే?'

'స్పష్టంగా చెపుతున్నాను—ఇంతవరకూ ఏ స్త్రీతో మాట్లాడినప్పుడూ నా కింత సంకోచం కలగలేదు — నా శరీరం ఇలా వణికిపోలేదు—అందుకే మీ ఇంటికి రాలేక పోయాను—'

'ఇంకేం! మీ వణుకు మిమ్మల్ని కాపాడుతుందిగా! రండి! అయినా ఒక్క మాట! మీకు నాతో నమ్మకం లేక పోవచ్చు—కానీ నాతో నాకు నమ్మకం ఉంది—మిమ్మల్ని కాపాడి ఎలావచ్చారో అలా బయటికి పంపే బాధ్యత నాది! రండి—'

కొంచెం బాధగా అంది వారిజ—

అసహనాన్ని సూచిస్తూ అతని కను రెప్పలు అల్లల్లాడాయి. కలవరం కంఠంలో పలికింది—

'కాదు—మీలో నమ్మకం లేక పోవటం కాదు—ఈనాడేకాదు—ఏనాడూ మీలో నాకు అపనమ్మకం కలుగదు—అవిశ్వాసం నామీద నాకు—'

'మీ ఆత్మ పరిజ్ఞానం ఇంతగా జాగృతమయి ఉన్నప్పుడు, మీ రెక్కడి కెళ్తేనేం?'

వివరిమధ్య ముసిరిలే సేం ?'

'ప్రలోభాలు పరిజ్ఞానాన్ని అతి తేలికగా క్రమ్మివేస్తాయి—తాత్కాలికమే అయినా ప్రలోభం జయించి పరిజ్ఞానం అణగిపోతే, ఆ తరువాత పరిజ్ఞానం మేల్కొని ఎంత కుమిలిపోయినా ప్రయోజనం ఉండదు—'

వారిజకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి—

రామచంద్ర ఆందోళనగా చూశాడు—

'ఏమిటిది? ఎందుకు?'

వారిజ ముఖం తిప్పుకుంది—

'మీరు మా ఇంటికి రానంటున్నందుకు......'

'వస్తాను—'

'ఎప్పుడు?'

'ఎప్పుడు రమ్మంటారు?'

'మీ యిష్టం—ఎప్పుడైనా సరే!'

'ఇవాళ సాయంత్రం నాలుగు గంటలకు వస్తాను—సరేనా!'

'తప్పకుండా రావాలి—'

'తప్పకుండా!'

'సరే! నేను వెళతాను—మీరు సుఖంగా స్నానం చెయ్యండి—'

గాలిలో తేలిపోతూ వెళ్ళిపోయింది వారిజ—

ఉదయంనుంచీ ఆత్రుతగా గడియారాన్నే గమనిస్తోన్న వారిజ నాలుగు కొట్టగానే ఒక్కసారి తేలిగ్గా నిట్టూర్చింది—కానీ, ఆ తరువాత సెకన్లుకూడా భరింపరానంత దీర్ఘంగా తయారయిపోయాయి—వాల్గు గంటలవరకూ సాగిన నిరీక్షణకంటే నాలుగయిన తరువాత నిరీక్షణ మరింత ఉద్వేగపూరితమయి వారిజ మనసుని మెలిపెట్టేసింది—బెదురు బెదురుగా లోపలకు అడుగుపెట్టోన్న రామచంద్రను చూడగానే వారిజ ముఖంలో వేయి చందమామల వెన్నెలలు విరిసాయి—

'రండి—అంత సంకోచం పనికిరాదు—'

సాదరంగా ఆహ్వానిస్తూ సోఫా చూపించింది—

ఆ ఇంటి గుమ్మాలకూ కిటికీలకూ తగిలించిఉన్న తెరలూ, నేలమీద పరచిన తివాసీలు—ఖరీదైన సోఫాసెట్లూ, మూలంగా బల్లమీద ఉన్న అర్ధనగ్న నాట్యసుందరి శిల్పమూ ఇవన్నీ గమనిస్తూ ఆవిడ ధనికురాలై ఉండాలని నిర్ణయించుకున్నాడు రామచంద్ర—

'వారెవరు?' అన్నాడు ముట్టాడుతూ—

'వారు ఎవరు?'

'అదే మీ శ్రీవారు...' తలవంచుకుని అన్నాడు.

ఒక్కక్షణం అయోమయంగా చూసిన వారిజ అంతలో పకాలున నవ్వింది—

రోషంగా తలెత్తాడు రామచంద్ర-

'ఎందుకలా నవ్వుతారు?

రామచంద్ర చూపుల ననుసరించిన వారిజ చూపులు ఆవిడ మెడలోని నల్లపూసలతాడును తడిమాయి—ఆనల్లపూసల దండను చేత్తోపట్టుకుని చెక్కిలికానించుకుని బరువుగా రామచంద్రను చూస్తూ అంది వారిజ.

'మావారు వాడగ్గిరే ఉన్నారు—'

ఎక్కడ?'

'ఇక్కడే!'

'ఏది?' వింతగా చూట్టూ చూశాడు రామచంద్ర—

'వాళ్ళకి కనిపిస్తున్నారు—మీకు కనిపించటంలేదంటే ఏం చెప్పను?'

ఆమె దియున్నులు ముసిసెరదాల్ని అణచటానికి ప్రయత్నిస్తూ అంది వారిజ—

'మీరు నన్ను ఆటలు పట్టిస్తున్నారు—ఎందుకీ అబద్ధాలు?' కోపంగా అన్నాడు—


వారిజ కిలకిల నవ్వింది—

'ఆటలాడుతున్నది నిజమే అయినా ఆడినవి మాత్రం అబద్ధాలుకావు—అయినా అంతలా ఉడుక్కోవచ్చా! ఛీళ్ళ...'

అల్లరిగా రెండు వేళ్ళూ ఒకదానితో ఒకటి జోడించి ధనుస్సులా వంచి అతని ముందుకు జాపింది వారిజ. అణువణువునా సౌందర్యం నింపుకున్న ఆ లావణ్యరాశికి ఈ చిలిపితనం మరో క్రొత్త ఆకర్షణను తేడగా ముగ్ధుడయి చూస్తూ ఊరుకున్నాడు రామచంద్ర—

తను స్వయంగా తయారుచేసిన ఫలహారం పళ్ళెం అతని ముందుకి జరిపి 'తింటూ మాట్లాడండి—' అంటూ నవ్వింది వారిజ—

రామచంద్ర ముఖం ఎర్రబడింది—చటుక్కున తల దించుకున్నాడు—



'నాకేం పర్వా — మీ ఇద్దర్నీ చూసి పోదామని వచ్చాను — వారెప్పుడు వస్తారు?'

అంటూనే లేచాడు —

'కూర్చోండి - మనం ఇంత విశ్వాసంగా మాట్లాడుకొంటున్నప్పుడు కూడా మీరు ఆత్మవంచనకు సిద్ధపడటం న్యాయం కాదు — మీరు మా వారి ఆహ్వానం మీద రాలేదు — ఆయనకోసమూ రాలేదు — ఇవి తినకుండా మీరు వెళ్తే నన్ను ఘోరంగా శిక్షించినవారవుతారు - తీసుకోండి —'

రామచంద్ర మాట్లాడకుండా కూర్చుని ఫలహారం పళ్ళెం ముందుకు తీసుకున్నాడు —

'ఆయన ఎప్పుడొస్తారు?'

మళ్ళీ అడిగాడు —

వారిజ కనుబొమలు ముడుచుకున్నాయి —

'అసలు రారు —'

ఉలికిపడ్డాడు రామచంద్ర —

'అదేం?'

'అంతే! నేనే ఆయన దగ్గరకు వెళ్తాను —'

'అంటే! ఈ ఊళ్ళో లేరా?'

'ఊహూ! మాది మద్రాస్ - నేను ఒక

# చీకటి కడుపున ...

పనిమీద ఈ ఊరు వచ్చాను — కొంచెం రోజుల్లో వెళ్ళిపోతాను —'

చటుక్కున రామచంద్ర ముఖం పాలిపోయింది — చేతుల్లో తీసుకున్న ఫలహారం పళ్ళెంలో పడిపోయింది.

'వెళ్ళిపోతారా?'

చిలిపిగా నవ్వింది వారిజ —

'మరి, ఉండిపోనా? ఎక్కడ?'

ఉలిక్కిపడ్డాడు రామచంద్ర — ఏం మాట్లాడలేక ఫలహారం తింటున్నట్లు తలవంచుకున్నాడు —

'నెమ్మదిగా తినండి — కంగారేంలేదు —'

మంచినీళ్ల గ్లాసు దగ్గిర పెడుతూ నవ్వింది వారిజ —

'మరి, మీ శ్రీమతిని తీసుకురాలేవేం?'

తలెత్తి వారిజను చూసాడు రామచంద్ర —

'నాకింకా పెళ్ళికాలేదు —'

'మరి, ఇక్కడ ఎవరా అమ్మగారూ —'

'మా అమ్మా నాన్నగారూ కాకినాడలో ఉన్నారు. మా చెల్లెలు పెళ్ళయి అత్తవారింట్లో ఉంది — ఇక్కడ నేనొక్కడినే ఉంటున్నాను —'

'వంట?'

'నేనే చేసుకుంటాను - పొలం పనులు చేసుకో గలిగినవాడికి వంట ఒక లెక్కలోదా?'

'పోనీ ఈ నాలుగు రోజులూ భోజనానికి మా ఇంటికి రాకూడదూ!'

'ఊహూ! అది కుదరదు -'

కటువుగా అన్నాడు రామచంద్ర —

అతని కటుస్వరానికి ముఖం చిన్నబోయింది వారిజకు —

'క్షమించండి — మీకు శ్రమ కలిగించటం ఇష్టంలేక అన్నాను —'

'ఓహో! నాకు ఏది శ్రమో ఏది సంతోషమో మీకేం తెలుసు?'

'తెలిసినా భోజనానికి ఇక్కడికి రాలేను — ఇది పల్లెటూరు — నాకేం! మొగుణ్ణి. బ్రహ్మచారిని — ఏదైనా మాటవస్తే మీ బ్రతుకేం కావాలి?'

వారిజ ఒక్క నిట్టూర్పు విడిచి ఇంక వాదించకుండా ఊరుకుంది

కాఫీ కూడా పూర్తిచేసి లేచాడు రామచంద్ర —

'రాత్రికి భోజనం అక్కర్లేదు అంత బాగుంది, మీ ఫలహారం. మీ వంటమనిషి చాలా మంచిది —'

'అవి వంటమనిషి చెయ్యలేదు — నేనే చేసాను —'

'అవేం?' అని అడగలేదు రామచంద్ర — సమాధానం అతనికి తెలిసిపోతోంది — అది గట్టిగా అనుకోవటానికే వణికిపోతున్నాడు —

'నేను వెళ్తాను —'

'మళ్ళీ ఎప్పుడు కనిపిస్తారు?

ఒక ఊళ్ళో ఉంటున్నాంగా! కనపడక పోతామా?'

'అంటే మీరిక ఇక్కడకు రానన్న మాట!'

'మీ క్షేమం కోరి...'

'నేను మీ ఇంటికి రావచ్చా!'

'తగినంత — ప్రత్యేకమైన అవసరముంటే తప్పకుండా రండి —'

చేతులు జోడించి వెళ్ళిపోయాడు రామచంద్ర — గోడ నానుకుని శిలలా నిలబడిపోయింది వారిజ.

(ఇంకా వుంది)

## మహీధరోక్తులు

మహీధర నళినీమోహన్‌రావు



వగలు పోవు పెల్లు వన
జాక్షులకు నైజ
మదియ ప్రేమ చిహ్న
మనగదగదు
నెమలి నాట్యమాడు నీ
కోసమా యేమి?
హృదయ వర్తి యీ మహీధరోక్తి

# దీనదయాళ్ ఉపాధ్యాయ దుర్మరణం

ఫిబ్రవరి పదకొండవతేదీన భారతమాత ఒక పుత్రరత్నాన్ని కోల్పోయింది. జన సంఘ్ నాయకుడు దీనదయాళ్ ఉపాధ్యాయ ఇప్పుడు మనమధ్య లేరు. ఇక ఉండరు!

ఆయన చాల ఘోరమైన దుర్మరణం పాలయ్యారు. పదకొండవతేదీ ఉదయం ఒక రైల్వే పనివాడు మొఘల్‌సరాయ్ స్టేషనుకు ఫర్లాంగు దూరంలో ఒక శవాన్ని చూశాడు. అది దీనదయాళ్ గారిది. శరీరం మీద గాయాలున్నయి. తలమీద గట్టిదెబ్బ, చేతులు, చీలమండలదగ్గర చిన్న చిన్న దెబ్బలు కనిపించాయి.

ఉపాధ్యాయ పఠాన్‌కోట — సీల్దా డవున్ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో లక్నోనుంచి పాట్నాకి ప్రయాణం చేస్తున్నప్పుడు ఈ ఘోరం జరిగింది.

ఉపాధ్యాయ మరణం గురించిన దుర్వార్త విన్న మరు క్షణంలో ఉత్తరప్రదేశ్ నుంచి కొందరు ఉన్నతోద్యోగులు విచారణ జరపడానికి వచ్చారు. 'తలమీద ఎవరో బలంగా కొట్టడంవల్ల ఆయనకి స్పృహ తప్పిందని, తక్కిన గాయాలవల్ల మరణం సంభవించిందని, ఆయన చనిపోయిన తర్వాత చీలమండలు మెలి తిప్పబడ్డాయని, పోస్టుమార్టమ్ ధృవపరచింది. ఆయన చనిపోయిన అసాధారణ పరిస్థితులు, చనిపోయిన తీరు చూస్తుంటే—ఎవరో కావాలని హత్య చేశారు అనే ప్రచారం నిజమేననిపిస్తుంది.


ప్రక్కపెట్టెలో ప్రయాణించిన యస్. యల్. శర్మ అనే అతనికి ఈ హత్యతో సంబంధంవుందని అనుమానిస్తున్నారు. ఇంత వరకు అతని ఆచోకీ తెలియలేదు.

హత్య రహస్యాన్ని కూపీ తీస్తుండగా ఒక విషయం బయటపడింది. దీనదయాళ్ ప్రయాణం చేస్తున్న రైలుని ఒక అరగంట ఆపినందుకు తనకి ఏడువందల రూపాయలుదాకా ముట్టాయని ఒక రైల్వే పోర్టరు వాంగ్మూలమిచ్చాడు!

ఇదంతా చూస్తే మృత్యువు ఆయనని వెన్నాడి వచ్చిందా! అనిపిస్తుంది. యమ్. యల్. సి. పీతాంబరదాస్ లక్నో స్టేషన్లో ఆయనకి వీడ్కోలు ఇవ్వడానికి వచ్చారు, నాలుగు బెర్తుల ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌తో దీనదయాళ్ గారికి రిజర్వేషన్ వుంది. రెండు బెర్తులున్న ఒక కంపార్ట్‌మెంట్‌లో ఖాళీ వున్నదని, అక్కడ శ్రీ దీనదయాళ్ సుఖంగా ప్రయాణించడానికి వీలవుతుందని శ్రీదాస్ ఆయనని అందులోకి మార్చారు. అదే కంపార్ట్‌మెంట్‌లో వున్న తన మిత్రుడ్ని మరో పెట్టెలోనికి వెళ్ళమని శ్రీ దాస్—కోరారు. ఆ మిత్రుడు అంగీకరించి, మరో పెట్టెలోకి మారాడు. ఉపాధ్యాయ ఒంటరిగా మిగిలిపోయారు. అదే సాయంత్రం శ్రీ దాస్ కూడా మరో రైలులో ఢిల్లీకి బయలుదేరారు.

ఢిల్లీలోని నిగమ్‌బోధ్‌ఘాట్‌లో దీనదయాళ్ ఉపాధ్యాయ భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. ఈ మహానాయకునికి శ్రద్ధాంజలి ఘటించడానికి యాభైవేలమందికి పైగా హాజరయ్యారు. మంటలు పైకి లేస్తున్నప్పుడు చూసి ఓర్చుకోలేక పైకి ఏడ్చినవాళ్లు వందల కొద్దీ వున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఆయన మరణానికి సంతాపసూచకంగా మూసివేశారు.

ఉపాధ్యాయ భౌతికకాయానికి సరయిన మర్యాదలు జరగలేదని జనసంఘ నాయకుడు శ్రీ వాజ్‌పాయి తమ అసంతృప్తిని ప్రకటించారు. ఉపాధ్యాయ హత్యా రహస్యాన్ని శోధించడానికి గట్టి విచారణ సంఘాన్ని నియమించాలని ఆయన కోరారు.



శ్రీ. శే. ఉపాధ్యాయ.

త్యాగనిరతి, సేవాతత్పరత, పరోపకార దీక్ష దీనదయాళుడైన ఉపాధ్యాయలో వున్న సుగుణగణాలు. పరిసరాలకి ఉన్నతంగా లేచి వికసించిన పద్మంలాంటి కీర్తి ఆయనది. ఆయన ఆదర్శం, దేశభక్తి మరువరానివి.

దీనదయాళ్ మథురజిల్లాలోని ఫరా అనే గ్రామంలో 1917 అక్టోబరు ఏడవతేదీన జన్మించారు, చిన్నతనంలో తలిదండ్రులు మరణించారు. రైల్వే ఉద్యోగస్తుడుగా వున్న మామయ్యదగ్గర పెరిగారు. జయపూర్‌లోని బిర్లాకాలేజీనుంచి ప్రథమశ్రేణి పట్టభద్రుడుగా బయటికి వచ్చారు.


విద్యాభ్యాసం ముగిసిన తర్వాత ఆర్. యస్. యస్. ఉద్యమంలో చురుకైన పాత్ర తీసుకున్నారు, 1951 లో డా. శ్యామప్రసాద్ ముఖర్జీ జనసంఘ్‌ని స్థాపించగానే అందులో చేరారు. అనతికాలంలోనే జనసంఘ్ పార్టీకి కార్యదర్శి అయ్యారు. పద్నాలుగు సంవత్సరాలు అదేపదవిలో వుండి అచంచల కృషి చేశారు. క్రిందటి డిసెంబరులో జనసంఘ్ పార్టీ ఏకగ్రీవమైన ఎన్నికలో అధ్యక్షుడయ్యారు!

శ్రీ ఉపాధ్యాయ ఆడంబరంలేని వ్యక్తి. తెల్లటి చొక్కా, మోకాళ్లవరకు పంచెతో అతి సామాన్య పౌరుడుగా కనిపించేవారు.

భాషా వివాదంలో పార్టీలో కొన్ని చీలికలు ఏర్పడ్డాయి. దక్షిణాదిలో హిందీ వ్యతిరేక కార్యక్రమం పార్టీ లక్ష్యాన్ని కొంచెం తికమక పెట్టింది. దేశ పరిస్థితుల్ని ప్రజలకి బహిర్గతం చేయడానికి ఆయన కొన్ని గ్రంథాలు రాశారు. 'భారతీయ అర్థనీతి', 'రాష్ట్ర జీవన్‌కి సమస్యా' అనేవి ఆయన హిందీ గ్రంథాలు. 'ది టు ప్లాన్స్: ప్రామిసెస్ అండ్ ప్రాస్పెక్ట్స్' అనేది ఆయన ఆంగ్ల రచన.

శ్రీ బలరాజ్ మధోక్ నుంచి ఏడువారాల క్రితం జనసంఘ్ అధ్యక్షపదవిని స్వీకరించారు. శ్రీ మధోక్, శ్రీ వాజ్‌పాయి లాంటి పార్టీ నాయకుల్ని సమన్వయపర్చడానికి శ్రీ దీనదయాళ్ చేసిన కృషి మరువరానిది.

—పి. ఎస్. ●



# భక్తులను ఏమార్చే భగవంతుడు
## నర్మపథం

[illegible] ఉయ్యూరు వేంకటరమణయ్య

[illegible] అట, తులసీదాసు యింకా 'పనిపిల్ల' నీటిని తన ఆశ్రమం పక్కనున్న మర్రి చెట్టు మొదట పోస్తూ ఉండేవాడు. [illegible] రాశి కోవాలి!

తులసీదాసు ప్రతిదినమూ [illegible] ఎంత కాలంనుంచో ప్రయత్నిస్తున్నా [illegible] నేనుకున్న [illegible] ఆతనికి శ్రీరాముడు అనుగ్రహించి దర్శనం యివ్వలేదు.

ఒకనాడు మర్రి మొదట నీళ్ళుపోసిన తర్వాత అతనికి ఒక బ్రహ్మరక్షస్సు ప్రత్యక్షమైంది! భగవద్దర్శనంకోసం తహతహ పడుతున్న తనకు బ్రహ్మరక్షస్సు ప్రత్యక్షం కావడం తులసీదాసుకు వింతగా తోచింది. ఈ సంఘటనను గురించి అతడు యోచిస్తూ వుండగా ఆ భూతం—

'అయ్యా! నేను వెనకటి జన్మలో చేసుకున్న పాపాలవల్ల యీ జన్మలో ఇలా అయాను. మాకు కొలనుల్లోనూ, నదుల్లోనూ ఉన్న నీరు తాగడానికి అధికారం లేదు. ప్రతిరోజూ నీవు ఈ చెట్టు మొదట పోస్తున్న నీరు తాగి దప్పి తీర్చుకుంటున్నాను. నీకు కృతజ్ఞుణ్ణి. నాకు చేతనయిన ఉపకారం నీకు చెయ్యాలనే సంకల్పంతో వచ్చాను. ఏమికావాలో చెప్పు' అని చెప్పింది.

తులసీదాసు ఆత్రంతో 'అయితే, నాకు శ్రీరాముడు దర్శనం యిచ్చేటట్లు చెయ్యి' అన్నాడు. ఆ మాటకు రక్షస్సు నవ్వుతూ 'అలాటి శక్తి నాకు వున్నట్లయితే నేనే అతడిని దర్శించి తరించలేనూ? ఆ శక్తి నాకులేదు. కాని, శ్రీరామ దర్శనం అయే ఉపాయం చెప్తాను' అన్నది.

తులసీదాసు ఆప్యాయంతో వినసాగాడు.

'ఈ పక్కవూరిలో ప్రతిరోజూ సాయంకాలం రామాయణ పురాణపఠనం జరుగుతూ వుంటుంది. జనసమూహానికి చివర ఒక వృద్ధుడు కన్నీరు కారుస్తూ, వింటూ వుంటాడు. అతడు హనుమంతుడు! అతన్ని ప్రార్థించు, తప్పించుకోచూసినా విడవకు, నీ కోరిక నెరవేరుతుంది' అని ఆ భూతం చెప్పింది.

నాటి సాయంకాలమే తులసీదాసు ఆ వూరికి వెళ్ళి, పురాణపఠనం పూర్తయే వరకూ వుండి, ఆ ముసిలాయనను కలుసుకున్నాడు. తన కోరిక చెప్పాడు. తాను సామాన్య మానవుడననీ, తనవల్ల ఆ పని సాధ్యం కాదనీ అతనన్నాడు. 'మీరు రామదూత హనుమంతులుకదా! మీకు సాధ్యం కానిదేమిటి!'

అన్నాడు తులసీదాసు, తాను తులసీదాసు అనుకొన్నవాడను కానని వృద్ధుడు ఎంత చెప్పినా తులసీదాసు, అతని కాళ్ళు పట్టుకొని శ్రీరాముని దర్శనం చేయించాలని పట్టుపట్టాడు. మారుతి అతని పట్టుదలను మెచ్చుకొని ఫలానా రోజు, ఫలానా

(62 వ పేజీ చూడండి)

# డాక్టర్ కబుర్లు

## ఊపిరికి తెరిపి

ఎందరో సాహిత్యాలు డాక్టర్లతో స్పెషలు పడుతూ ఉంటారు. ఇటు [illegible] గమనించ వలసిన [illegible] విషయం ఒకటి



ఇది—బొడ్డుని వెంటనే కొయ్యరాదు. పాప కనీసం రెండుసార్లయినా తనంతట తాను ఊపిరి తియ్యాలి.

41 మంది పిల్లలకి రెండవ శ్వాస తీసుకునేవరకే నాభినాళం కోయగా వారు ఊపిరి తియ్యటానికి కష్టపడ్డారు. 52 మంది బిడ్డలకి రెండవ ఊపిరి తీసిన తర్వాత బొడ్డు కొయ్యగా వారిలో ఆరుగురికి మాత్రమే ఈ ఇబ్బంది కలిగింది. బాగా ఆలస్యంగా కోసిన పిల్లలు ఇంకా తేలికగా ఊపిరి తీశారు.

తల్లి కడుపులోనుంచి బయటపడిన శిశువు రక్తప్రసారం సాధారణంగా జరగటానికి కొంత వ్యవధి కావాలి. ఇది చాలా అవసరం. ప్రాణానికి సంబంధించిన విషయం. పుట్టిన వారంలో నల్లబడి మరణించే బిడ్డలకి అతి త్వరలో బొడ్డు కొయ్యటం జరిగి ఉండవచ్చునని నిపుణుల అనుమానం.

డా. వి. ఎల్. హాన్సన్,

(కాపీరయిటు)

# ప్రశ్నావళి

## కె. రామలక్ష్మి

వి. వి. ఆర్, విజయనగరం

జవాబులేని ప్రశ్న ఏదైనా వుందా?

ఇదే!

ఎస్. ఎస్, ఖర్గపూరు

మీ ఆడవారు భర్తలు చెప్పినట్టు నడవరు కారణం?

మీ మగవారు చెప్పే ధోరణి అలాంటిది కనుక!

జి. డి. కె, రాజమండ్రి

నేటి యువతుల అలంకరణపై మీ అభిప్రాయం?

అలంకరణకేం? బాగానే ఉంది!

డి. ఎ, శ్రీకాకుళం

చదువునుబట్టి సంస్కారం వస్తుందా? మనస్సు స్వభావాన్నిబట్టి వస్తుందా?

మనిషిలో సంస్కారం అన్నది సహజంగా ఉండాలి. అప్పుడది పెంపొందే అవకాశాలు ఉంటాయి. అటువంటి సహజగుణం లేనివాడు ఎంత చదివినా ఒకటే.

బి. బి. డి. కొవ్వూరు

మా ఆఫీసరు చిన్నలంచాల నొల్లడు...

పెద్దకోడెనా గింజలే తింటుందా కాని, పెద్ద ఉద్యోగి చిన్న లంచములనొల్లడని చెప్పటం వెర్రి పాపం!!

జె. ఎల్. ఎమ్, బరంపురం

"మేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్" అన్నారు పెద్దలు. కాని యీనాటి పెళ్ళిళ్ళ విధానాన్ని చూస్తే అది అబద్ధమనిపిస్తుంది.

స్వర్గంలో నిర్ణయింపబడిన వివాహమైనా భూలోకంలో జరగాలి కదా! ఎంత దేవతకైనా మట్టి పాదలే" అన్నారు వినలేదా?

ఎస్. పి, జగిత్యాల

అర్ధ తెలివి హానికరం అన్నారు కదా, సంపూర్ణమైన తెలివివుంటే ఏమవుతుంది?

అటు మేధావో, ఇటు పిచ్చివాడో అవుతాడు మానవుడు!

పి. జె. ఆర్, పిఠాపురం

'ఉద్యోగం పురుషలక్షణం' అన్నారు. కాని నేడు స్త్రీలుకూడా చేస్తున్నా రెందుకంటి?

లీగల్ బాషలో 'మేన్' అంటే 'ఉమెన్' అని కూడా చెప్పుకోవచ్చు—సందర్భాన్ని పట్టి ఇక్కడ అంతే తమ్ముడూ.

కె. టి. ఆర్, జయపురం

జర్నలిజం ఒక విశిష్ట గుణమా? లేక అదృష్టముచే చేకూరుతుందా?

రెండూ కాదు. అనుభవం వల్ల సంపాదితమయే "రాయడం నేర్పే" జర్నలిజం.

ఎమ్. ఎస్. ఆర్, పిఠాపురం

సంఘంలో స్త్రీలు పొరపాటుచేస్తే ఆ స్త్రీని దూరంచేస్తారు. కాని పురుషుడు పొరపాటుచేస్తే నెట్టివేయరెందుకు?

పొరపాట్ల వల్ల స్త్రీపై బాధ్యత ఎక్కువ మోపింది ప్రకృతి. స్త్రీ సహజంగనే సర్వజీవ రాశికి మాతృమూర్తి కనుక. అంతటి ఉన్నత స్థానం నుండి భ్రష్టమవడాన్ని సహించడం కష్టం కదా?

టి. ఆర్. ఎల్. వెల్లటూరు

అన్ని ధర్మాలలోనూ ఏది ఘనమైనది?

నిజ దారసుతోదర పోషణా ధర్మం!

కె. పి, కుర్తాలం

మందు చేదెందుకు?

మంచి మందు మరింత చేదు! తెలుసా?

ఎల్. ఎల్. ఎన్. ఆర్, విశాఖపట్నం

నాకు మాటకిముందు కసరటం అలవాటు. ఏం చేయాలి?

చేయడానికేముంది? కసిరిన కసురు విసిరిన రాయి తిరిగిరావు అని గుర్తించండి.

పంచమచేతులు, హైదరాబాదు

ఈమధ్య రచయితల జవాబుల కంటే రచయిత్రుల జవాబులకు ఎక్కువ ప్రాచుర్యత లభిస్తోంది. ఇందుకు కారణం పాఠకులలో అధికభాగం పురుషులు, అందునా యువకులు కావడమేనని నా అభిప్రాయం. తమ వ్యాఖ్య?

రచయిత్రుల శీర్షికలకు పురుష జలగప్రోత్సాహం ఉండడంలో అసహజత నాకేం గోచరించలేదు స్వామీ, సృష్టి ఆది నుండి వస్తున్న ఆకర్షణను కాదనగల వారెంతమంది?

ఎమ్. ఆర్. ఆర్, వరంగల్

కాలం గడుస్తున్నకొద్దీ మనిషికి మనిషి యందు ప్రేమ నశించుటకు కారణమేమి?

కాలం గడిచే కొద్దీ మనుషులలో గుణాలు, సబ్బుకు ఉడినట్టు బయటపడి పోవడమే తమ్ముడూ.

కె. ఆర్. డి, మద్రాసు

మాపిల్లవాడిమధ్య చిల్లర కాజేస్తుండగా చూశాను. ఈ గుణం ఎలాపోగొట్టడం?

తెరచి ఉంచిన పెట్టె దేవుడికైన భ్రమ కలిగిస్తుంది. డబ్బు కళ్లపడకుండా పెట్టండి. చిన్నచిన్న ఖర్చులకి చిన్నమొత్తం జేబు ఖర్చు యిస్తూ ఉండండి. మీపిల్లవాడు మీడబ్బు జోలికి రాడు.

వి. ఎల్. ఎన్, కలకత్తా

ఎంత చెప్పినా పిల్లలు కట్టుకు పోరినా వినరు. సాయంత్రం అయేసరికి వెళ్ళిపోవాలి. వీరి నెలా మార్చడం?

కుదరని రోగమే—బుద్ధిహీనత. స్వంతంగా తెలుసుకోవాలి గని వయస్సులో పెద్దవారికి తెల్లియ్యజెప్పడం ఎవరితరం?

ఎం. వి. ఎస్. ఆర్, ఆలమూరు

మనిషి చనిపోయినా మనిషిలో సజీవునిగా ఉండేదేది?

కీర్తి అంటాం. అది నమ్మకం లేని రోజుల్లో!

కె. పి. డి, కాకినాడ

ఇలు మార్చితేగాని నా పంతం సపే మిరా వీల్లేదు అంటుంది మా ఆవిడ. ఏం చేయాలి?

ఏముంది? చెవులు పట్టి లాగితే బుర్ర తనంతట తానే వస్తుంది! మీ ప్రయత్నాలు చేసి ఏర్పాట్లు కానిస్తే సరి.

ఎస్. వి. ఎస్, బరంపురం

ఇటీవల కొందరు స్త్రీలు బొట్టు పెట్టుకొనకపోవడం నేను గమనిస్తున్నాను. ఇదొక ఫాషనా? వ్యక్తిగత కారణాలుంటాయా?

ఎలా చెప్పగలం? ఎవరి అభిరుచిని పట్టి వారు అలంకరించుకొంటారు. బొట్టు పెట్టుకోనివాడంత తెంగలేదు—ఉంటే కుంకుమ తప్పించి ఈ రకరకాలన్నీ పెట్టుకుంటారా?

ఎం. ఎం, కరీంనగరు

ఓర్పులేని పతితో బాధపడే పతికి మీరిచ్చే సలహా ఏమిటి?

ఆమెకు లేని ఓర్పు మీకైన లేకుంటే ఎలా?

# అమెరికా దేశంలో మా శ్రీవారితో నేనూనూ



మహీంధర సుభద్ర M.A.


మా శ్రీ వారికి ఫలానా దేశంలో రీసెర్చికి స్కాలర్‌షిప్ వస్తే వారు ముందర వెళ్లేరు. తరవాత నేనూ, పాప కలిసివెళ్లి వారిని అక్కడ కలుసుకున్నాం. ఇల్లా వెళ్లే అదృష్టానికి నోచుకోని, తెలుగు వారపత్రికలు మాత్రమే చదివే తెలుగుదేశపు మహిళామణులకి ఇక్కడ హేబిట్సూ కష్టమ్సూ (అంటే మరేం లేదు. అలవాట్లూ, ఆచారాలూనూ) తెలియజేయాలనిపించి ఈ లెటర్ రాస్తున్నాను.

మన దేశంలోకన్న ఇక్కడ చాలా మంచి వస్తువులు చాలా చీప్‌గా (అంటే చవగ్గా) దొరుకుతాయి. పెద్ద పెద్ద షాపులలో ఏది పడితే అది (అంటే ఏ చెత్తపడితే ఆ చెత్త అని కాదుసుమా) దొరుకుతుంది. ట్రాలీ (అంటే తోపుడు బండి) తోసుకుంటూ వెళ్లి మనకి కావలసిన ఆర్టికిల్స్ (అంటే వస్తువులు) ఆ ట్రాలీలో వేసుకుని తెచ్చేసుకోడమే. అఫ్‌కోర్స్ (దీనికి తెలుగులో మాటే లేదు. పూర్ తెలుగు!) మనీ పే చెయ్యాలనుకోండి. (అంటే డబ్బు చెల్లించాలన్న మాట) 'అణా కిస్తావా అర్ధణా కిస్తావా' అని మనవైపున ప్రాణం పోయొచ్చేదాకా గీసి గీసి బేరం చెయ్యడం ఇక్కడ ఉండదు. అన్నీ నీటుగా పాలిథిన్ బాగ్స్‌లో పాక్‌చేసి ఉంటాయి. (అంటే శుభ్రంగా పొట్లాలు కట్టి ఉంటాయని అర్థం) అబ్బ! ఏది చెప్పినా ఇంగ్లీష్ వర్డ్స్ (అంటే ఆంగ్లభాషా శబ్దాలు) వచ్చేస్తున్నాయి— నేను పెద్ద చదువులేమీ చదువుకోలేదు. మా ఊరి స్కూలులో 5 వ తరగతివరకే ఉండడంచేత అందాకా చదివేశాను. అంతట్లోకే మా శ్రీ వారు నన్ను పెళ్లిచూపులు చూసుకోడానికి రావడమూ, దేవుడి దయవల్ల నేను వారికి నచ్చడమూ, చేసుకుంటె ఈ అమ్మాయినే చేసుకుంటాను, లేకపోతే దేశాంతరాలు పట్టిపోతాను (అంటే ఫారిన్ వెళ్లడం కాదు సుమండీ!) అని వారు గట్టి పట్టుపట్టి తక్కువ కట్నంతోనే నన్ను పెళ్లి చేసుకోవడమూ జరిగేయి. అదృష్టవశాత్తూ అత్త, ఆడబడుచుల రగడ వాకులేదు. మావగారొకాయన ఉన్నారుగాని, మా శ్రీ వారు ఉద్యోగం చేసే సిటీ చాలాదూరం కావడంచేత కీళ్లనొప్పుల ముసలాయన అంతదూరం రాలేనని చెప్పేశారు. అదిగో ఆ విధంగా సిటీ కాపురం పెట్టేశాం ఒంటరిగా. ఏడాది తిరక్కుండానే మాకు పాప.

ఎందాకా చెప్పేనూ? ట్రాలీలో ఆర్టికిల్స్ వేసుకురావచ్చునని కదూ? ఇక్కడ పనివాళ్లుండరు. ఎంచక్కా మన పనులు మనమే చేసుకోవచ్చు. మన దేశంలో అయితే అంటగిన్నెలు తోమేవాళ్లు ఉంటారుగానీ ఏం బాగా తోముతారు? ఓ రోజు వస్తే రెండురోజులు ఆబ్సెంటు (అంటే నాగా). ఏ వెండిగ్లాసో, చెమ్చాయో దొంగిలించి పెట్టుకుని తలాయిస్తారు. ఇక్కడ అల్లాంటి ఇబ్బందు లేవీ లేకుండా మన అంటగిన్నెలు మనమే చక్కగా నున్నగా మెరుగ్గా తోముకోవచ్చు. బట్టలు ఉతికే వాళ్లు ఇక్కడ ఉంటారుగానీ ఆ పని కూడా జాలీగా మనమే చేసుకోవచ్చు. దాని కోసం వాషింగ్ మెషీన్లుంటాయి.

పిల్లలని ఎత్తుకోడానికి మన వైపున ఆయాలున్నట్లు ఇక్కడ ఉండరు. ఇక్కడి వాళ్లు పిల్లలని చాలా ముద్దుగా చూచుకుంటారు. 'నీ మొహం ఈడ్చా! నీ పిండం పిల్లులకి పెట్టా!' అని మన వాళ్లపిల్లలని అయిదు వీధులకి వినబడేలా తిట్టినట్లు వీళ్లు తిట్టరు. చక్కగా ఫేషనుగా ఫూల్ అనో, ఇడియట్ అనో రాస్కెల్ అనో అంటారు. అది అయినా పిల్లలని నలుగురి ముందరా చిన్నబుచ్చరు. అతిథులంతా వెళ్లిపోయాక పిల్లలని డ్రాయింగు రూములోకి పిలిచి ఒక తట్టువరవ చివాట్లు (పైన చెప్పిన రకానివి) వేస్తారు.

ఇక్కడ చంటి పిల్లలు బట్టలు ఇల్లా తడుపుకోడ మేమిటి, అల్లా డయపర్లు (అంటే లంగోటీల్లాంటి వనుకోండి) మార్చేయడ మేమిటి? మన వైపుకిలాగ పిల్లల్ని ఒంటిమీద బట్ట లేకుండా గాలికి విడిచిపెట్టెయ్యడం ఇక్కడ ఉండదు. చక్కగా ఒంటినిండా ఎల్లప్పుడూ స్వెట్టర్లూ కోటులూ; టోపీ లూ మేజోళ్లూనూ. మన వైపులాగ మొగాళ్లతో ఓ వైపున ఊసులాడుతూ, పమిట కొంగు అయినా సరిగ్గా కప్పుకోకుండా పిల్లలకు పాలు ఇచ్చే స్త్రీలు




ఇక్కడ కనబడరు. చక్కగా స్టెరిలైజ్ చేసిన బాటిల్సులో మిల్కు, ఫ్రూట్ జ్యూసెస్సూ పట్టేస్తారు. మన వైపులాగ ఆడవాళ్ళు రెండుకాళ్ళ మధ్యనీ చంటి పిల్లని వొక్కిపట్టి 'నెంబర్ టూ'కి వెళ్ళించెయ్యడంలాంటి దృశ్యాలు ఇక్కడ మచ్చుకైనా కనబడవు. కమోడ్‌మీద కూచోపెట్టేస్తారు. ఏడ్చినా, మొత్తు అంతే. ఇక్కడ మనవైపులాగ బాల్చీడు నీళ్ళు గుమ్మరించి కడగరు. చక్కగా టాయిలెట్ పేపరు యూజ్ చేస్తారు.

అన్నట్లు 'బేబీ సిటింగ్' అనే అద్భుతమైన సౌకర్యం ఒకటి ఇక్కడ ఉంది. భార్యా భర్తలు ఏ మూవీకో (అంటే తెలుగులో చెప్పాలంటే సినిమాకి), ఏ షాపింగుకో, ఏ పార్టీకో వెడితే వాళ్ళ పిల్లలని మనం చూసి, అలా చూసినందుకు డబ్బులు పుచ్చుకోవడం అన్నమాట. ఈ పని తప్పుకాదు సుమండీ! డిగ్నిటీ ఆఫ్ లేబరు. ఆ పని చేసూ చేశాను. గంటకి అరడాలరు చొప్పున ఇస్తారు. ఇదే మనవైపున అయితే ఏ ముసలమ్మ చేతిలోనో పిల్లల్ని పడేసి పోతారు లేదా వాళ్ళని కూడా తీసుకెళ్ళి వాళ్ళతో నానా అవస్థ పడుతూంటారు. మన వైపున టూరింగు టాకీసుల్లో ఆడా మగా వేరువేరుగా కూర్చుంటూ ఉండేచోట్ల ఒక తమాషా జరుగుతుంది. ఆడవాళ్ళు కూర్చునేవైపునుంచి సినిమా మంచి రసగంధాయపట్టులో ఉండగా పిల్లాడు 'కేరు' మంటాడు దానితో మొగాళ్ళ సీట్లలోంచి ఒక తలపాగా పైకిలేచి 'పిల్లాడికి పాలియ్యరాదంటే!' అంటూండడం కద్దు. ఈ దేశంలో అటువంటివి జరుగవు. భార్యాభర్తలు బయటికి వెడితే వాళ్ళ పిల్లలను పట్టుకునేవాళ్ళు మన దేశంలోనూ ఉంటారు అని ఎవరైనా అనచ్చు. కానీ అది బేబీ సిటింగ్ ఎలా అవుతుంది? బేబీ సిటింగ్ అంటె డబ్బు పుచ్చుకోవాలి. పుచ్చుకోకుండాచేస్తే దానిని అరవచాకిరీ అనాలి.

ఇదికాక 'ఎక్స్‌చేంజి బేబీ సిటింగు' అని మరో వజ్రాయుధం ఉంది. మేము సినిమాకి వెళ్ళినప్పుడు మా పిల్లలని మీరు చూడండీ, మీరు బయటకి వెళ్ళినప్పుడు మీ పిల్లలని మేము చూస్తాము అని ఒప్పందం చేసుకోవడమన్న మాట. తరుచు బయటకి వెళ్ళడానికి డబ్బు, వరదా లేనివాళ్ళతో ఈ ఒప్పందం కుదుర్చుకోగలిగితే మనకి చాలా హాయి.

ఇంకో నెల్లాళ్ళకి భార్యకి పురుడు వస్తుందనగా ఇక్కడి భర్తలకి పిల్లల పెంపకం గురించి ట్రైనింగు ఇస్తారు. సినిమాలు చూపిస్తారు. లెక్చర్సు ఇస్తారు. ఇంకా బోలెడు చేస్తారు. అలా ట్రైనింగు పొందిన భర్త, భార్యకి ఎన్నో విధాల సహకరిస్తూ ముచ్చటగా ఉంటాడు. మనవైపు మొగాళ్ళలాగ ఇక్కడి మొగాళ్ళు ధామ ధాములు చేస్తూ, పిల్లల పోషణఅంతా ఆడవాళ్ళ మీదే వదిలెయ్యరు. భార్య టెలివిషన్ వాచ్ చేస్తూంటే (అంటే చూస్తూ ఉంటే) భర్త కప్పులు కడిగేస్తాడు.



పిల్లకి పాలు పట్టేస్తాడు. టకటకా కూరలు తరిగేస్తాడు. వంటకూడా చేసేస్తాడు. ఏముందీ చాలా సులభం. మన వైపులాగ కడికట్టెల పొయ్యి ఊదడం అనుకున్నారా? గాస్, ఎలక్ట్రిక్ రేంజెస్ ఉంటాయి. రిఫ్రిజిరేటర్సు ఉంటాయి. గ్రైండర్సు, స్టిరర్సు, మిక్సర్సు బ్లాక్సర్సు, బ్రోకర్సు ఇలా బోలెడు యంత్రాలుంటాయి. వాటి సాయంతో ఝామ్మని ఇంటిపనులన్నీ చేసేసి భర్య టాయిలెట్ అయివచ్చేసరికి రెడీగా ఉంటాడు. భార్యాభర్తలు ఇక్కడ ఫ్రెండ్సులాగ మెలుగుతారు. మనవైపులాగ పెళ్ళాన్ని దాసిదానిలాగ చూడడం, ఏమేవ్, ఒసేవ్ అనడం ఇక్కడ మచ్చుకైనా ఉండవు. స్వీట్, హనీ, డార్లింగ్ క్యూటీ ... ఎంతసేపూ ఇవే పిలుపులు. బయటకి ఎక్కడికేనా వెడుతూ ఉంటే ముచ్చటగా పెళ్ళానికి ముద్దు ఇచ్చి మరీ వెడతాడు ఎంతమంది చూస్తూన్నా సరే.

ఇక్కడి హాస్పిటాలిటీ (అంటే అతిథి మర్యాదలు) గురించి రెండు మాటలు చెప్పాలి. మనవైపు లాగ పొద్దున్నే 'అమ్మాయీ! అంతా కులాసా? చూసిపోదామని వచ్చాను. అల్లుడు ఆఫీసుకి వెళ్ళాడా?' అంటూ ముందుగా ఇన్‌ఫారమ్ చెయ్యకుండ పెట్టకుండా తుర్రూతుర్రూమని లోపలికి చొరబడి చతికిలబడరు. ఇక్కడ మన ఇంటికి ఎవరైనా రాదలుచుకుంటే ముందుగానే ఫోనుచేసి (ఇక్కడ అందరికీ ఫోనులు ఉంటాయి) ఫలానా రోజున ఫలానా ఇన్ని గంటలకు మీరు ఫ్రీగా ఉంటారా, మీకు వేరే ఎంగేజిమెంటు ఏదీ లేకపోతే మేము డ్రాప్ అవాలనుకుంటున్నాం, అని అపాయింటుమెంటు తీసుకునిగాని రారు. అలా అన్న సమయానికల్లా ఖచ్చితంగా వచ్చేస్తారు. వాళ్ళరాకడ చూసి మన గడియారాలు సరిదిద్దుకో వచ్చు.

అతిధులు ఇంటికి వస్తే మొగాళ్ళూ, ఆడాళ్ళూ సెగ్రిగేట్ (అంటే వేరు వేరుగా) అయిపోయి ఎవరి గొడవ వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండరు — మనవైపు లాగ. ఇక్కడి పద్ధతులే వేరు. గృహిణి నవ్వుతూ ఎదురువచ్చి అందరినీ గ్రీట్ చేస్తుంది. అదే నేను అయితే చిరునవ్వుతో నమస్తే అంటాను. (ఎలా అయినా మన సంస్కృతి మనదీ) తరవాత, చలివిబడి వచ్చారేమో వెచ్చగా ఉండేందుకు హాట్ డ్రింక్సు (తాగుడు అనకూడదు. వాళ్ళు

టూరి గబ్బిలాయి అంటారు.) సెర్వ్ చేస్తారు విధిగా. మనవైపులాగ వాళ్ళు కడుక్కోమని ఇత్తడి చెంబు పుచ్చుకుని వెనక్కాలే తిరిగి చేపుకు తినరు.

ఇక్కడ అన్నయ్యగారూ, వదినగారూ, పిన్నిగారూ! అంటూ వరసలు కలపరు. ఎవరి లిమిట్స్‌లో వాళ్ళు ఉండి స్టైలుగా మిస్టర్, మిసెస్ అంటారు.


పెళ్ళి అయి అత్తారింటికి వెళ్ళగానే కొత్త పెళ్ళికూతురు మనవైపున కుంచెడు బియ్యపు గిన్నెలు వార్చవలసి వస్తూ ఉంటుంది. అత్తమామలు, ఆడబడుచులూ, బావమరుదులూ, తోడికోడళ్ళూ వగైరా యావన్మందీ కట్టకట్టుకుని ఒకే ఇంట్లో పడి ఉండే కంబైండ్ ఫేమిలీస్ కదా మనవి. ఇక్కడి పద్ధతంతా వేరు. పెళ్ళి అయిందా అవగానే భార్యాభర్తలు వేరు కాపరం పెట్టేస్తారు. రోగిష్టి అత్తగారు వాళ్ళు నొక్కమనడం, చాదస్తపు మామగారు భగవద్గీత చదవమనడంలాంటి న్యూసెన్సులు ఉంటాయని కూడా తెలియదు ఇక్కడి ఆడపిల్లకి.

అన్నట్లు నేనూ, మాపాప ఆదేశం ఎలావెళ్ళామో మా శ్రీవారిని ఎలా కలుసుకున్నామో, ఏ జాతి విమానం ఎన్నిగంటల ఎన్ని నిమిషాలకి, ఏ ఎయిర్‌పోర్టులో (అంటే విమానాల స్టాండు) బయలు

## అందాకొవరా...

ఎంతెంతసేపు ఆగి మొత్తం ఎంతసేపట్లో ...డంగు చేరుకున్నామో వివరంగా తెలుగు దేశపు సోదరీమణులకోసం వ్రాయాలనే ఉందికానీ, ఇప్పటికే ఉత్తరం పెద్దది అయిపోయింది. కాని ఒక ముఖ్యమైన సంగతి మాత్రం చెప్పకుండా ఉండలేను. అంతకుముందు ఎప్పుడూ నేను విమానం ఎక్కి ఉండక పోవడంచేత మొదట్లో కాస్త భయపడ్డాను, కాని శ్రీవారిని కలుసుకోబోతున్న ఆనందంలో ఆ భయం మునిగిపోయింది. విమానంలో ఎయిర్ హోస్టెస్ స్వీట్‌గా స్మైల్ చేస్తూ కాఫీ అందిస్తూంటే విమానపు భయం చప్పగా తగ్గిపోయిందంటే నమ్మండి. మేము ఆ దేశంలో దిగేసరికి రాత్రి 12 గంటలు అయింది. అప్పుడు మన దేశంలో సరిగ్గా పగలు 12 గంటలన్న మాట! ఆశ్చర్యంగా ఉంది కదూ? భూమి గుండ్రంగా ఉండడంచేత ఒకవైపు పగలుఅయితేరెండోవేపున రాత్రిఅవుతుంది.

విమానం దిగగానే నాకు అనిపించింది. 'ప్రపంచం అంతా రాకెట్టుయుగంలో ఉంటే మన భారతదేశం ఇంకా ఒంటెద్దు బండియుగం నుంచి ఎప్పటికి బయట పడుతుందో కదా' అని.





ముందుగానే మా శ్రీవారికి ఒక కేబులు (అంటే తెలుగులో వైరు అన్నమాట) ఇచ్చారు మా నాన్నారు. అది చూసుకుని ముందుగానే మా శ్రీవారు ఎయిర్‌పోర్టుకి వచ్చి విజిటర్స్ లాంజిలో మా కోసం వెయిట్ చేస్తున్నారు కస్టమ్సు క్లియరన్సు పది నిమిషాలలో పూర్తి అయిపోయింది. అదే మనదేశంలో అయితే మనం డిక్లేరు చేసినా నమ్మకం లేక బట్టలన్నీ విప్పి పోగు చేస్తారు. 'మన దేశస్థులకి జెంటిల్‌మన్‌లీ బిహేవియర్ (అంటే ఇతరులు దొంగలు కాదన్న భావన) ఎప్పటికి కలుగుతోందో?

ఇక్కడి మనుష్యులు చాలా స్వీట్‌గా మాట్లాడతారు. మనదేశంలో పొలాల్లో కేకలు వేసుకున్నట్లు 'ఒసే వెంకమ్మా, అంటే, ఒసే సూరమ్మా' అంటూ ఒకళ్ళ నొకళ్ళు కౌగలించుకున్నంత పని చేసి, పెద్దపెద్ద గొంతుకలతో ఇద్దరూ ఒకే సమయంలో వేరు వేరు విషయాలు మాట్లాడుతూ ఉంటారు. ఇక్కడి వాళ్ళు అలా కాదు. రవ్వంత చెముడు ఉంటే మాట వినపడుతుందా అన్నంత నెమ్మదిగా రహస్యం చెబుతున్నట్లు మాట్లాడుతారు, నైసుగానూ.

ఈ దేశంలో రికార్డ్ ప్లేయర్ ఆన్‌చేసి రాక్ ఎన్ రోల్ మ్యూజిక్కుకి అనుగుణంగా ఆడ మగా చక్కగా చెట్టా పట్టాలు వేసుకుని బాల్ డాన్సు చేస్తూంటే యెంతో ముచ్చటగా ఉంటుంది. మన వైపున చెవి కోసిన మేకలాగ ఒకడు ఇక్ష్వాకుల కాలంనాటి కర్ణాటక సంగీతం పాడుతూంటే వినడానికి వచ్చినవాళ్ళు ఎవరి కబుర్లలో వాళ్ళుండడమే కనిపిస్తుంది; అన్నట్లు ఈ దేశం వచ్చిన ఇండియన్సు చాలామంది ఎటికేట్ (అంటే మర్యాద) తెలియక డాన్సు చెయ్యనూ, హాట్ డ్రింకు పుచ్చుకోనూ అని మొరాయిస్తారు మొద్దావతీ గుర్రాల్లాగ. ఏ దేశంలో ఉంటే ఆ దేశాచారాలు ఫాలో అవాలని తెలియకపోతే ఎట్లా?

రాయాలంటే ఇంకా యెన్నో సంగతులు ఉన్నాయి. మా శ్రీవారు ఇప్పట్లో పూర్తి కాని చాలా పెద్ద ప్రాబ్లెమ్ తీసుకుని రీసెర్చి చేస్తున్నారు కనుక మేము ఇక్కడే మరికొంత కాలం ఉంటాం గనక, మరో సారి మరికొన్ని విషయాలు తెలుగు సోదరీ మణులకి తెలియచేస్తాను. ఇక్కడి వాళ్ళను చూసి మనవాళ్ళు నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి.

# జేబు ఖర్చు



కె. రామలక్ష్మి

రాబడి తగ్గడం అన్నది ఎవరికైనా కష్టమైనదనే, కాని ఈ మధ్యనే ఒక స్నేహితురాలు డబ్బువల్ల వస్తున్న ఇంకో కొత్తరకం ఇబ్బందిని గురించి వ్రాసింది. ఆమె భర్త సంపాదన బాగుంది. హాయిగా సంపాదిస్తాడు. అంతకంటె హాయిగా ఖర్చు పెడతాడుట! 'స్నేహితులని తిప్పడానికి, చందాలు వేయడానికి, అయిన దానికీ కానిదానికీ జేబులోకి చెయ్యి ముందీయనకే పోతుంది. ఇంటిదగ్గరేకాక చుట్టు పక్కలకి కూడా ఇదొక తెరువుగా తయారైంది. దీనముఖం పెట్టడం, ఎంతయిస్తే అంత పట్టుకెళ్ళడం, లేదా ఏదో దానికనీ దీనికనీ ఇబ్బందులు ఒకటికి పదిచేర్చి డబ్బు చక్కా పట్టుకు వెడతారు. నేనేం చేయలేకుండా ఉన్నాను' అంది. 'ఇంత సంపాదిస్తున్నారన్న మాటేగాని, ఫస్టుతారీఖు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడక తప్పడం లేదు. ఒదే జీతం వచ్చేవాళ్ళు కొంచెంలో కొంచెం వెనకేసుకుని 'ముసురు వేళకి' జాగ్రత్తపడుతూ ఉండడం చూస్తుంటే నాకేదో బెంగగానూ దిగులుగానూ ఉంటూ ఉంటుంది' అంది.

నిజమే. ఎంతచెట్టుకి అంతగాలి అన్నారు. రాబడిని పట్టి కర్చులూ పెరుగుతూ ఉంటాయి. అయితేమాత్రం రాబడి బాగా ఉన్నప్పుడు కొంచెం ముందుచూపు ప్రసరించడం అవసరంకదా అని గృహిణి బెంగపెట్టడం, ఆశపడడం అసహజం ఏమీకాదు.

ఖర్చుపెట్టే గుణం మహా చెడ్డది. అది వెనకా ముందూ ఆలోచించకుండా కర్చు చెయ్యకల్గడం అన్నది మొండి ధైర్యమే అనాలి.

ఒక సంగతి అందరూ ఒప్పుకొంటారు. దాతృగుణం గొప్పదే. పెళ్ళి అయ్యాక కూడా అటువంటి దొడ్డగుణం ఉండడం మంచిదే గాని చెడ్డగుణం కాదు. ఈ గుణం మనుషులని సన్నిహితులను చేసి చుట్టూ ఆదరణ పునీడ పరుస్తుంది. స్నేహితులకీ, శ్రేయోభిలాషులకి కొదవ ఉండదు. భర్తలో ఇటువంటిగుణం ఉండడం భార్యకు గర్వకారణమే. అందులోనూ ఎటువంటి చిన్నబుద్ధులూ లేకుండా ఇటువంటి 'మంచి' చెడ్డగుణంతో బ్రతకడం కూడా సుఖమే. కాని, వితరణ లేకుండా భర్త డబ్బు కర్చు చేస్తున్నాడన్నప్పుడు పిల్లల భవిష్యత్తు తమ కుటుంబ భవిష్యత్తే ధ్యేయంగా కల స్త్రీలు కొంచెం 'వర్రీ' అవుతారు. భర్తలోని ఈ వితరణబుద్ధిని అలుసుగా తీసుకొని బాగుపడాలని చూసే దూరపు దగ్గర చుట్టాలూ, అంతగా సన్నిహితులుగాని స్నేహితులూ అనవసరపు డిమేండులు చేస్తున్నారని తోచినప్పుడు...భార్య చేయ కల్గినది ఒక్కటే--తన ఇంటికర్చు మొత్తాన్ని పెంచడమే! అప్పుడా పెంచిన మొత్తాన్ని నిల్వలో పడేసి నిశ్చింతగా ఉండవచ్చు. భర్తని అందరికీ (అడ్డమైనవాళ్ళకి) కర్చు పెట్టేస్తున్నారంటూ సాధించ నక్కరలేదు.

ఆయనగారు తన ధోరణి మార్చుకో నక్కరలేకుండానే స్నేహితులకీ, చుట్టాలకీ కర్చు పెట్టుకోవచ్చు. ఎటొచ్చీ అలా పెట్టడానికి ఫండ్సు కొంచెం తగ్గుతాయి కనక అలా కర్చుచేసే మొత్తం కూడా కొంత తగ్గుతుంది. భార్యా పిల్లలు నిశ్చింతగా ఉండి వారి వితరణకి పాత్రులగుతూ, భవిష్యత్తు గురించి (నెలాఖరు గురించి!) చాతకపక్షులలాగా ఎదురు చూడనక్కరలేదు. ఇదొక చిట్కా మాత్రమే.

నేర్పరి అయిన భార్య భర్తకేమాత్రం ఇబ్బంది కల్గించకుండా — కుటుంబావసరాలని సగదిద్దుకుంటూ, హాయిగా కర్చు చేసుకోనిస్తున్నట్లు స్వేచ్ఛనిస్తూ, అనవసరపు కర్చులకి బాగా స్వస్తి చెప్పిస్తుంది 'ఇచ్చేవాణ్ణి చూస్తే, పుచ్చుకునే వాడికి లోకువ' అన్నది స్త్రీలు గ్రహించినంత సులువుగా పురుషులు గ్రహించరు. ఇచ్చేవాణ్ణే అందరూ పీడిస్తారు. వీళ్ళెందుకిలా ఇస్తారని మనం అడిగినా మగవాళ్ళు నమ్మరు. అందుకే ఇంటి ఆడది డబ్బు కర్చుపెట్టడంలోనూ, ఆదా చేయడంలోను కూడా నేర్పరి అయి ఉండాలి.

---

వంటలు:

## గూల్ పపడె

ఒక సోలెడు గోధుమపిండి.

ఒక సోలెడు పంచదార.

1 చిప్ప కొబ్బరికోరు.

ఏలకపొడి.

కొంచెం పాలు.

తగినంత నెయ్యి.

గోధుమపిండి నేతిలో వేయించి తీసి పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నెలో పాలు పంచదారవేసి కాగనివ్వాలి. పంచదార బాగా పాకం రాగానే కొబ్బరి, ఏలకపొడివేసి కలియ పెట్టి, వేయించిన గోధుమపిండికూడావేసి కలియపెట్టి దింపి చిన్నసైజు ఉండలు చేసుకోవాలి. ఓ వారం పది రోజులైనా ఉంటాయి.

(గత సంచిక తరువాయి)




అబ్బాయినాయుడు ఆవలించినాడు. ఒళ్ళు విరుచుకొన్నాడు. బాలామణి ఇంటి దగ్గరికిపోయి, తలుపుదగ్గర నిలబడినాడు. అతని వేళ్ళు తలుపుమీద టకటక లాడినాయి. 'బాలమ్మా! బాలమ్మా!'

లోపల అలికిడైంది. 'ఎవరు?'

'నేను బాలమ్మా! ఒకసారి తలుపు తియ్యి!'

తెరుచుకుందామా, వద్దా అని కొంత సేపు సందేహించి, కొద్దిగా తెరుచు కొనింది తలుపు. తలుపుసందున లాంతరు మసక వెలుతురులో నిద్రకండ్లతో బాలామణి కనిపించింది.

'ఏమన్నా! నువ్వా!'

'నేనే బాలమ్మా! సుందరాచారి లేడా?' అంటూ తలుపునెట్టుకొని లోపల అడుగుపెట్టినాడు అబ్బాయినాయుడు.

'సింగారపాలేనికి పోయినారు కదా!'

రెండుక్షణాలు గడిచినాయి.

'ఏమన్నా?'

అబ్బాయినాయుడు నీళ్ళు నమిలినాడు ... 'ఏమీలేదు బాలమ్మా! ... నీ ఓటెవరికి?'

'నాకు ఓటెక్కడుందన్నా?'

'ఓటులేదా? ఎందుకులేదు?' అన్నాడు అబ్బాయినాయుడు. తలుపు మూసి, అడ్డంగా నిలబడినాడు. 'పోనీ, నీ మనసులో చోటెవరికి?' అంటూ లేత పిచ్చివాడివలె వెకిలిగా నవ్వినాడు.

'అన్నా! ఏదేంమాట?' అనింది బాలామణి ఉలికిపడి.

'ఉన్నమాటే బాలా! తెలియనట్లు అడుగుతావేల? నువ్వు నన్ను పిచ్చివాణ్ణి జేసినావా, లేదా చెప్పు! నా కలల్లోకి వొచ్చి, నా నిద్రను పాడుజేస్తూ వున్నావా, లేదా చెప్పు! నీ మనసు నా మీదవుందా లేదా చెప్పు! కడపటికి ఈ దినం దేవుడు దయతలిచినాడు. ఇంక బెట్టు చాలులే!'

బాలామణి రాతిబొమ్మైపోయింది. 'అన్నా! నేను అట్లాంటిదాన్ని కాను! నాకు అన్నలూ, తమ్ముళ్ళూ లేరు. నిన్ను నా తోడబుట్టినవాడవే అనుకున్నాను. అటువంటి పాపపు మాటలనవద్దు!'

'భయమెందుకు బాలా? ఇక్కడెవరున్నారు? ఊరంతా నిద్రపోయింది. ఎవరికీ తెలియదు!'

'ఛీ దున్నపోతా! నోరుముయ్!'

'బాలా! నువ్వు తిట్టినా ఫరవాలేదు. నన్ను కాదంటే మాత్రం నేను బతకలేను.' అంటూ అబ్బాయినాయుడు ఆమెను రెండుచేతులతోనూ పొదివి పట్టుకున్నాడు. తన బాహువల్లరులతో ఆమెను కొండచిలువవలె చుట్టివేసినాడు. బాలామణి పెనగులాడి పెనగులాడి దేవదత్తమైన మహాశక్తితో అతని పట్టు నుండి విడిపించుకొని, లేడివలె ఎగిరి, మూలనున్న కాయగూరలు తరిగే కత్తిని అందుకొనింది. ఆ కత్తితో నుదుటిమీద గాటుపెట్టుకొనింది. నెత్తురు బొటబొటమని ముక్కుమీదుగా జారింది. 'ఎంత పదునుగావుందో చూచినావా?' అనింది బాలామణి.

అబ్బాయినాయుడు మ్రాన్పై నిలబడిపోయినాడు.

ముడివిడిపోయి వేలాడే నల్లని వెంట్రుకలు, నెత్తురోడే ప్రశాంతమైన ముఖం, కనులలో నిప్పులు చెరిగే కోపం — చీకటి గుడిలో చమురు దీపం వలె వుంది బాలామణి.

'తెలుసుకో! బాలామణి నిప్పులాంటిది. నా మీద నీకుండే ఆశైనా మిగలాలనుకుంటే ఇక్కణ్ణుంచి పో ముందు! మానం నా చేతుల్లో వుంది. దానికోసరం నిన్ను బతిమాలను. నా ప్రాణం మాత్రం నీ చేతుల్లోనే వుంది. అదంటే నాకు లెక్కలేదు. పోతావా, పోవా?'

అబ్బాయినాయుడు చేసేది లేక, పిల్లి వలె అడుగులు వేసుకుంటూ గడపదాటి వెళ్ళిపోయినాడు. బాలామణి తలుపు గడియ వేసి, భోరుమని ఏడ్చింది. ఆ రాత్రంతా ఆమెకు కంటి మీద కునుకులేదు.

'బాలమ్మా! నీ ఓటెవరికి?'

'నీ పవిత్రమైన ఓటు ఎవరికి?'

'అన్నిటికంటే పవిత్రమైనదా ఓటు? అయితే—ఈ దేశంలో పుట్టిన ఆడదానికి మానమే ఆ ఓటుకంటే పవిత్రమైనది. అన్నలారా! ఆడదాని మానానికి కంచుకోట కట్టే మానసంరక్షకుడు మీలో వున్నాడా? వుంటే చెప్పండి!... వాడికే నా పవిత్రమైన ఓటు!'

* * *

ఎన్నికల్లో ఎవరు గెలిస్తేనేమి, మనిషి మాత్రం మారలేదు. అబ్బాయినాయుడి మనసూ మారలేదు. నెమిలికోనలో—ఎన్నికలు తెచ్చిన మార్పు ఒక్కటే! సుందరాచారితో అబ్బాయినాయుడి సహవాసం ఎంత తొందరగా పెరిగి పెద్దదైందో, మరలా అంత తొందరగానే తరిగి చిన్నదైంది. అతను సుందరాచారి యింటికొచ్చే అలవాటే మానుకున్నాడు. దూరదూరంగా వుండిపోతూ వున్నాడు. అతని మాటలలో వెనుకటి ప్రేమాదరాలు మాయమై, మునుపటి అమర్యాద, అవహేళన విశ్వరూపం ధరించినాయి. అయినా సుందరాచారి మాత్రం 'దారిన చిత్తం మాకుల సేడ!' అనుకొని, తనపని తాను చేసుకొని పోతూ—వున్నాడు.

నెత్తిమీద కత్తికోతకు ఏదో సాకు చెప్పుకొనింది బాలామణి. అబ్బాయినాయుడి ఆగడాన్ని గురించి ఆమె మగడికి చెప్పుకోలేదు. అతనికి చెప్పి పరిస్థితులు యింకా ముదరబెట్టుకునేందుకు ఆమె భయపడింది. ఏదైనా ఇంకొక వూరికి బదిలీ చేయించుకోమని అతని చెవిలో ఇల్లుగట్టుకొని పోరుపెట్టసాగింది. సుందరాచారి సరేనని బదిలీ కోసరం అప్లికేషను రాసి పడేసినాడు.

# బాలామణి

బాలామణికి బతుకు దినగండం నూరేండ్లాయుస్సుగా వుంది. అబ్బాయినాయుడే పరదేశి రూపంలో వొచ్చి ఆమెను బాధిస్తూ వున్నాడు. బాలామణి దగ్గర అబ్బాయినాయుడి వూసెత్తటమే ఈ నడుమ పరదేశికి ఉద్యోగమై పోయింది.

ఒకనాడు, సుందరాచారి బడిలో వున్న సమయంలో—పరదేశి వాళ్ళ యింటికి వచ్చినాడు. 'చీటీ నీకియ్యమన్నారు బాలమ్మా!' అన్నాడు. బాలామణి దాని నందుకొని ఇటుల చదివింది. 'నా ప్రియమైన బాలామణికి శతకోటి ముద్దులు! నీ కోసరం నేను అల్లాడిపోతూ వున్నానే, నీకింకా దయరాలేదా? నీతో ఒక్కసారి...' బాలామణి కోపంతో, అవమానంతో బుసలు గొడుతూ, ఆ కాగితాన్ని నలిపి పొయ్యిలోకి విసిరేసింది. ఆ కాగితానికి ప్రాణం వొచ్చి పలికినట్లు మిగతా పరదేశి అందుకున్నాడు '...గడిస్తే చాలు, నరకానికి పొమ్మన్నా పోతాను. ఈ తాపం నేను ఓపలేను. కనులు మూసినా, కనులు తెరిచినా నువ్వే! నన్ను కనికరించు! నాకు ప్రాణభిక్ష పెట్టు! ఈ రాత్రికి...' అంటూ అపహ్యంగా నవ్వుతూ వున్నాడు పరదేశి.

'పరదేశీ! చాలింక! తగ్గు! ...' అంటూ—ఎక్కడో ఆకాశంలోని పురుమువలె చిన్నకేకపెట్టింది.

'నామాట విను బాలమ్మా! నీ మంచి గోరేవాణ్ణి! అబ్బాయినాయుడెంతో మంచివాడు. ఋణం పెట్టుకునే మనిషిగాదు. నువ్వు సైయ్యన్నావంటే—సిరి నీకాళ్ళమీద పడుతుంది. అదృష్టాన్ని కాలదన్నుకోకు!'

వాడి గొంతు నులిమేద్దామనిపించింది బాలామణికి.

'మర్యాదగా బయటికిపో, ఎంగిలితినే కుక్కా!...ఇంక వివాదట ఇటువంటి కూతలు గూసినావంటే మాయింటాయయనతో చెపుతాను' అని కసురుకొనింది.

'చెప్పుకో! భయపడేవాళ్లెవరు? ఒకటి మాత్రం జ్ఞాపకంపెట్టుకో! అబ్బాయినాయుణ్ణి కాదని, బాగుపడినవాళ్ళు లేరు!' అని చెప్పి వెళ్ళిపోయినాడు పరదేశి.

బాలామణి బెదిరిపోయింది. పరదేశి ఆమె కంటికి అడంగివానివలె కనబడలేదు. ఆమె పాలిటికి రాక్షసుడైనాడు.

మార్చినెలలో బాలామణి తల్లిదండ్రులు కూతుర్నీ, అల్లుణ్ణీ చూచిపోదామని వొచ్చినారు. రెండురోజులుండి వెళ్ళిపోయినారు. సుందరాచారి వాళ్ళకు కొత్తగుడ్డలుపెట్టి పంపినాడు. సింగారపాళెంలో వాళ్ళను బస్సెక్కించి తిరిగొచ్చేసరికి పొద్దుపోయి చీకటిపడింది. ఇంటిదగ్గర పరదేశి కాచుకొని వుండినాడు.

'ఏం పరదేశి?' అన్నాడు సుందరాచారి.

'అబ్బాయినాయుడు డబ్బడిగి రమ్మన్నాడు సార్!'

సుందరాచారి మనసు బరువెక్కింది. 'వొచ్చినజీతం వొచ్చినట్లే ఖర్చయిపోయింది పరదేశి!...ఇప్పుడు బొత్తిగా డబ్బులేదు. వచ్చేనెల—జీతంరాగానే యిచ్చుకుంటానని చెప్పు!'

'ఏమో, చెప్పమన్నారు, చెపుతాను.'

శివరాత్రితో చలి శివశివా అని వెళ్ళిపోతుందంటారు. శివరాత్రి కూడా వెళ్ళిపోయిందిగానీ, చలిపోలేదు చలికి శాలువ గప్పుకొని, మిద్దెమీద పచార్లుచేస్తూ వున్నాడు అబ్బాయినాయుడు. బాలామణిని దుష్టటిగాజేసి కప్పుకుంటేనేగానీ అతని తీరదు.

మిద్దెపైకివొచ్చి, 'అబ్బా?' అన్నాడు పరదేశి

'డబ్బడగగనే అకుమాదిరిగా అల్లాడిపోయినాడు. రేపు నెలజీతం రాగానే యిస్తానని చెప్పమన్నాడు.'

'మనకు కావలసిందదే! డబ్బుగాదు!' అంటూ బీడీ ముట్టించుకున్నాడు అబ్బాయినాయుడు.

బాలామణి తనకు అందని చందమామైపోతూవుంది. ఆ ఆశ తలవాల్చేసినప్పడల్లా అతనిలో పగ రగులుకొంటూ వుంది. అన్నిప్రయత్నాలూ అడుసులో నాటిన కంబాలైపోయినాయి. బాలామణి తనను తిరస్కరించింది. మొగుడిచేత బదిలీకోసరం అర్జీపెట్టించింది. ఏప్రిలు నెల రాబోతూవుంది. ఆ వెనుక ఎండాకాలపు సెలవులొస్తాయి. బాలామణి వెళ్ళిపోతుంది. మరల నెమిలికోనకు రాకనేపోవచ్చు. తనకు బాలామణి వుండదు. సుందరాచారికి బాలామణి స్థిరాస్తి! తాను దరిద్రుడు. సుందరాచారి కుబేరుడు.

'సుందరాచారీ!' అంటూ పళ్ళు పటపట కొరికినాడు అబ్బాయినాయుడు.

'ఏప్రిల్ నెల మొదటివారంలో సుందరాచారికి జీతం అందింది. ఆ మధ్యాహ్నం యింటి దగ్గరికే వొచ్చి డబ్బిచ్చిపోయినాడు తపాలావాడు. 'మామా! ముందు ఆ అప్పు తీర్చివేయి. ఈ కమ్మలు కుదువబెట్టి, ఈనెల గడుపుకోవచ్చు...ఇందా!' అని బాలామణి చెవులకున్న కమ్మలు తీసి అతనిచేతిలో పెట్టింది.

సుందరాచారి చొక్కా వేసుకొని, వీధిలోకి వచ్చినాడు. 'పరదేశి! డబ్బియ్యమంటావా?'

'ఏమిడబ్బు సార్?'

'అబ్బాయి నాయుడికీయవలసిన డబ్బు!'

'ఆపీడ నాకెందుకు సార్! మీరే ఇచ్చుకోండి! అంటూ పరదేశి వీధి చివరి వరకూ పోయి, సీనయ్య చిల్లరంగడి అరుగు మీద కూర్చున్నాడు.

అబ్బాయినాయుడి ఇంటిదగ్గరికి పోయినాడు సుందరాచారి. ఇంట్లో ఎవరూ లేరు. సింగారపాళెంలో పెండ్లికిపోయినారని తెలిసింది. సుందరాచారి బడికి వెళ్ళిపోయినాడు. ఒక పిల్లవాణ్ణి పంపి గురప్పను పిలిపించినాడు.

'తాకట్టు మీద డబ్బిచ్చేవాళ్లెవరున్నారు గురప్పా?'

గురప్ప కొంతసేపు కన్నులార్పినాడు. 'సింగారపాళెంలో మార్వాడీ వాళ్ళున్నారు సార్!'

'సింగారపాళెం ఎప్పుడు పోతావు నువ్వు?'

'మీరు పోయిరమ్మంటే, రేపు పోతాను.'

'అయితే, రేపు తెల్లారి ఒకసారి నాకు కనిపిస్తావా?'

సరేనని గురప్ప వెళ్ళిపోయినాడు.

పాఠం చెపుతూవుంటే – చిల్లరంగడి సీనయ్య బడిలోకి వొచ్చినాడు 'జీతం వొచ్చిందని విన్నాను సార్! డబ్బుగావాల!'

'రేపిస్తాలె సీనయ్యా!'

'ఎప్పుడైనా మిమ్మల్ని ఇట్లడిగినానా సార్! ప్రాణం మీదికొచ్చింది. అపతల అప్పులవాడొచ్చి కూర్చున్నాడు. ఇప్పుడు మీరియ్యకపోతే, నా మానం పోతుంది.' అంటూ ఎప్పుడూ లేనిది, మొండిపట్టు పట్టినాడు సీనయ్య. అతనికీయవలసిన ముప్పైఅయిదు రూపాయలూ ఇచ్చివేసినాడు సుందరాచారి. సాయంత్రం ఊసూరుమంటూ ఇంటికి వొచ్చినాడు. అసుర సంధ్యవేళ చాపవేసుకొని పండుకొన్నాడు. బాలామణి అతనితల వాకిట్లో కూర్చొనింది.

గుండె ఝల్లుమనేట్టుగా 'సుందరాచారీ!' అనేపిలుపు వినిపించింది వీధిలోనుంచి. సుందరాచారి లేచి వాకిట్లోకి తొంగిచూచి 'రా నాయుడూ! లోపలికిరా!' అని పిలిచినాడు.

'ఫరవాలేదు. వీధిలోకేరా!' అన్నాడు అబ్బాయి నాయుడు అతని పక్కన పెద్దవాళ్ళిద్దరు నిలబడి వున్నారు.

సుందరాచారి వీధిలోకి పోయినాడు.

'డబ్బేదీ?'

'నీకోసరం వెతికినాను నాయుడూ! నువ్వు కనబడలేదు.'

'మ టలేల? డబ్బియ్య!'

'ఎనభై రూపాయలున్నాయి. తీసుకో నాయుడూ!...మిగిలింది రేపిస్తాను...'

'అదేం కుదరదు! నూరు రూపాయలు ఇప్పుడే గావాల.' అబ్బాయి నాయుడి గొంతు కంచుగంటవలె గింగురుమనింది. వీధిలోని ఆడా మగా సుందరాచారి ఇంటిముందు గుమిగూడినారు. అతని తల వాలిపోయింది. 'నేను ఊరువిడిచి పోతున్నానా నాయుడూ? రేపిస్తానంటూ వున్నాను గదా?'


'ఊరువిడిచి పోతున్నావో, ఏట్లో గిలిసి పోతావో నాకెందుకు? జీతమొచ్చింది గదా? నా డబ్బు నాకియ్య! నయాపైసా తగ్గినా ఒప్పుకోను. ఎవడబ్బ సొమ్ము?...'

ఒకనిమిషంసేపు ఎవరూ మాట్లాడలేదు. సుందరాచారి శవమైపోయినాడు. అతనికి ఇంతకమైన భంగపాటు ఎప్పుడూ రాలేదు.

గుమ్మంలో జాలిగా నిలబడిన బాలామణిని చూచి సన్నగా నవ్వుతూ మీసం మీదికి చేతిని పోనిచ్చినాడు అబ్బాయి నాయుడు. 'అప్పుదీర్చలేనివాడికి అంత అందమైన పెండ్లాదేకి సుందరాచారీ? ... పోనీ, నీ పెండ్లాన్నే యిచ్చి అప్పుదీర్చుకోరాదూ?' పక్కనున్న పెద్దవాళ్ళు సకిలించినారు. చుట్టూచేరిన మనుషులందరూ పండ్లికిలించినారు. సిగ్గుతో సగం చచ్చిన బాలామణి దభేలని తలుపువేసుకొనింది.

ఈ అవమానాన్ని సహించలేని సుందరాచారి కోపంతో నిలువునా వొణికిపోతూ 'నాయుడూ! ఏమన్నావు నాయుడూ?' అంటూ అబ్బాయినాయుడిమీదికి దూకినాడు. అబ్బాయినాయుడిపైన ఈగైనా వాలుతుందా? ... పక్కనున్న పెద్దవాళ్ళు సుందరాచారిని చితగొట్టి, పందికొక్కును పారేసినట్టు పారేసినారు. అబ్బాయి నాయుడు అట్టహాసంతో ఊగిపోతూ ఆ చోటువిడిచి వెళ్ళిపోయినాడు.

వీధిలో కూర్చున్న సుందరాచారి



'ఒక సిల్కు చీర కొంటేనే ఒక క్యాలెండర్ ఉచితంగ ఇస్తానన్నాడు – ఆరు క్యాలెండర్లు పట్టుకొచ్చా!!

# బాలామణి

మెల్లగా తలపైకెత్తి చూచినాడు. ఎవరూ లేరు. దిక్కులన్నీ కనులు మూసుకొన్నాయా? సాక్ష్యం చెప్పవలసి వస్తుందని భయపడి సూర్యుడు దాగుకొన్నాడా?... సుందరాచారి దిక్కులేనివాడైనాడు.

ఎదురుగా, మూసిన తలుపు కనబడింది.

'బాలామణీ !' ... ఆ మాటతోబాటే ఏడుపు పొంగివచ్చింది. వెక్కివెక్కిపెట్టి ఏడ్చినాడు. ఎంతసేపు గడిచిందో తెలియదు. మనుషులొకరొకరే అబ్బాయినాయుడి ఇంటిదెసగా పరుగెత్తుతూ వున్నారు. బాలామణి తలుపు తీయనే లేదు. సుందరాచారి పైకిలేచినాడు తలుపు దగ్గరకిపోయి 'బాలామణీ !' అని పిలిచినాడు పసిబిడ్డను ఓదార్చేవానివలె 'తలుపుతియ్యి బాలామణీ !' అన్నాడు, తలుపు సందులోనుంచి తొంగిచూచినాడు. నెమలికోసంతా అదిరిపడేట్టుగా ఉయ్యాల్లో బిడ్డలు కూడా బెదిరిపోయేట్టుగా 'బాలామణీ!' అని ఒక్క అరుపు అరిచినాడు.

తలుపు తనాతునకలైపోయింది. ఇంక ఈ పాపపు నేలమీద నిలబడకూడదనుకొనిందో ఏమో — బాలామణి దూలానికి వేలాడుతూవుంది. ఆమెను ఉరితాటి కెక్కించిన హంతా తనపని తీరిపోయినట్టు ఒకమూల దొర్లిపడివుంది. ఇరుగుపొరుగు వాళ్ళు కొందరు ఇంట్లోకి జొరబడినారు. బాలామణిని కిందికిదించి, నేలమీద పండబెట్టినారు. పలిగిన తెల్లకాగితం ఒకటి చిన్నమువలె ఆమె మంగళసూత్రానికి చుట్టుకొనివుంది.

సుందరాచారి ఆమెపైన వాలిపోయినాడు. 'అయ్యో! ఎంత పనిచేసినావు బాలామణీ! నామీద నీకెందుకు కోపమొచ్చింది బాలామణీ?...ఇంత కష్టం నేను భరించలేను. నువ్వు బతికిపో బాలామణీ !' అంటూ పసిపిల్లవాడి మాదిరిగా ఏడ్చినాడు.

'నన్ను వదిలివేయించుకొని వెళ్ళిపొమ్మని, నువ్వు నెమలికోసలోనే వుండిపోయినావా బాలామణీ ! నాకు ఎంత అన్యాయం చేసినావు బాలామణీ !' అంటూ ఆమె చేతులను ముద్దుపెట్టుకున్నాడు. ఆమె చేతిగాజులు గలగలమన్నాయి. ఆమెతో కలిసి నెమిలికోసకు వచ్చినరోజు జ్ఞాపకం వొచ్చింది.

...పచ్చిపిందెలు గోసేసినారుమామా!... చెట్టున్నేవుండివుంటే అవి పెద్దవై దోరమాగేవి. చెట్టుకు అందమొచ్చేది!...

'నా బతుకు బోసిపోయిన చెట్టైపోయింది బాలామణీ !'

...జంగమ దేవర జగమునేత !
జంగముదే. రే సర్వేశ్వరుండు!'

'బాలామణీ !'

...కూతురా!...మననున్నకాపురం, మచ్చలేని బతుకు—ఇవే, ఆడది మగవాడికిచ్చే ఘనమైన కట్నాలు!...

'నా సౌభాగ్యాన్ని కాపాడుకోలేని వాణ్ణయినాను బాలామణీ! నువ్వే లేనప్పుడు నాకవన్నీ ఎక్కడుంటాయి బాలామణీ!'

గురప్పగసబ్బు బోస్తూ అక్కడికివొచ్చినాడు.

...ఇదేమి ఘోరం! బాలామణి చచ్చిపోవలెనా?... మారేండ్లూ బతికే వుండకూడదా?...

కావ్యంలోని కథానాయిక కాదు బాలామణి. ఏ కవీ ఆమెను చంపలేదు. ఒకవేళ ఆమె బ్రతుకొక కావ్యమే అయితే—కవి కాలానికే ఎదురు తిరిగే స్థిర సంకల్పం ఆమెది. బాలామణి వాస్తవిక స్త్రీ! మానాభిమానాలున్న ఆడబిడ్డచు!

'అదేంది సార్?' అన్నాడు గురప్ప, బాలామణి మంగళసూత్రానికి చుట్టుకొనివున్న కాగితాన్ని చూపించి. సుందరాచారి దాన్ని విప్పి, గురప్ప చేతికిచ్చినాడు. కన్నుల్లో నీళ్ళు కమ్ముకుంటూ వుండగా—కాగితంలో వున్న బాలామణి మాటల్ని ఇట్లుల చదివినాడు గురప్ప.

'హింసలన్నీ సహించినాను. అవమానాలన్నీ భరించినాను. అయితే ఈ ఒక్క మాటకు నేను తట్టుకోలేకపోయినాను మామా ! నాముఖంచూచి, నలుగురిలో 'నీ పెండ్లాన్నిస్తావా' అని ఇచ్చే అడిగినాడే !...ఆడదానికింతకంటే అవమానం వుంటుందా ? నిన్ను విడిచి నేను పోవాలనుకోలేదు మామా ! ఆ మాటను మరిచిపోవాలనుకున్నాను. వేలాయుధ స్వామీ ! వాడు నన్నంటే అన్నాడు — అంతమాట ఇంక ఏ ఆడదాన్ని అననీయకు స్వామీ!... ఏడువవద్దు మామా, ఏడువవద్దు ! నా ఏడుపే చాలు ! నా కన్నీళ్లే చాలు!... మనమానంతో చెలగాటమాడిన వాణ్ణి నువ్వైనా మన్నించు ! ఏడువవద్దు మామా, ఏడువవద్దు !...


'ఏడువకుండావుండగలనా, బాలామణీ!' సుందరాచారి ఏడుపు తారస్థాయిని అందుకొనింది.

గురప్ప అన్నాడు...'సార్! అబ్బాయినాయుడిక నోరు పడిపోయింది!...'

సుందరాచారి ఏడుపు ఆగిపోయింది.

'ఏడువను బాలామణీ, ఏడువను!'

...అతన్ని ఓదార్చేందుకా అన్నట్టున్న చిమ్మచీకటిలో—బాలామణికోసరం కట్టిన గోరీ మాదిరిగా నిశ్శబ్దంగా వుంది నెమలికోస ! ●



# వారఫలం

## 8-3-68 శుక్రవారం మొదలు
## 14-3-68 గురువారం వరకు

**మేషం:** ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల వల్ల ముందుముందు కూడా ఉపయోగం ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

**వృషభం:** వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ప్రయాణాల ద్వారా కార్యసాధన చేయగలరు. ఉద్యోగంలో మీ పరిస్థితి బాగా ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం వలన శ్రమ కలుగుతుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**మిథునం:** వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపారంలో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

**కర్కాటకం:** పూర్తిగా నెరవేరేవరకు యే వ్యవహారాన్ని నమ్ముటానికి అవకాశం లేదు. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదిలివేయడం మంచిది. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. విలాస వస్తువులు కొంటారు.

**సింహం:** వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో కొన్ని వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో మెప్పుకలిగే కార్యాలు చేస్తారు. దైవకార్యాలు నెరవేరతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

**కన్య:** వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. అనుకూలంగా జరగవలసిన వ్యవహారాలు నెరవేరతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో చికాకులు యేర్పడతాయి. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

**తుల:** వృత్తి వ్యాపారాల్లో యిదివరకు ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు పూర్తి చేయగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

**వృశ్చికం:** వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—సంతానానికి అనారోగ్యం చేస్తుంది. బంధువులకు సహాయం చేస్తారు.

**ధనుస్సు:** భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో శ్రమ మీద అభివృద్ధిని సాధించగలరు. వారంమధ్యలో అప్పు వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ఉద్యోగంలో యెవరినీ గుడ్డిగా నమ్మడం తగదు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

**మకరం:** వృత్తిలో పోటీవారితో పోటీ పెరుగుతుంది. కార్యసాధన కోసం మీ అభిప్రాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించవలసి వస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు—విలాస వస్తువులు కొంటారు. యెవరితోను వాదప్రతివాదాలు తగవు.


**కుంభం:** ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరుతాయి గాని మీ స్వంత పనుల్లో శ్రమ కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది.


స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

**మీనం:** వృత్తి వ్యాపారాల్లో ప్రయోజనం కంటే ప్రయాస అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ప్రయాణాలు శ్రమ మీద ఫలిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు.

—మహేశ్






ఒక చిన్న రైల్వేస్టేషను, అది. ఏటు వంటి సమయంలోనూ రద్దీగా వుండదు. ఆ స్టేషను వల్ల అటు ప్రభుత్వానికిగాని యిటు ప్రజలకుగాని కలిగే లాభం బహు స్వల్పం అని సులువుగా అర్థమవుతుంది. ఆ ప్లాట్‌ఫారం మీద పాదరక్షలు లేకుండా నడవడం ఒకవిధంగా కష్టమే. ఎందుకంటే గులకరాళ్లు బైటికి తేలివుండి రక్షణలేని పాదాలకు గుచ్చుకొని బాధపెడతాయి. ప్రయాణీకులు కూర్చోటానికని వుద్దేశించబడిన సిమెంటు బెంచీలు మూడున్నాయి. స్టేషనుకి రెండు చివర్లందు రెండు, స్టేషను మాస్టరుగదికి కొంచెం యెడంగా, స్టేషను మధ్య ఒకటి. మధ్య బెంచీమీద కూర్చొని వున్నాడు విశ్వేశ్వర శాస్త్రి. అతను, ఆకారంబట్టి, యెక్కడికో ప్రయాణం తలపెట్టినట్టుగా వున్నాడు. అతని కళ్లు నీరసపడి వున్నాయి. ఐనా, ప్రయాణం చివర ప్రశాంతం లభిస్తుందనే ఒక కొత్త వుబలాటం, ఆశాభావం మధ్య మధ్య సొలసిన అతని కన్నుల్లో ద్యోతకమౌతూంది.

'అతనికి కావలసిన రైలు యాభైయ్యైదు నిముషాలు లేటట' స్టేషను మాస్టరు చెప్పాడు. ఐనా ఆ లేటుకు విసుక్కోలేదు విశ్వేశ్వరశాస్త్రి. అసలు విసుక్కోవలసిన అవసరం ఒకటున్నదని తట్టలేదు అతనికి ఆ సమయంలో. ప్లాట్‌ఫారం అవతల నాలుగైదు కాముచెట్లు భారీయెత్తున వుండి, చల్లని నీడని గాలిని యిస్తూ మనిషికి మనిషివల్ల కలిగే చింత, చికాకుల్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఐనా, విశ్వేశ్వర శాస్త్రియొక్క మనోప్రపంచం మాత్రం చిక్కుపోయిన సెలయేరులా వుంది, నిజ ప్రపంచం యెంత వుల్లాసకరంగా వున్నా. అతని పల్చని జుత్తు యెగిరెగిరి పడుతున్నాది. ఏమిటో ఆలోచిస్తున్నాడు. అలా కూర్చొని ఆలోచిస్తున్న విశ్వేశ్వరశాస్త్రికి దూరాన నల్లని రైలుపొగ కనిపించింది. ఏదో రైలొస్తున్నాది అని అనుకున్నాడు. రైలొచ్చింది. కాని అక్కడ ఆగకుండా యెంత హడావిడిగా వచ్చిందో అంత హడావిడిగానూ పారిపోయింది దాన్ని చూస్తూ. 'అంత తొందర పనికిరాదు' అని తనలో అనుకున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

రైలు వెళ్లిపోయింది అది విడిచిపెట్టిన కల్మషం ఆకాశంలో చెదిరి కరిగి పోతున్నాది. ఆ పొగను యెంతవరకు చూడగలనో అని పట్టిపట్టి చూస్తున్నాడు అతడు. సరిగ్గా అప్పుడే స్టేషను మాస్టరు గదిలో టెలిఫోను మ్రోగింది. అదికూడ వింటున్నాడు. ఇంతలో, ఆ సమీప ప్రాంతంలో ఒక పెద్ద ప్రేలుడు శబ్దం అయ్యింది. విశ్వేశ్వరశాస్త్రి ఒక్కసారి అదిరిపడి 'అమ్మో రైలు పడిపోయింది' అని భయంగా గొణుక్కున్నాడు. అప్రయత్నంగా తన సూట్‌కేస్, బేగ తడుముకొని శబ్దం వినవచ్చినవేపు చూసాడు,

విశ్వాలంగా, తాత్రయిపోయిగా. అతో!
వంక తిరిగి ప్రశాంతంగా రైలు పాములా సాగిపోతూనే వుంది. మరి ఆ శబ్దం యేమిటి?' భయభ్రాంతులనుండి నింపాదిగా తేరుకున్నతర్వాత గ్రహించాడు విశ్వేశ్వర శాస్త్రి ఆ శబ్దమేమిటో—కొండరాళ్ళ ప్రేలుడు మందేసి పేలుస్తున్నారు కూలీలు.

అసలు సంగతి తెలుసుకున్నాక 'ఉత్తినే భయపడ్డాన్రా దేవుడా' అనుకొంటూ చాలా సేపు నవ్వుకున్నాడు.

స్టేషను మాస్టరు తన గదిలో నుండి ఠీవిగా, మహారాజులా బైటకి వచ్చాడు. వచ్చి 'ఒరే పరమేశం గంటకొట్టు' అన్నాడు. అతని కంఠస్వరం గంభీరంగా లేదు. కాని గంభీరత ప్రదర్శించటానికి కావలసిన ప్రయత్నమంతా చేసినట్టుగానే వున్నాడు స్టేషనుమాస్టరు. అతన్ది పెద్దవయస్సేమీ కాదు. చిన్నవయస్సులోనే మంచి వుద్యోగం సంపాదించాడు. ఆరోగ్యవంతమైన శరీరం అతన్ది.

'ప్రశాంతమైన వాతావరణం అతనికి ఆ ఆరోగ్యాన్నిచ్చింది' అనుకున్నాడు విశ్వేశ్వరశాస్త్రి సెలయేరులా సజీవంగా, చల్లగా వున్న ప్రకృతిని చూస్తూ. 'బడిపంతులు వుద్యోగానికి రాజీనామా యిచ్చేసి యిక్కడే వుండిపోతే బావుంటాది. అదిగో ఆ చెరువు గట్టుమీద ఒక చిన్న కుటీరం కట్టుకొని' అని యోచిస్తున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

అంతలోనే అతని యోచన మరోవేపుకి మళ్ళినట్టు కుంచించుకుపోయిన అతని కళ్ళు చెప్పాయి.

'అతడు, ఆ స్టేషనుమాస్టరు వయస్సులో తను యెంతో అశాంతిగా వుండేవాడు, పెళ్ళాంవల్ల. బాధ్యతకు అర్థం తెలిసేది కాదు. తనమీద తనకే బాధ్యత వుండేది కాదు. అందుకే అతనంత మంచి ఆరోగ్యం తనకు యెప్పుడూ లేదు.' అని యిలా అనుకుంటున్నాడు, 'ఎందుకుంటుంది? యెలావుంటుంది? మనస్సులో శాంతిలేనప్పుడు ఆరోగ్యం యెక్కడనుండి వస్తుంది? నేను పెళ్ళాడనన్నానని బావిలో వురికి చచ్చిన శాంత చేసింది బ్రతుకంతా నాశనం. శాంతి అనేది బ్రతుకులో లేకుండా చేసింది శాంత. కనీసం ఆత్మహత్య చేసుకుంటాననైనా చెప్పలేదు పాడుపిల్ల చచ్చేముందు. పాపం! చచ్చిపదాన్ని, ఆడిపోసుకోవటమెందుకులే. అంతా ప్రతుక్కి అర్థం లేకుండా చేసింది శ్యామలకాదా? అది తనను అభిమానించిందనే కదా శాంతను తిరస్కరించేడు తను. ఏమిటో, చివరికి యేదీ లభ్యం కాక యెడారయ్యింది మిగిలిన దంతా. అని యిలా తలపోస్తూ గతం యొక్క చిక్కటి రంగులు పులిమిన చిత్రపటానికి ఫ్రేమ్ కడుతున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

పరమేశం గంటకొట్టాడు.

బండి వచ్చేస్తున్నాదేమో అని చూశాడు. కనుచూపు మేరలో అటువంటి సూచన లేనివా కన్పించకపోయేసరికి స్టేషను మాస్టర్ని అడిగాడు శాస్త్రి.

'ఎందుకయ్యా అంత తొందరపడతావ్. సిదారిన పోయేబండి యాభైయ్యైదు నిముషాలు లేటని చెప్పాను కదా. ఇంక అరగంట పోతేనే కాని రాదు. ఇప్పుడొచ్చేది యింకో దారిన పోయేబండి' అని విసుక్కున్నాడు స్టేషనుమాస్టరు.

'ఓ హెూ, యింకా అరగంట పోవాలా నా బండి రావటానికి' అని బాధగా అంటూ వెళ్లి తన మొదటిజాగాలో, సిమ్మెంటు బెంచీమీద కూర్చున్నాడు విశ్వేశ్వర శాస్త్రి. ఆ వస్తున్న రైలు అతనికి కావలసిన రైలు కానందుకు కాదు బాధ, కనీసం అతన్నొక పెద్దమనిషిగానైనా గుర్తించకుండా స్టేషనుమాస్టరు అనవసరంగా మర్యాద పాటించకుండా విసుక్కున్నందుకు కలిగింది బాధ. విశ్వేశ్వరశాస్త్రికి

ఇలాంటిస్థితిలో కలిగిన మనోక్లేశం చాలా తడవలు జరిగింది అతనికి—నెమ్మదిగా నెట్టుకువచ్చిన ముప్పైతొమ్మిదేళ్ళ బ్రతుకులో శాస్త్రి తొందరపడి దూకుడుగా ప్రవర్తించడమనేది తగ్గించుకోవాలని ప్రయత్నం చేశాడు. మనిషిని ప్రకోపింపజేసే కొన్ని విషయాలపట్ల సహనంగా వుండాలని జాగ్రత్తపడుతూనే వస్తున్నాడు. కాని యిప్పుడు స్టేషనుమాస్టరు అనవసరంగా విసుక్కున్నాడని తెలిసికొని కొద్దిగా బాధపడ్డాడు అప్పుడాలోచించాడు యెందుకు బాధపడ్డానా అని. అతనికి నవ్వొచ్చింది.

'సాధారణంగా ఒకమనిషిని చూసిన తర్వాత అతనితో పరిచయం అనేస్థితివరకు వెళ్ళక పూర్వమే ఆ వ్యక్తిమీద మంచో, చెడో ఒక అభిప్రాయం మన ప్రయత్నం లేకుండానే యేర్పడ్డం జరుగుతుంది. [illegible] స్టేషనుమాస్టర్ని చూసాక అతనిమీద మంచి అభిప్రాయం యేర్పడలేదు తనకి. మనిషి ఆరోగ్యంగా వున్నంతమాత్రాన అతని ముఖంలో మంచితనం పొడచూపే భావం వుండాలనేమీ లేదు కదా. అందుకే, అతనంటే సదభిప్రాయం తోచని స్టేషనుమాస్టరే తనపై చిరాకు అసహనం చూపించే సరికి, అతనికి సమాన స్థాయిగా యేమీ జవాబివ్వలేని స్థితిలో తనకు బాధ కలిగింది' అనుకున్నాడు విశ్వేశ్వర శాస్త్రి.

అంతవరకు పంచె అంచు పట్టుకొని ఆలోచిస్తున్నవాడల్లా, అది విడిచిపెట్టి బెంచీమీదనుండి లేచి ప్లాట్‌ఫారంమీద నడక సాగించాడు. పైకి తేలివున్న కొద్దిగా పెద్దసైజు రాయిన్ని తన్నుతూ యిరవై అడుగులు నడిచాడేమో, అంతలో, అరెరె నా సూట్‌కేస్, బేగ అక్కడే వుండిపోయాయి అనుకొంటూ తిరిగి బెంచీదగ్గిరికి వచ్చి ఆ ప్రక్కనే పచార్లు సాగించాడు, ఆ వస్తువులకు కాపలా కాస్తున్నట్టు.

ఎట్టకేలకు అతడు యెక్కవలసిన రైలొచ్చింది. ఎవరో యిద్దరు దిగారు ఆ స్టేషన్లో. ఎక్కినవాడు మాత్రం శాస్త్రి ఒక్కడే. కంపార్టుమెంటులో సీటు సర్దుకొని, తన సూట్‌కేస్, బేగ్ అక్కడ వుంచి తలుపు దగ్గిరికొచ్చి నిల్చున్నాడు. ఒకసారి దూరానికి దృష్టి సారించాడు అక్కడ, ఒక పెద్దగుట్టమీద వున్న గుడి తెల్లని చిన్నమచ్చ ఆకారంలో కనిపిస్తున్నాది. ఆ గుట్టప్రక్కనే తను బడిపంతులుగా పనిచేస్తున్న గ్రామం వుంది ఆ గ్రామంలో ఒక రైతుపిల్ల. ఆమెలో శ్యామల పోలికలు చాలా వున్నాయి. పేరుకూడ నీల!

'తనలో వున్న అశాంతికి యెలాగైతే అర్థంలేదో, అలాగే తన అభిప్రాయాలు ఒక్కొక్కసారి తనకే అర్థం కావు—తనకు ప్రశాంతత లభించే మార్గం కరువయ్యిందని. దాని కోసమే ఒక మారుమూల గ్రామం యెన్నుకున్నాడు తను. అక్కడ రెండేళ్లున్నాడు కూడ ఇప్పుడేమైందని? అక్కడ సైతం శాంతి లభించే అవకాశం కరువయ్యిందనా ఈ ప్రయాణం?' యిలా ఆలోచిస్తున్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

గార్డు విజిల్ వూదాడు. రైలు 'కూయో' మన్నాది.

స్టేషను మాస్టరు ప్లాట్‌ఫారంమీద నిల్చొని తనవేపే చూస్తూన్నాడనే విషయం గమనించాడు శాస్త్రి. శాస్త్రి కూడ కొంచెం సేపు అతన్ని చూసాడు.

'ఎందుకలా చూస్తున్నాడు ... వీడ్కోలిస్తున్నట్టు' అనుకున్నాడు.

రైలు కదిలిపోతున్నది. అప్రయత్నంగా చెయ్యూపాడు శాస్త్రి! స్టేషనుమాస్టరు కూడ చెయ్యూపాడు, బదులుగా. తర్వాత తన సీట్లో కళ్ళు మూర్చుంటూ 'చిత్రం' అని వుచ్చరించాడు నోట్లో శాస్త్రి.

ఒక కుర్రవాడు ఆ కంపార్టుమెంటు చివర శ్రావ్యంగా గొంతెత్తి సినిమాపాట పాడుతున్నాడు. దానికి లయ వేస్తున్నాది రైలు. సాధారణంగా యేటువంటి పాట పాడినా దానికి రైలు తాళం వేస్తున్నట్టే వుంటాది. పాట వింటూ, 'గానంలో సుఖం, శాంతి వున్నాయి సుమీ' అనుకొంటూ తలూపాడు శాస్త్రి. రైలు వూపులకు కొద్దిగా నిద్ర కమ్మింది. అలా యెంతసేపు మతు కమ్మిందో, పాడుతున్న అబ్బాయి వొచ్చి 'బాబూ' అని పిలిచే సరికి తెలివొచ్చింది శాస్త్రికి. ఎదురుగా కూర్చొని వున్న ముసలాయన యెంతో యిచ్చాడా అబ్బాయికి. ఆ అబ్బాయి తనమూ అడిగేసరికి 'చిల్లరలేదు' అని ఒక మాట అనేసి వూరుకున్నాడు శాస్త్రి. కుర్రవాడు వెళ్ళిపోయింతర్వాత జేబు తడుముకున్నాడు. జేబులో చిల్లర డబ్బులున్నాయి. కొద్దిగా బాధ కలిగింది శాస్త్రికి.

'పిల్లలంతా నాటకమండీ. అనాధల మాదిరిగా వచ్చి మనమీద పడతారు. అంతా వట్టి అబద్ధం. మీకు తెలీదేమో పిల్లల్ని పని చెయ్యమని చెప్పి వాళ్ళ తల్లిదండ్రులే పురికొల్పుతారు. ఆఁ' అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి యెదురుగా వున్న ముసలాయనతో.

'అంతే లెండి నిజం' అన్నాడు అతడు కూడ.

ఆ విధంగా మాట కలిసి పరిచయమైంది శాస్త్రికి యెదుటి వ్యక్తితో. అలా మొదలైన సంభాషణ క్రమంగా మరింత లోతుకుపోయింది. ఆ సంభాషణవల్ల అతని గురించి కొంత తెలుసుకున్నాడు శాస్త్రి.

అతడొక పొగాకు వ్యాపారి. ఇద్దరు కొడుకులు, కూతురు ఒకత్తె అతని

# వృత్తం

సంతానం. పెద్ద కొడుక్కి పెద్ద చదువు చదివించాలని యెంతో వుబలాటపడ్డాడట. కాని చెడు సహవాసాలుచేసి యింటరు రెండు సార్లు తప్పి యిక సాగలేనని చెప్పి చదువాపి బాధ్యత అన్నది లేకుండా కాలవేస్తుకు వూరిమీద తిరుగుతాడట పెద్దకొడుకు. తర్వాత అమ్మాయి పెళ్ళీడు కొచ్చింది. ఇంకేం అది గుండెలమీద కుంపటి వాటం. దించుకోవలసిన బాధ్యత యెలాగూ వుంది.

ఇక మూడోవాడు అబ్బాయి. పాపం! ఆ అబ్బాయి గురించే జాలిపడ్డాడు శాస్త్రి. ఎంతో తెలివైనవాడట. క్లాసులో ఫస్టు మార్కులన్నీ వాడివేట. ఏదో ఒకసారి తండ్రి యెందుకో కొట్టాడని కోపంతో యిల్లు వదిలి వెళ్ళిపోయాడు. ఆ చుట్టుప్రక్కల యెంత వెదికినా దొరకలేదు. తెలిసిన బంధువులందరికి కబురు పంపి తెలుసుకున్నాడు. చివరికి పేపర్లో ప్రకటన చేశాడు. జాడ తెలిపినవారికి వుచిత బహుమతి యిస్తామని. మూడేళ్ళయ్యాక [illegible] ఆ కుర్రవాణ్ణి గమనించి, మంచి చేసి యింటికి పంపమని తల్లిదండ్రులకు తెలియపర్చారు. ఇప్పుడు అతడు చేస్తున్న ప్రయాణం కొడుకుదగ్గరికే. అతని ప్రక్కనే అతని భార్య వున్నాది. ఆమె ముఖంలో సంతోషం లేదు, విచారంలేదు. చాటికీ నిశ్చలంగా వుంది. కాని నిజానికి ఆమె మనస్సులో కొడుకు విషయమై సంతోషం, విచారం కూడ వున్నాయి, అని తెలుసుకున్నాడు శాస్త్రి.

ఇంతకాలం ఆమె కొడుకు కనిపించక [illegible] యెన్నో [illegible] ఆందోళనతో రాత్రుళ్ళు పీడ కలలతో యమయాతన అనుభవించిందట. ఆమె భర్త చెబుతూంటే శాస్త్రి వింటున్నాడు. ఆమె ఒక్కమాట కూడ మాట్లాడ్లేదు.

'జీవితమంటే మరోటేమీ కాదండీ. రంగురంగుల [illegible] పెట్టుకోవటానికి పడే ప్రయాస. అంతే' అని వ్యాఖ్యానించాడు అతను చివరికి.

ఆ వ్యాఖ్యానంలో రోత స్పష్టంగా వినిపించింది శాస్త్రికి.

'చాలమందికంటె తను సుఖంగానే వున్నాడేమో' అని క్షణకాలం అనుకున్నాడు శాస్త్రి.

రైలు స్పీడు కొద్దిగా తగ్గి మళ్ళీ అంతలోనే పుంజుకున్నది. తర్వాత స్టేషన్లో ఆ భార్యాభర్త లిద్దరు దిగిపోయారు. వాళ్ళగురించే ఆలోచిస్తూ కిటికీలోనుండి బైటికి చూస్తున్నాడు శాస్త్రి. ఆ సమయంలో అతనికి చటుక్కున ఒక విషయం గుర్తొచ్చింది 'అరె! చాలా అతనిగురించి తెలుసుకున్నానే కాని యింతకీ అతని పేరు...?'


కంపార్టుమెంటులో నలుగురైదుగురు మగాళ్ళు పేకాడుతూ మధ్యమధ్య గొల్లుమని వాళ్ళ నవ్వులు తప్పిస్తే మరో శబ్దంలేదు. ఇంతలో ఒక ఆరేళ్ళ అమ్మాయి గబగబ వచ్చి శాస్త్రి కూర్చున్న చోటుకి యెదురుగా వున్న కిటికీ ప్రక్కన కూర్చొని 'అమ్మా! రావే ఇక్కడ మంచి జాగా దొరికింది' అంటూ అరిచింది. కిటికీలోంచి బైటికి వుత్సాహంగా చూస్తూ.

'ఆ పెట్టె జాగ్రత్తగా అదిగో మా అమ్మాయి కూర్చున్న బల్లక్రింద పెట్టు బాబూ' అని అంటున్నాది ఆ అమ్మాయి తల్లి కాబోలు పోర్టరుతో. ఆమె కంఠస్వరం విని అప్రయత్నంగా తల తిప్పి చూశాడు శాస్త్రి. ఆమెను సులభంగా గుర్తుపట్టగలిగేడు. ఆమె కూడ అతన్ని చూసింది.

విచ్ఛిన్నం లేకుండా తదేకంగా శాస్త్రి చూసిన చూపుతో యవ్వనకాలపు స్మృతులు రేగి మార్మోగాయి.

'సుఖంగా వున్నావా శ్యామలా?' అని అడిగాడు

కొంచెం తడబడింది. అంతలోనే సంతో



వంతో 'ఆఁ, సుఖంగానే వున్నాను.' అని 'మీరు బాగున్నారా ?' అని అడిగింది శ్యామల.

'ఆఁ బాగులేకేం' అన్నాడు శాస్త్రి సంక్షిప్తంగా. ఆమె సర్దుకొని సీట్లో కూర్చుంది. ఆమెగురించి యెన్నో అడగా లనుంది అతనికి. అలాగే ఆమెకూడ అను కున్నాది. ఐనాకాని పిరికి పందల్లా యెవరికి వారె ఒదిగిపోతున్నారు.

శ్యామల కూతురు తదేకంగా గబగబ పారిపోతున్న ప్రకృతిని చూస్తూ తన్ను తాను మర్చిపోయింది. హఠాత్తుగా 'అమ్మా, చూడవే అల్ల కొండల్లోనుంచి పొగలొస్తు న్నాయి' అని అరిచి అంతవరకు వున్న నిశ్శబ్దాన్ని పారద్రోలింది. దాంతో కొంచెం ధైర్యం కలిగినట్లయింది శాస్త్రికి.

'నీ భర్త నీతో రాలేదా శ్యామలా ?' అని ప్రశ్నించాడు.

ఆమె సమాధానం యింకా యివ్వ బోతూంది అతని ప్రశ్నకు—

'ఈ అమ్మాయి ఒక్కతేనా యింకెవ రైనా పిల్లలా ?' అని అడిగాడు శాస్త్రి. దానికూడా జవాబు చెప్పటానికి ప్రయ త్నంతో వుంది శ్యామల.

'అన్నట్లు నాకే విషయాలు తెలుసుకోవ టానికి అవకాశం లేకపోయింది శ్యామలా. నీ భర్త యిప్పుడు గెజిటెడ్ ఆఫీసరు అయ్యుంటాడనుకుంటాను.' అని యిక అడగడం ఆపాడు శాస్త్రి. అతని ఆఖరు ప్రశ్న విని జవాబు చెప్పటానికి బదులు శ్యామల విన్న వదనయై మరింత ఒదిగి పోయి కూర్చున్నాది.

'మీరు పెళ్లి చేసుకున్నారా ?' సంశ యంగా అడిగింది శ్యామల చివరికి.

'నీకు సంశయం కలిగింది కదూ శ్యామలా. నాకు తెలుసు. లేదు, నేను పెళ్లి చేసుకోలేదు' అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

'ఎందువల్ల' అని అడగలేదు శ్యామల.


చింతోసేపు మౌనంగా వుండిపోయారు యిద్దరూ.

కడుపు ఆకలి కలిగినట్లు మనస్సుకే ఆకలి వేసింది శాస్త్రికి ఒక్కసారిగా.

శాంతిలేని జీవిత అనుభవాలను యేక వూపిరిమీద చెప్పసాగాడు. చెబుతూ తదేక దృష్టితో శ్యామలను చూస్తూ మధ్యమధ్య నిట్టూర్పులు విడవసాగాడు శాస్త్రి. నీల గురించి కూడ చెప్పాడు, చెప్పడమే కాదు. ఒక వున్మాదిలా వర్ణించాడు. అతడలా వర్ణిస్తూంటే 'యెవరీ నీల' అనే ప్రశ్నతో వులిక్కి పడింది శ్యామల. ఆమెకెన్నో సంశ యాలు కలిగాయి.

'.. నీలకు పెళ్లైంది. వరుణ్ణి పెళ్లి పీటల మీద చూసాను. నాకెందుకో అను మానం కలిగింది శ్యామలా, నీల సుఖపడు తుందా అని. ఎందుకలా అనిపించిందంటావ్? ఏదైనా అసూయవల్ల అలా అనుకున్నా నేమో అని కూడ తలపోసాను. ఉహూఁ అదికాదు నిజం. పవిత్రమైన దృష్టితోనే చూసాను' అని ఆగి సాలోచనగా శ్యామల వేపు చూసాడు. అప్పటికి యింకా కొంత బాధ అతని కంఠంలోనుండి రావలసివుంది. కాని అది రాలేక పోయింది శ్యామలను చూసాక

శ్యామల తలొంచుకొని వుంది. ఆమె కొద్దిగా నవ్వుతున్నట్లుగా కూడ వుంది. ఆ నవ్వు కప్పి పుచ్చటానికే తల అలా దించుకున్నా దేమో అనిపించింది. ఆ సమయంలో ఆమె మొహంలో నవ్వుమాసి శాస్త్రి బాధ పడ్డాడు. ఆమెను మనస్సులో తీవ్రంగా నిందించాడు. అలాంటి శ్యామలతో యిక మాటాడకూడదని, అనవసరమని అను




కున్నాడు. ఐనాకాని ఒకమాట అడగకుండా వుండలేక పోయాడు చివరికి :

'శ్యామలా. ఒకటడుగుతాను చెప్పు. అశాంతి అధికమైతే సంశయాలు వుద్భ విస్తాయా మనిషిలో, లేకపోతే సంశయాలు యెక్కువవ్వడంవల్ల అశాంతి కలుగు తుందా ? చెప్పు శ్యామలా.'


శ్యామల తలెత్తి ఒకసారి అతన్ని చూసి మళ్లీ తల దించుకొని, 'నిజంగా చెప్తు న్నాను. ఈ ప్రశ్న యింతవరకు నా జీవి తంలో కలగ లేదు. కాని, యిప్పుడు విశా ప్రశ్న వింటూంటె 'అర్థంలేని సంశయాల సంఘర్షణమే అశాంతి' అనే జవాబు కూడ మీరే చెబుతున్నట్లు స్పష్టంగా అనిపిస్తు న్నాది నాకు' అన్నాది శ్యామల. ఆమె కంఠ స్వరంలో కఠినత్వ మున్నట్లు తోచింది శాస్త్రికి. ఏమీ మాటాడలేక పోయాడు. ఒక పెద్ద నిట్టూర్పు మాత్రం అతన్లో నుండి బైటికొచ్చింది.

శ్యామల ధైర్యంగా కూర్చొని బైటికి చూస్తూంది వర్షం పడుతున్నది బైట. రైలు ఒక పెద్ద స్టేషనుకొచ్చి ఆగింది. శ్యామల శాస్త్రితో చెప్పి సామాను పట్టించుకొని దిగి పోయింది. ఆమె దిగి పోతున్నప్పుడు యెటువంటి విశేషం జరగ లేదు విశ్వేశ్వరశాస్త్రి మనస్సులో. గుండె స్పందన స్పదు విషయంలో కొంచెం విరామం తీసుకున్నట్లు అయింది గాని మళ్లీ వెంటనే సర్దుకొని మామూలుగా సాగిపోయింది.

ఇంతలో శ్యామల కూతురు కిటికీదగ్గిరి కొచ్చి 'వెళ్లొస్తాను మామయ్యా' అని చెప్పి తుర్రుమంది తల్లిదగ్గిరికి.

వెళ్లిపోతున్న తల్లీ కూతుళ్ల వేపు చూస్తూ నవ్వుకున్నాడు శాస్త్రి. అలా కొంతసేపటి వరకు తనలో తాను నవ్వు కుంటూనే వున్నాడు. హఠాత్తుగా ఆ నవ్వు ఆగిపోయింది. అతని మొహంమీద ఏదో తలచుకొని యెంతో సిగ్గుతో అతని మొహం యెర్రగా తయారయ్యింది. తలెత్తాడు.

వర్షం పడ్డం వల్ల రైలుపట్టాలు తడిసి మెరుస్తున్నాయి. అంతవరకు తన మన స్సులో సంకీర్ణమై వున్న భావం తొలగి పోయి ప్రశాంతత చిక్కినట్లు తనేదో బాగుపడినట్లు తోచింది విశ్వేశ్వర శాస్త్రికి.




# మల్లన్నమంత్రి అనుమతిపత్రం

## కథానిక

ఒకప్పుడు తూర్పుదేశంలో కరువు వచ్చింది. కొంత ధాన్యాన్ని సహాయంగా పంపమని కోరుతూ ఆ దేశపు రాజు మల్లన్నమంత్రి వద్దకు రాయబారిని పంపినాడు. రాజూ, మల్లన్నమంత్రి తూర్పు దేశానికి ధాన్యం పంపించడానికి అంగీకరించారు.

మల్లన్నమంత్రి రాజ్యం నుండి తూర్పు దేశానికి బళ్ళు వెళ్ళాలంటే దక్షిణ దేశంలో కొంచెం దూరం ప్రయాణం చేయవలసి ఉంది. దక్షిణ దేశపు రాజుకు, తూర్పు దేశపు రాజుకు విరోధం ఉంది. అందుచేత ధాన్యం బళ్ళు తన దేశంగుండా ప్రయాణం చేయడానికి దక్షిణ దేశపు రాజు అంగీకరించడు.

దక్షిణదేశంలోనుంచి కాకుండా వేరే మార్గంగుండా తూర్పుదేశం వెళ్ళడానికి వారం రోజులు అదనంగా పడుతుంది. అంతవరకు ఆగితే తూర్పు దేశంలోని ప్రజలకు చాలా యిబ్బంది కలుగుతుంది. ఈ పరిస్థితిలో యేమి చేయాలో యెవరికీ యేమీ తోచలేదు.

'ధాన్యం బళ్ళమీదకు యెక్కించి దక్షిణదేశపు సరిహద్దువరకు వెళ్ళ' మని మల్లన్నమంత్రి భటులకు ఆజ్ఞ యిచ్చాడు. తరువాత యెవరికీ చెప్పకుండా మల్లన్నమంత్రి యెక్కడికో వెళ్ళాడు.

మల్లన్నమంత్రి చెప్పిన ప్రకారం ధాన్యపు బళ్ళు మూడు రోజుల్లో దక్షిణదేశపు సరిహద్దు దగ్గరకు వెళ్ళాయి. మల్లన్నమంత్రి అక్కడ ధాన్యపు బళ్ళను కలుసుకొన్నాడు. తన రాజ్యంలోనుంచి ధాన్యం బళ్ళను వెళ్ళనివ్వవలసినదిగా దక్షిణ దేశపు రాజు యిచ్చిన అనుమతి పత్రాన్ని మల్లన్నమంత్రి భటులకు యిచ్చాడు. ఆ అనుమతి పత్రాన్ని చూపించి ధాన్యపు బళ్ళు దక్షిణదేశాన్ని సురక్షితంగా దాటి తూర్పుదేశానికి వెళ్ళాయి.

దక్షిణదేశపురాజు అనుమతిపత్రాన్ని యెలాగ యిచ్చాడని రాజు అడగ్గా మల్లన్నమంత్రి యిలాగ సమాధానం యిచ్చాడు :

'ప్రభూ ! దక్షిణ దేశపు రాజు అనుమతి పత్రాన్ని యివ్వలేదు. నేనే దానిని తీసికొన్నాను. ఇక్కడ నుంచి నేను మారువేషంలో దక్షిణదేశపు రాజు వద్దకు వెళ్ళాను. నాతోపాటు ఒక యింద్రజాలికుడు కూడా వచ్చాడు. అతను దక్షిణదేశపు రాజు యెదుట యింద్రజాలాన్ని ప్రదర్శించాడు. చేతని ఉన్న రాజముద్రికను ఒకసారి యివ్వవలసినదిగా దక్షిణదేశపురాజును ఇంద్రజాలికుడు అప్పుడు అడిగాడు. దక్షిణ దేశపు రాజు తన రాజముద్రికను యిచ్చాడు. ఇంద్రజాలికుడు హస్తలాఘవంతో ఆ ముద్రికను నాకు యిచ్చాడు. అంతకు ముందే నేను తయారుచేసి ఉంచిన పత్రంమీద ఆ రాజముద్రికతో రహస్యంగా ముద్ర వేశాను. తరువాత రాజముద్రికను ఇంద్రజాలికుడు ఆ రాజుకు తిరిగ యిచ్చివేశాడు. ఆ పత్రం యొక్క సహాయంతోనే ధాన్యపు బళ్ళు దక్షిణ దేశాన్ని దాటి తూర్పు దేశానికి వెళ్ళాయి.'

రాజు మల్లన్నమంత్రి యుక్తిని మెచ్చుకొన్నాడు. తూర్పు దేశపు రాజు మల్లన్నమంత్రికి, రాజుకు తన కృతజ్ఞతను తెలియజేశాడు.


బాపు
ఫేర్‌లో
అబ్బ! తిరిగి తిరిగి కాళ్లన్నీ నెప్పెడుతున్నాయి - ఆయాసం కూడాను!
ఆ టవర్ చూద్దామని తల పైకెత్తాడు - అంతే!
VIET UNIO
నాకేలారీ కావాలి - ఇప్పుడు కొనిపెట్టు!
ట్రేడ్ ఫేర్‌లో చాలా దూరం నడవాల్సిగా - ఎందుకైనా మంచిదని మరో చెప్పులు జత తెస్తున్నా!
INDIAN INTERNATIONAL TRADE AND INDUSTRIES FAIR'68 MADRAS
అంతకే తొపోతే తర్వాత బస్సులో వెళ్లొచ్చండి అంటే విన్నారా?
TO HOME


PAVILION
OUT
ఇదుగో - ట్రేడ్ ఫేర్ ఆఖరి రోజు రేపే!!
త్వరలో ప్రారంభం
TO BE OPENED SHORTLY
మా "పెవిలియను"లో వస్తు సామగ్రి ఏవీ లేవేం సార్??
కరెంటు పోయినప్పుడల్లా జనం ఎగరేసుకు పోయారు!!
OUR EXPORTS ....
NOT FOR SALE
The Indian International Trade and Industries Fair
EXPORT PAVILION
OUR EXPORTS: FROM FROG-LEGS TO FRIGIDAIRES! EXCEPT MOON ROCKETS!!
మనం విదేశాలకు కప్ప కాళ్ళ నుంచి ఫ్రిజిడేర్ల వరకు ఎగుమతులు చేస్తున్నాం — ఒక్క రాకెట్లు తప్ప !!!!!
కొంప దీసి మన వాళ్ళు బ్లేడ్లు అవీ ఎగుమతి చెయ్యడం లేదుగద
INDIAN RAILWAYS
ఛీ ఛీ పాడు జనం - వెధవ జనం!
రైల్వే పెవిలియను కదూ - అలాగే ఉంటుదిలే!!
లోకోభిన్న రుచిః
ఎక్స్‌పో 67 ముందు దిసీస్ నథింగ్ సార్!!
అక్కడక్కడ కొంత మంది ఆడాళ్ళు వాలంటీర్లుగ వుంటున్నారు - భలే వున్నారు - స్మార్ట్ గరల్సు!!
ట్రేడ్ ఫేరు ట్రేడ్ ఫేరు - ఇరవై రూపాయలెగిరి పోయాయ్

# మూడుముళ్ళు

అచ్యుతవల్లి

### జరిగిన కధ

కవిరాజు ధన్వంతరీ నిలయం నరసయ్యగారికి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు కొడుకులు. పెద్దపిల్ల కామేశ్వరి. రెండవ పెళ్ళివాడైన కేశవమూర్తితో కామేశ్వరికి వివాహమైపోయింది. కామేశ్వరి అభిరుచిని తెలుసుకున్న కేశవమూర్తి ఆమెని నళినితోపాటు చదువుకోడానికి కాలేజీకి పంపుతాడు. మాధవ నళిని సన్నిహితుడు. అతని అన్న రమణాధానికి కామేశ్వరిని పరిచయం చెయ్యమని నళినిని కోర్తాడు. మాధవ కామేశ్వరి కాలేజీ [illegible] నళినికి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

## 8

గవర్రాజు కిప్పుడు నాలుగు డబ్బులు వెనకేసుకోవటం చాతనయింది. పగలల్లా కొట్టుమీద కూర్చునేవాడు! సాయంకాలం మొదటాట సినిమాకి వెళ్ళిపోయేవాడు. రాత్రుళ్ళు నరసయ్యగారి వీధరుగు మీదవున్న చిన్న కొట్టు గదిలో పడుక్కునేవాడు! అతనిదగ్గర నాలుగయిదు వేల రూపాయిలు చేరాయి! పెళ్ళి చేసుకున్నాక ఎక్కడయినా చౌకలో స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకోవాలని అతని ఆశయం!

నరసయ్యగారు, కామేశ్వరి పెళ్ళికోసం వెతికి వెతికి వేసారిపోతూంటే గవర్రాజు తనలోతనే నవ్వుకునేవాడు! తనకి ఎవరూ పిల్లనిస్తామంటూ రాకపోవటం చూసి ఆశ్చర్యపడేవాడు! గవర్రాజు చూపులకు బాగానే వుండేవాడు! మంచి ఉన్నతమైన శరీరమూ, చామనిచాయ రంగుతో, వంకులు వంకులు తిరిగిన జుట్టుతో అందంగానే కనపడేవాడు! సిగరెట్ కన్న ఇంకేం దురభ్యాసమూ లేదు! ఇదివరలో పేకాట ఆడేవాడు! స్వంత ఆర్జన మొదలెట్టిన తర్వాత ఆ పూర్వపు అలవాటుని వదిలిపెట్టాడు! మరెందుకని కన్యాదాతల చూపులు తనమీద పడటం లేదు? అని ఆలోచించేవాడు! నరసయ్యగారు మటుకు వందరూపాయల జీతం తెచ్చుకునే గుమాస్తాకోసం మూడు వేలూ, రెండువేలూ, కట్నం ఇస్తామని తిరిగేవారు కాని, కంటిముందు, నెలకి రెండుమూడు వందలు ఆర్జించుకునే గవర్రాజు పెళ్ళికొడుకుగా ఆయినకి తోచేదికాదు!

'ఎదురుగా నేను కనపట్టంలేదు కాబోల్ను! అల్లా వూళ్ళట్టుకు తిరుగుతున్నారు! 'గవర్రాజా! మా కాముడుని పెళ్ళిచేసుకోకూడదుటోయ్!' అని ఒక్కముక్కంటే, తను కానీ కట్నం తీసుకోకుండా, పెళ్ళాడడూ! ఆ నేరేడు పండుకి నేను తగనా!' అనుకునేవాడు గవర్రాజు. కామేశ్వరికి వచ్చిన సంబంధమల్లా తిరిగి వెళ్ళిపోతూంటే లోపల్లోపల మురిసిపోయేవాడు గవర్రాజు.

'ఆఁ! ఈసారి తప్పక నన్నే పెళ్ళాడమంటారు! పెళ్ళి చేయకుండగా ఇంకెన్ని రోజులు అట్టే పెట్టుకుంటారు? పెద్దపిల్ల కాకుండా, చిన్నదికూడా రోజురోజుకీ గుర్రమల్లె ఎదిగి కూర్చుంటోంది! పెద్దమ్మాయికి పెళ్ళి చెయ్యాల్సిన ఈడే తప్పిపోతోంది!' అనుకునేవాడు. కాని నరసయ్యగారి దృష్టిలో గవర్రాజు, పెళ్ళికొడుకుక్రింద ఆనేవాడు కాదు! పక్కవారైనా ఆయన,

'నీకు పెళ్ళయిందా!' అని కానీ,

'పెళ్ళిచేసుకోకుండా ఎన్నాళ్ళుంటావ్!' అని కానీ వ్యక్తిగతమైన ప్రశ్నలు వేసేవారుకాదు. అయిదూ, పది అవసరంవస్తే అడిగేవారు. గవర్రాజు లేదనకుండా అప్పు చేసయినాసరే ఇచ్చేవాడు! చిట్టిబాబుని తరుచు సినిమాలకు తీసుకెళ్ళేవాడు! కామేశ్వరికి వొచ్చే సంబంధాలన్నీ తిరిగి వెళ్ళిపోవటానికి తగిన ప్రయత్నాలు చేసేవాడు! చిన్నపిల్లని దాచి, పెద్దపిల్లనే చూపెట్టారనీ ఆ పిల్ల నల్లగా కాటేక్కాయలా వుంటుందని ఎవళ్ళకీ నచ్చటం లేదనీ చిన్నపిల్ల తెల్లగా బాగుంటుంది కనుక అందరూ ఆ అమ్మాయినే చేసుకుంటామంటున్నారనీ వచ్చిన ప్రతీ సంబంధాల వాళ్ళతోనూ చెప్పేవాడు! నాలుగయిదురోజులు గడిచాక చిట్టిబాబుని అడిగేవాడు!

'మీ అక్కను చూసుకుందుకు వచ్చేరుగా పెళ్ళివారు? ఏమన్నారు?'

'ప్చ్! నచ్చలేదని వ్రాసేసారు!' అనేవాడు చిట్టిబాబు! అదంతా తన ప్రజ్ఞ వల్లే జరిగిందనుకొని మురిసిపోయేవాడు గవర్రాజు!

ఉన్నట్టుండి మేఘంలేని ఆకాశం ఉరిమింది! నరసయ్య ఇంటిముందు నాలుగు రాటలు పాతి పచ్చని కొబ్బరి ఆకులతో పందిరి వేసారు! మామిడాకులతో తోరణాలు కట్టారు. ఇంటా బయటా పిల్లా పెద్దా సందడిగా తిరుగుతున్నారు. తనతో సంప్రతించకుండా ఎవళ్ళు కామేశ్వరిని పెళ్ళాడుతున్నారా? అని ఆశ్చర్యపోయేడు గవర్రాజు!

'ఏమిటోయ్! సందడి?' అని అడిగేడు చిట్టిబాబుని.

'మా అక్క పెళ్ళి!' అన్నాడు చిట్టిబాబు.

'మీ బావ ఏంచేస్తున్నాడు ?' అన్నాడు,

'కాలేజీలో లెక్చరర్ ! చెప్పాడు చిట్టిబాబు. ఈసారి విస్తుబోయేదు గవర్రాజు!

ఎవళ్లా చేసుకోకుండా వుంటే ఏ పౌరోహిత్యాలు చేసుకుని కాలం గడిపే వాళ్ల పిల్లాడికో ఇస్తున్నారేమో అనుకున్నాడు గవర్రాజు. అల్లాంటప్పుడు, తను ఆకస్మికంగా పందిట్లోకి ప్రవేశించి,

'మీకేమన్నా మతిపోయిందా ? ఆ యాయవారం చేసుకునే వాడికిస్తున్నారా నిక్షేపం లాంటి పిల్లని ? నూరేళ్ల నిండు జీవితాన్నిధ్వంసం చేస్తున్నారా! ఒక ముక్క, నాతో చెబ్తే నేను చేసుకోకుండా వుండేవాడినా !' అంటూ కామేశ్వరి విభ్రాంత చూపులతో పాటు ఆ నిర్భాగ్య తల్లితండ్రుల మెప్పుని కూడా పొందాలని ఆకాంక్షించేడు !

'రెండో పెళ్లా !' అన్నాడు గవర్రాజు.

చిట్టిబాబు గవర్రాజు ప్రశ్నకి చిన్న బుచ్చుకున్నాడు.

'అవును !' అన్నాడు.


గవర్రాజుకి ఎందుకనో పట్టరాని సంతోషం కలిగింది ! 'రెండో పెళ్లి పంతులుకి చేస్తున్నారన్నమాట ! బహుశా ఆ పెళ్లికొడుకు వేడో రేపో రిటయిరయి పోయే స్టేజ్‌లో వుంటాడు ! తన్ని గుర్తించనందుకు తగినశాస్తి జరిగింది కామేశ్వరికి ! అనుకున్నాడు. అంతలో మళ్లీ స్ఫుటంగా తనతప్పు తెలుసుకున్నాడు !' కామేశ్వరికి శాస్తి జరిగిందనుకుంటున్నాడు తను ! తనెప్పుడయినా కామేశ్వరితో తన మనసులోనిమాట చెప్పుకున్నాడా !

ఆమెమీద తన కెందుకు ఈసు కలగాలి! ఆమెకి తన అభిప్రాయం ఈ షణ్మాత్రమూ తెలేదు! తనలోతనే మల్లగుల్లాలు పడుతూ కాలం వృధా పుచ్చేసాడు! వక్కనాడయినా ఆమెతో తను మాట్లాడ లేదు! తను తన అభిప్రాయం చెప్పకున్నాక ఆమె తన్ని కాదనటం జరిగితే కదా! ఆమెకి తగిన శాస్తి జరిగిందనుకుంటూ, తాను సంతోషించటం? ఇన్నాళ్లా తనకే కామేశ్వరి నిచ్చి పెళ్లి చేయక తప్పదనే పరిస్థితి వస్తుందని వూహించాడు కనుక అల్లా జరగకపోవటంతో ఆమెమీద కోపం వస్తోంది తనకి!'

గవర్రాజు కామేశ్వరి పెళ్లికి సంతోషంతో ఇటూ అటూ తిరిగాడు. పెళ్లికొడుకు కేశవని చూసి మరింత ఆశ్చర్య పోయాడు! కేశవ దృఢంగా వున్నాడు! గౌరవంగా కన్పడిన కేశవని, హుందాగా ఉన్నంతగా కన్పడిన కేశవని చూసి మళ్లీ వకసారి నిట్టూర్చాడు! అతని ఉన్నతమైన దేహం ఆకర్షవంతమైన దేహం ప్రక్కన కామేశ్వరి పీలగా చామన చాయగా కన్పడింది!

'ఎల్లా నచ్చిందో ఈ అమ్మాయి ఈతనికి!' అనుకున్నాడు గవర్రాజు.

* * *



'ఇంటి దగ్గర్నించి వచ్చేవా రాజా! మా వాళ్లంతా కులాసాయేనా! క్రిందికి పద' అంది కామేశ్వరి. కామేశ్వరి ఇంతవరకూ గవ్రరాజుతో మాట్లాడి ఎరుగదు. మాట్లాడాల్సిన అవసరమూ కలగలేదు! ఈ రోజు తన పుట్టింటివద్దనుంచి వచ్చేడు తనకు అతిథిగా! ఆదరంగా మాట్లాడి పంపాల్సిన బాధ్యత ఆమె మీది వుందికదా! అందుకని పలకరించింది!

ఇద్దరూ క్రిందికిదిగి హాలులోనికి వచ్చారు. హాలులో కుర్చీల్లో, రామనాథం, మాధవ, నళిని కూర్చున్నారు. ఇద్దరు యువకుల్నీ గుర్తుపట్టాడు గవ్రరాజు! వాళ్లతో సమానంగా కుర్చీల్లోకూర్చుని, కులాసా కబుర్లు చెప్పుకుంటున్నా నళినిని చూసి కొంచెం సిగ్గుపడ్డాడు! అందమైన ఆధునికంగా అలంకరించుకున్న 'నళిని' స్వేచ్ఛ గవ్రరాజుకి చిన్నతన మనిపించింది.

'జ్ఞాపకమున్నానా? మళ్లీ ఇక్కడ కలుసుకుంటా మనుకోలేదు!' అన్నాడు గవ్రరాజు.

గ్లాస్కో పంచెకట్టు సిల్కు లాల్చీ ధరించి, ప్రక్కపాపిడితీసి వంకులు వంకులుగా జుత్తు ఎగిరేటట్లు దువ్వుకున్న క్రాఫింగ్‌తో కునేగా పరిమళంతో గవ్రరాజు ఆకర్షణీయంగా అగుపించేడు నళినికి. రామనాథం, వకకుర్చీ చూపి,

'కూర్చోండి!' అన్నాడు.

గవ్రరాజు సంకోచించకుండా, కూర్చున్నాడు. కామేశ్వరి, కాఫీ తయారు చేయటానికి లోపలికి వెళ్లింది.

'మీరు ఉద్యోగం చేసేవూరు ఇదే నేమిటి!' అన్నాడు గవ్రరాజు. రామనాథంతో.

'వూం! మా తమ్ముడు చదువుకునేదీ ఈ వూరే!' అన్నాడు రామనాథం.

'ఏం! ఇలా వచ్చేరు?' అడిగాడు మాధవ.

'వాళ్ల తోటల్లోంచి అరటిగెలలూ, చెరుకులూ వచ్చేయి! ఇంటికి పెద్దమ్మాయి! పెళ్లయి ఏడాదయినా పుట్టింటి గడప తొక్కలేదని, వాళ్లమ్మగారు వూరికే బెంగపెట్టుకున్నారు! నేను పనిమీద ఈవూరు వెళ్తున్నానని

# మూడుముళ్లూ

చెబ్తే నన్ను అమ్మాయిని చూసి అవి ఇమ్మన్నారు! పంపుతే కూడా తీసుకరమ్మన్నారు! నాలుగురోజు లుంచుకుని పంపుతామన్నారు! అందుకని ఇటుకూడా వచ్చేను. లేకపోతే రాను! పట్నం మటుకు నారాని కోపారి వస్తాను. హోటల్ వినోదాలో సగం భాగం నాకు వుంది. దాని వ్యాపార వివరాలు చూసుకుందుకువస్తూవుంటాను?' అన్నాడు గవ్రరాజు.

'మీకు వినోదాలో షేరు వుందా!' ఆశ్చర్యపోతూ అడిగాడు మాధవ.

'ఆఁ! బాలుచెట్టి లాస్‌లో పడ్డాడు! అప్పుడు నేను అప్పుని సగం భరాయించి హాఫ్ వాటా తీసుకున్నాను' అన్నాడు గవ్రరాజు.

నళిని విభ్రాంత య్యింది. హోటల్ వినోదాకు నళిని తరుచు వెళ్తూవుంటుంది. ఆ పట్నంలోకల్లా మోస్టు లక్జూరియస్ హోటల్‌గా వినోదా ప్రసిద్ధి కెక్కింది! తరుచు మంత్రులు, సినిమా తారలూ, అక్కడికి వచ్చినప్పుడు ఆ హోటలులోనే మకాం వేస్తారు. మూన్‌లైట్ డిన్నర్లు రూఫ్ గార్డెన్స్‌లో ఎంతో ఆహ్లాదకరంగా ఏర్పాటు చేస్తారు హోటల్ వినోదా వాళ్లు.

'మిమ్మ, మిమ్మ వినోదాలో చూచిన గుర్తు లేదు నాకు!' అంది నళిని.

'మీరు వస్తూవుంటారా?' అన్నాడు గవ్రరాజు.

'నేను 'వినోదా'లో మూన్‌లైట్ డిన్నర్లని మిస్ కాను' అంది నళిని.

'నేను ఎప్పుడూ డిన్నర్‌కి వుండను. అందుచేత మీరు నన్ను చూసివుండరు! నేను ఇక్కడకు వస్తే మావాళ్ల ఇంటికి వెళ్తాను' అన్నాడు గవ్రరాజు.

'ఇక్కడ మీ వాళ్లున్నారా?' అంది నళిని.

'వున్నారు! నాకు ఇద్దరు అన్నలూ, వదినలూ, వాళ్ల పిల్లలూ వున్నారు! వాళ్లనిచూసి భోజనంచేసి వెళ్లిపోతాను' అన్నాడు గవ్రరాజు.

గవ్రరాజు, నళినీ, ఒకళ్ల వివరాలు ఇంకొకళ్లడిగి తెల్సుకుంటూ కబుర్లలో పడ్డారు. మాటల సందడిలో నళిని, కామేశ్వరికి 'సవతి కూతురు' అవుతుందని తెల్సుకున్నాడు గవ్రరాజు.

రామనాథానికి కామేశ్వరికి పెళ్లయినట్లు తెలిసింది? కాని ఎవరితో అయ్యింది? పెళ్లి అంటూ అయితే కాలేజీలో జేరి ఎందుకు చదువుతోంది? అంటూ ఆలోచనల్లో పడ్డాడు. మాధవకి ఇదంతా చిత్రంగా తోచింది. 'చిన్నబడ్డీలో కిళ్లీ కొట్టు పెట్టుకుని వ్యాపారం చేసే గవ్రరాజు, పెద్దహోటలు భాగస్వామి కాగల డబ్బు ఎలా సేకరించాడు? అతను పెద్ద ధనవంతుడని తెలిగానే, 'నళిని' తనదృష్టి అంతా అతనిమీదే కేంద్రీకరించటంలో ఆడపిల్లలకి డబ్బుమీద, ధనవంతుల్ని చేబట్టాలనే కాంక్షమీద అమితాసక్తి చూపుతారని తెలిసిపోతోంది. కామేశ్వరిమీద ఇతనికి బాగా మోజు వున్నట్లువుంది. స్వయంగా, పళ్లు, అవి తెచ్చాడు.' అనుకున్నాడు మాధవ.

ఇంతలో 'ట్రే'లో నాలుగు కప్పులూ, సాసర్లూ పెట్టుకుని వచ్చింది కామేశ్వరి.

అదేసమయానికి వాకిట్లో 'కారు పార్కు' చేయబడిన ధ్వని వినిపించింది. కేశవ కూడా కారుదిగి లోనికి వచ్చాడు! కామేశ్వరి, కాఫీ కప్పులున్న ట్రే 'టీపాయ్' మీద పెట్టి

'కాఫీలు తీసుకోండి!' అంది

కేశవ తనుకూడా, ఒక కుర్చీలో కూర్చుంటూ,

'ఇక్కడ నాలుగే కాఫీలున్నాయ్!' అన్నాడు ట్రేలోని కాఫీకప్పుల వంక చూస్తూనూ,

'మీకూ తెస్తాను!' అంటూ లోనికి వెళ్లింది కామేశ్వరి.

కామేశ్వరి వెనుతిరిగి పోబోతుండగా ఆమె పాదాలమీద జీరాడుతున్న చీర కుచ్చెళ్లు తొలగి ఆమె పాదాల వ్రేళ్లకున్న మట్టెలు కన్పించాయి మాధవకి!

'అయితే కామేశ్వరికి పెళ్లి అయి పోయిందన్నమాట!' అప్రయత్నంగా పైకి అనేశాడు మాధవ! రామనాథం, కేశవ, మాధవ వెంపు తెల్లబోయి చూసారు! గవ్రరాజూ, నళినీ పకపకా నవ్వేరు! కామేశ్వరికీ నవ్వాలేం వినిపించలేదు. ఆ మాటన్న తను భర్తకి కాఫీ తేవటానికి లోనికి వెళ్లింది.

మాధవకి వాళ్ళ నవ్వుతోంటే కోపం వచ్చింది.

'నువ్వు చెప్పావు కాదేం నళినీ? కామేశ్వరికి పెళ్ళి అయిపోయిందని?' అన్నాడు మాధవ.

'ఈ వూరేనా ఆమె అత్తవారిల్లు?' అమాయకంగా అడిగాడు రామనాథం.

అతని కాతరస్వరంలోని ఆతృతని పసిగట్టేడు కేశవ. 'నళిని' తండ్రి ఎదుట ఏమీ అనలేక వూరుకొంది. గవర్రాజు,

'ఏం బాబూ అంత ఆశ్చర్యంగా అడుగుతున్నారు? మీకు నచ్చకపోయినంత మాత్రాన్న ఆమెకి పెళ్ళే కాదనుకున్నారేమిటి? ఇదిగో! ఈయనే పెళ్ళి చేసుకున్నారు!' అన్నాడు.

ఆకాశం విరిగినట్లు అన్పించింది మాధవకి! పిడుగు మీద పడినట్లు భారంగా ముడుచుకు పోయేడు రామనాథం!

'కేశవగారు మళ్ళీ పెళ్ళాడుతారని కాని, ఆ పెళ్ళి చేసుకోవటంలో ఇరవయి ఏళ్ళ ప్రాయపు కన్యనివే కోరుకుంటారని కాని వూహించలేకపోయేడు మాధవ! నళినితో కామేశ్వరి కాలేజీకి ఎందుకు వస్తోందో బోధ పడింది మాధవకి! కేశవ సిగ్గులేని చేయరాని మహాపరాధం చేసినట్లు ముడుచుకు పోయేడు!

'ఇన్నాళ్ళనుండి చెప్పావు కాదే, నళినీ?' దీనంగా అన్నాడు మాధవ!

'నళిని'ని ప్రాణానికి ప్రాణంగా ప్రేమించాడు! స్వర్గసుఖాలను కలుపుకున్నట్లు మిద్దెలు, కలహాల్యలకు తావుండదనుకున్నాడు! అందుకనే, కామేశ్వరికి ఇంకా పెళ్ళి కాక, పిల్ల ఆశ్రయంతో చదువుకుంటుందనే వూహతో కామేశ్వరిని తన అన్న ప్రేమించినట్లు చెప్పాడు! అప్పుడన్నా, 'కామేశ్వరికి పెళ్ళి అయ్యింది! మా నాన్న పెళ్ళిచేసుకున్నాడు!' అని చెప్పలేదు నళిని. ఏం చేత? ఇందులో దాచాల్సినంత అవసరం ఏముంది? ఛీ! ఈ ఆడవాళ్ళు ఎందుకని అబద్ధాలు ఆడుతారో. వాళ్ళని సృష్టించిన బ్రహ్మకి కూడా తెలీదేమో! నళిని ఇంత నీచ బుద్ధి?' అనుకున్నాడు మాధవ.

కామేశ్వరి కాఫీ కప్పుతో హాలులోనికి వచ్చి, కేశవకి ఇచ్చింది. అక్కడ వున్న వాళ్ళందరూ, నిశ్శబ్దంగా కాఫీలు పుచ్చు





కున్నారు.

'అన్నగారూ!' అన్నాడు గవర్రాజు.

కేశవ అతని సంబోధనకి ఆశ్చర్యంతో ముఖం పైకెత్తి చూసాడు.

'కామేశ్వరమ్మని, వాళ్ల అమ్మగారు నాల్గురోజులుండి వెళ్ళటానికి పంపమన్నారు. మీరు పంపితే వాళ్ళు ఎంతో సంతోషిస్తారు. మీకు వీలుంటే మిమ్మల్ని కూడా రమ్మన్నారు!' అన్నాడు గవర్రాజు.

'నీతోనా పంపమంట!' అన్నాడు కేశవ.

'మీకు ఇష్టమెల్లా అయితే అల్లానే!' అన్నాడు గవర్రాజు.

'వేసంగి సెలవుల్లో వస్తుంది. అని చెప్పు!' అన్నాడు కేశవ.

'సర్లెండి! మరయితే నేను వెళ్లి వస్తాను! కామేశ్వరమ్మా! అత్తగారితో కూడా చెప్పు!' అంటూ లేచాడు గవర్రాజు.

'అదేమిటి? భోజనం చేయకుండానే వెళ్తావా!' అన్నాడు కేశవ.

'లేదు! మా ఇంటికి వెళ్తాను' అని వెళ్లాడు గవర్రాజు.

అతనికి ఆ పూట్లో అన్నగార్నున్న సంగతీ, 'వినోదా'లో షేర్లున్న సంగతీ చెప్పింది నళిని కేశవతో!

రామనాథం మాధవ కూడా వెళ్లివస్తామంటూ లేచారు.

'అదేం! అప్పుడే లేచారేం! మీ అన్నగారు బాగా షాక్ అయినట్లున్నారు!' అంది నళిని.

'ఏమయింది?' అన్నాడు కేశవ.

'కామేశ్వరిని ఈయన కిద్దామనుకున్నారుట! మొదట' అంది నళిని.

'అల్లాగా!' అన్నాడు కేశవ.

'మరి పెళ్లి ఎందుకు జరగలేదు?' అని అడుగుతాడు తండ్రి అనుకొంది నళిని. కాని కేశవ అడగలేదు. రామనాథం కామేశ్వరిని ఎందుకు చేసుకోలేదో కేశవ వూహించలేనంత అమాయకుడు కాడు!

'కామేశ్వరిని చూపులప్పుడు చూసేక ఇంకేపిల్లని చూసినా రామనాథానికి నచ్చటం లేదట! అందుచేత పెళ్లికి వాయిదా వేస్తున్నాడట!' అంది నళిని.

అప్పుడన్నా తండ్రిలో ఏదన్న మార్పు కలుగుతుందేమో అనుకొంది నళిని.

'అహా అల్లాగా!' అని వూరుకున్నాడు! నళినికి ఇంక కామేశ్వరిని గూర్చి చెప్పే వోపిక లేకపోయింది.

'మీకు కారు కావాలా నాన్నా!' అంది.

'అఖ్ఖర్లేదు! నీకు అవసరం వుంటే తీసుకవెళ్ళు!' అని మేడమీదకు వెళ్లిపోయాడు కేశవ.

నళినికి ఏమీతోచలేదు. కారు తీసుకుని నెమ్మదిగా, బీచ్‌వేంపు వెళ్లింది. సాగర తీరం. చల్లగా హాయిగా వుంది. అక్కడక్కడా చెదురుమదురుగా జనం వున్నారు. ఉధృతమైన కెరటాల అలలు నురుగులతో పరవళ్లు త్రొక్కుతూ, తీరపు ఇసుకని తమలోనికి విలీనం చేసుకుంటున్నాయి. నళిని కాస్సేపు సముద్రపు ఒడ్డుమ్మట ఇటూ అటూ నడిచింది. చాలాదూరంలో నల్లని డెకరాన్‌పాంటుతో తెల్లని ఇన్‌షర్టుతో, మాధవలా ఒకవ్యక్తి కన్పించాడు. మాధవే అయివుంటాడు, అనుకొంది. మాధవ వస్తుతః భావుకుడు. ఈ రోజు కామేశ్వరికి పెళ్లి అయిపోయిందన్న విషయం అతనికి మొదటిసారిగా, తెలిసింది! తన అన్న, ఆమెని అమితంగా ప్రేమించాడనీ, అందుకనే, తన అన్నకి ఇతరత్రా పెళ్లిచూపులు ఫలించటం లేదనీ, అతనివూహా! ఆ వూహ ఆధారంగా అతను ఎన్నెన్నో గాలిమేడలు కట్టాడు! పునాదిలేని ఆ మేడ, ఈ రోజు కూలిపోయింది! మాధవ వద్దకు చరచరా నడిచింది నళిని. మాధవ కెరటాలలోనికి దీర్ఘంగా చూస్తూ కూర్చున్నాడు. నళిని రాకని అతను గమనించలేదు! నళిని చనువుగా అతని భుజాలమీద చేతులు వుంచి కుదుపుతో.

'ఏమిటో అంత దీర్ఘాలోచన!' అంది. ఉలిక్కిపడ్డాడు మాధవ!

'నువ్వా!' అన్నాడు.

'వూ! నేను కాక ఇంకెవరయినా నీతో ఇంత చనువుగా వుంటారా మాధవ్!' కులుకుతూ అంది నళిని. అల్లా అంటూనే అతని ప్రక్కనే రాసుకుంటూ కూర్చుంది!

'నళినీ! వక్కమాట అడుగుతాను. చెప్తావా?' అన్నాడు మాధవ. అతని

స్వరంలోని శాంత్యానికి నళిని విస్తు పోయింది. మునుపు మాధవ నళినితో మాట్లాడే స్వరం, ఆపేక్షతో కూడుకొని వుండేది!

'అడుగు మాధవ్! నా దగ్గర మొహమాటం ఎందుకు?' అంది నళిని.

'నీవు నన్ను మనఃస్ఫూర్తిగా ప్రేమించావా నళినీ!' అన్నాడు. అతని కంఠం ఎందుకనో బిగుసుక పోయింది.

'మాధవ్! నీకా సందేహం ఎందుకని కలిగింది?' కాతరస్వరంతో అడిగింది నళిని.


'ప్రేమికుల మధ్య, రహస్యాలుండవ్ నళినీ! నీవు నన్నింత వంచించగలవని అనుకోలేదు. నేనెంత బుద్ధిహీనుణ్ణి నళినీ! నీవు, నా జీవన సర్వస్వానివి అనుకున్నాను. అందు కనే కామేశ్వరి మీ ఆశ్రయంలో వుండి చదువుకొంటూందనే ఉద్దేశ్యంతో, కామేశ్వరిని మా అన్నయ్యకిద్దామనుకున్నాననే విషయం చెప్పాను. అప్పుడన్నా, కామేశ్వరి, నీకు 'పిన్ని' అవుతుందని చెప్పావ్ కాదు! ఎంత తప్పుగా మాట్లాడాను? మా అన్నయ్య ఆమెని ప్రేమించాడని నీతో చెప్పాను! అప్పుడన్నా చెప్పలేదు నీవు! ఎంత గుట్టు కల దానివి! కాలేజీలో పక్క పొరన్నా నీవు ఆమెని 'పిన్ని' అని పిలిచే దానివి కాదు! మీ ఇద్దరి మధ్యా నున్న సంబంధాన్ని కాలేజీలో ఎవరికీ తెలీకుండా వ్యవహరించే దానివి! ఇప్పుడు మా అన్నయ్య ఎంతగా కుమిలి పోతున్నాడో నీకు ఎల్లా తెలుస్తుంది! వివాహితురాలయిన యువతిని పట్టుకుని ప్రేమించానంటూ అవమానించుతే ఎంత నీచ కృత్యం! తప్పుకాదనా నళినీ! నీకెందుకు ఆ కామేశ్వరి మీద, ఇంత ఘృణ పెరిగింది? ఆ అమాయకురాలు నీకేమపకారం చేసింది' అగాడు మాధవ.

'నేను చెప్పేది కాస్త వింటావా, మాధవ్!' అంది నళిని.

'ఏం వినాలి నళినీ? ఇంత ఘాతుకం చేసాక? ఎన్నెన్ని వాగాను నీతో! మా అన్నయ్యతో కామేశ్వరికి మాట్లాడటానికి అవకాశం కల్పించమన్నాను! నీవు నట్టి రాయివి నళినీ. పాలరాతి శిల్పానివి! నీలో స్పందన లేదు! ఈ మాటలు అన్నీ మీ నాన్నదాకా వెళ్ళితే ఎంత అవమానకరంగా వుంటుంది మాకు?' అన్నాడు.

'మా నాన్నదాకా ఎందుకు వెళతాయి మాధవ్! ఆ మాత్రం నాకు తెలీదా! ఇంక కాలేజీలో మా నడుమ నున్న సంబంధం తెలియనియ్యలేదని అన్నావ్! ఎల్లా తెలియనియ్యాలి మాధవ్! మా నదినగానో అక్కగానో పరిచయం చెయ్యాల్సిన పరిస్థితిలో నున్న కామేశ్వరిని, మా సవతి తల్లిగా ఎల్లా పరిచయం చేస్తాను? నాకు ఎంత సిగ్గుగా వుంటుందో నీకేం తెలుసు? పవిత్రమైన మాతృ స్థానంలో నిలవాల్సిన వ్యక్తి ఈ చిన్న అమ్మాయిది వుంటుందా! 'అమ్మ' అనే పిలుపు ఎంత మధురమయినది మాధవ్! మా నాన్న ఎంత తప్పు చేసారు! ఈ వయసులో ఆయనకు పెళ్ళేమిటి! అంతగా పెళ్ళి చేసుకోవాలన్న వాంఛ ఆయనకు వుంటే, ఏ బాల్య వితంతువునో చేసుకోవాలి కాని, నాతో సమానమైన వయసున్న పిల్లని, నా మాతృస్థానంలో నిలబెడతారా! ఎల్లా ఆమెని, సంబోధించేది! నాకు 'అమ్మ' అనే మూర్తి కన్నులకు కట్టుతూ వుంటుంది! పచ్చని శరీరం! అక్కడక్కడ నెరసిన తల వెంట్రుకలతో పెద్దదిగ జుట్టుకున్న తలతో, నుదుట మెరసే నయా పైసంత కుంకుముతో నా కళ్ళెదుట, నా మాతృ మూర్తి ప్రత్యక్షమౌతూ వుంటుంది! బిగిసిన యవ్వనంతో, వయ్యారపు నడకలతో, కోరికల తృష్ణతో, తళతళ్ళాడే కళ్ళతో నిడుపాటి వాల్జడతో, నాతో సమానంగా కాలేజీలో జేరి చదువుకుంటానంటూ తయారయిన ఈ పిల్ల నాకు మాతృ మూర్తి అవుతుందా మాధవ్! నువ్వే చెప్పు!' నళిని ఆగింది.

'పోనీ! కాలేజీ విద్యార్థులందరి ఎదుటా




మీ సంబంధాన్ని తెలియకపోతే ఫరవా ఏమీ లేదు! నా వద్దకూడా ఎందుకు దాచాలి విషయాన్ని! నిజమైన జీవిత భాగస్వాముల మధ్య రహస్యం వుంటుందా నళినీ! దీనివల్ల నాకెంత అవమానంగా వుందో తెలుసా' అన్నాడు మాధవ్!

'నా నోటితో నేను నాకు అవమానం కలిగించే విషయాన్ని ఎల్లా చెప్పను మాధవ్! నాకు మా మధ్యనున్న సంబంధాన్ని నా నోటితో ఉచ్చరించటానికే అసహ్యం!' అంది నళిని.

'ఇక్కడ కూర్చున్నారా ఇంటి సన్నాయి!' అంటూ, రామనాథం గారి పనుపించారు. మాధవ్ ఏమీ అనలేదు. నళిని వైపులా పంజ చీకట్లు, అలముకుంటున్నాయి.

'నన్ను క్షమించండి రామనాథంగారూ! కామేశ్వరిని, మా నాన్న మొన్న వేసంగిలో పెళ్ళి చేసుకున్నారు! ఆ మాట అంతో చెప్పలేదని, మీ తమ్ముడు బాధపడుతున్నారు. నాకు ఇంత వయసులో మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నారనే సంగతి గురించి చెప్పటం సిగ్గు కలిగించుతుంది. అందుకని, నాకు నేను ఈ విషయాన్ని ఎవరితోనూ చెప్పుకోలేదు!' అంది నళిని.

'దానిదేముంది నళినీ! ఎవరి అభిప్రాయాలు వారివి! దానితో మనకు పోయిందేముంది?' అన్నాడు పెద్దమనిషిలా.

'ఇంకో విషయం రామనాథంగారూ! మీరు కామేశ్వరిని ప్రేమించారని మాధవ్ చెప్పాడు, కామేశ్వరి చిన్నపిల్ల! ఆమె ఏ పరిస్థితిలో మా నాన్నని పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకుందో నాకు తెలీదు! మీరు ప్రేమించుతున్నట్లు ఆమెకి తెలుసునో లేదో నాకు తెలీదు! మీరిద్దరూ కలుసుకుని మాట్లాడే అవకాశం వుంటే, ఆమె అభిప్రాయం ఎల్లా మారుతుందో మరి! మీరు ఆమెని స్వీకరించే పక్షంలో, ఆమె ఈ వివాహాన్ని గద్దు చేసుకో దలుచుకుందేమో ఎవరికి తెలుస్తుంది! మీ ఇద్దరి మధ్యా మాట్లాడుకునే అవకాశాలు విరివిగా లభింప చేద్దామనే ఉద్దేశ్యం కూడా నాకు వుండేది! ఆమె వివాహిత అని తెలిస్తే మీరు ప్రేమించరేమో అనే అనుమానం నాకు వుండేది. జీవితాంతం, తన్ని ఏ విధంగానూ రంజింప చేయలేని భర్తకి భార్యగా వుండి, ఆమె యవ్వ

# మూడుముళ్ళా

కాన్ని అడివి గాచిన వెన్నెల చేయకుంటా నికి మాత్రం అధికారం వుంది? అది ఆమె వ్యక్తిగత సమస్య ఆ సమస్యని ఆమె ఎలా పరిష్కరించుకుంటుందో, అని నాకు ఆలోచన కలిగేది! మాధవ్, మీరు ఆమెని ప్రేమించారని చెప్పగానే సముద్రంలో మునిగిపోతున్న వాడికి తెప్పలు కన్పించినట్లు సంతోషపడ్డాను. నేనెందుకు కామేశ్వరి పెళ్లి విషయం గుప్తంగా వుంచానో తెలీక, మాధవ్, నా మీద దురభిప్రాయ పడుతున్నాడు చూడండి!' అంది నళిని.

'ఛీ ఛీ!' రామనాథం భయ కంపితుడైనాడు. 'నేను కామేశ్వరిని ప్రేమించానా! ఏరా మాధవ్! ఎల్లా అన్నావు ఆ మాట!' అన్నాడు రామనాథం.

'అవును అన్నయ్యా! కామేశ్వరిని చూసి వచ్చినది మొదలు, నీకు ఇంకే పెళ్లి కూతుళ్లూ నచ్చటం లేదు! ఎంత మంచి సంబంధం వచ్చినా ఏదో వంక పెట్టి పెళ్లి ఎగ్గొంటున్నావు! ఇక్కడ, నళినితో కామేశ్వరి కాలేజీకి వచ్చేది. సహజంగా చదువుకునే అమ్మాయిలే పెళ్లిళ్లు కాగానే చదువులు మానేస్తారుకదా! అల్లాంటిది కామేశ్వరి పెళ్లి అయ్యాక చదువుకోటం మొదలు పెట్టిందని నేనెల్లా వూహించు తాను? ఎల్లాగూ పెళ్లికాక చదువుకొంటూంది కదా! నీ మనసుకు నచ్చినపిల్ల! కాస్త మీ ఇద్దరి మధ్య మాట కలుస్తే, మీ ఇద్దరి అభిప్రాయాలు ఒకటయి ఒక ఇంటివారు అవుతారని ఆశపడ్డాను. తప్పేముంది నాది? అన్నయ్యా!' అన్నాడు మాధవ.

రామనాథం గాఢంగా నిట్టూర్చాడు!

'నీ భావుకత్వం ఇంతవరకూ వచ్చిందన్న మాట! మాధవ్! ఎంతమాటన్నావ్! నేను ఎప్పుడన్నా నీతో కామేశ్వరి తప్ప ఇంకే పిల్లా నాకు నచ్చదని చెప్పానా? నీ వూహాగానంతో పాపం, ఆ అమాయికురాలికి ఒక మచ్చ తెచ్చి పెట్టావు. నాకూ, నాన్నగారికీ ఏ పిల్ల నచ్చి వారి కట్నకానుకలు నచ్చి, సంప్రదాయం నచ్చితే ఆ క్షణమే నేను పెళ్లి చేసుకుంటాను! అంతేకాని ఈ కామేశ్వరి కోసం నేను బెంగ పెట్టుకున్నానా? సినిమాల్లోలాగా, మీరు వ్రాసే ప్రేమకథల్లో లాగా. నేను కామేశ్వరి కోసం జీవితాంతం మజ్నూనైపోయి బ్రహ్మచారిలా వుండిపోదామనుకున్నానా? ఒకచోట పిల్ల నచ్చుతుంది. కట్నం నచ్చదు! పిల్ల నచ్చిందని చెప్తాం! కట్నం నచ్చక పోతే పిల్లనూ వదులుకుంటాం! నాలుగు సంబంధాలు చూసుకునే వాళ్లం! మనకు ఈ ప్రేమలూ, గీమలూ ఏమిటి సాధారణ సంసార్లకి!' అన్నాడు రామనాథం.

'ప్రేమించే వాళ్లు సంసార్లు కారా! ప్రేమ అనేది సంసార లక్షణం కాదంటారేమిటి మీరు?' అంది నళిని. రామనాథం కామేశ్వరిని ప్రేమించలేదని తెలియగానే ఎందుకనో, నళిని హృదయం తేలికపడింది! ఇప్పుడామె మనస్సు ఉల్లాసంగా వుంది!

'ఛ ఛ! అది నా ఉద్దేశం కాదు! అదంతా ఒక తరహాకి చెందినది! కాస్త బాధ్యతలు తెలిసిన వివేకవంతులయిన వాళ్లు ఈ ప్రేమలు అంటూ వెర్రెత్తిపోరు! సంసార్లలో మటుకు ఆత్మీయత వుండదా! అదొక పవిత్రమైన బాధ్యతగా కుటుంబీకులు ఒండొరుల నట్ల ఆత్మీయతను పెంచుకుంటారు! ప్రేమ అనేది, ఒక వింత ఆకర్షణశక్తి కలది! ఆకర్షణ వేరు; ఆత్మీయత వేరు కదా!' అన్నాడు రామనాథం.

చంద్రుడు నవ్వుమొఖంతో, సాగరతరంగాల పరుగులను చూస్తూ ఆకాశం మీదకి నడుస్తున్నాడు!

'రాత్రవుతోంది! ఇంక వెళ్దామా నళినీ!' అన్నాడు మాధవ లేస్తూ...

'నా మీద కోపం పోయింది కదా!' నవ్వుతూ అంది నళిని.

'ఆc! నవ్వే చంద్రుడూ ఆ తారకలూ, ఈ సముద్రుడూ, సాక్షి వుంటారు!' అన్నాడు మాధవ్.


'ఆ సాక్ష్యాలు కావ్యనాయికలకి! నాకు పనికిరావు!'—అంది నళిని.


'అయితే ఎల్లా!' వెర్రి ముఖం చేసాడు మాధవ్.!

'మీ అన్న సాక్షిగా, నా మీద మీరు ఏమీ కోపం పెట్టుకోలేదని చెప్పండి!' అంది నళిని.

'మధ్యన నేను దొరికానా! మీ వధనా లక్షి!' అన్నాడు రామనాథం. మాధవ నవ్వాడు! ఉత్తేజకరమైన వాతావరణం ఉల్లాస భరితమైంది!

(ఇంకా వుంది)




లండను, న్యూ యార్కులకు బోయింగు
మీరు మద్రాసు నుంచి మా బోయింగు జెట్ విమానములలో వారానికి మూడు సార్లు అన్నగా లండను న్యూ యార్కులకు అత్యంత సౌఖ్యంగా వెళ్లవచ్చును.
వారములో మొత్తము మీద 12 సార్లు మన దేశము నుండి పై నగరాలకు మా విమానములు బయల్దేరతాయి. అప్పటికి వెళ్లుటకు మధ్య ఆసియా యూరోపుల మీదుగా నైనా, లేక మాస్కో మీదుగా నైనా మీరు ప్రయాణము చేయవచ్చును.
ఎయిర్-ఇండియా
సహకారులు : బి.ఓ.ఎ.సి. మరియు క్వాంటాస్
AI 6230

# ఏరు దాటాక

కైరము



సావిత్రికి పత్రికలు చదివి చదివి విసుగెత్తింది. రాత్రి తొమ్మిది గంటలైనా శర్మ రాలేదు. ఒక్కసారి మేడమీదికి వెళ్లి గాలి పీల్చుకుందామని మెట్లవేపు దారితీసింది.

మేడమెట్ల పక్కన వరండాలో వంటాయన శాస్త్రి తల మోకాళ్లమీద పెట్టుకుని కూర్చున్నాడు.

'శాస్త్రిగారూ! మీరు భోజనం చేసెయ్యండి. డాక్టరుగారు యివాళ ఆలస్యంగా యింటికి వస్తారు. మా యిద్దరికీ వంటింట్లో టేబిల్ మీద అన్నీ పెట్టేసి, మీరు భోజనంచేసి వెళ్లి పడుకోండి.'

సావిత్రి మాటలు విని తలపైకెత్తి చూసి, శాస్త్రి తిరిగి తల వంచుకున్నాడు.

'నాకేం తొందరమ్మా! బాబుగార్ని తింటాను' శాస్త్రి మొఖంలో వున్న దిగులు చూసింది సావిత్రి.

'దేనికి శాస్త్రిగారూ బాధపడుతున్నారు?'

దేనికేమిటమ్మా! డబ్బులేనివాళ్లకి, నాలాంటి పేదవాళ్లకి అన్నికష్టాలే, అన్నీ బాధలే మా అబ్బాయి యీ యేడు ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్ష యిచ్చాడు. మంచి మార్కులతో పాసయ్యాడు. ఇప్పుడు కాలేజీలో చదువుతానంటాడు. వాడిని పైచదువులు చదివించే స్తోమత నాకెక్కడమ్మా? వాడు స్కాలర్‌షిప్‌మీద చదువుకుంటాడట. నా కవి ఏం తెలుస్తాయమ్మా? ఎవరో బాబుగారిలాంటి వాళ్లు చూడాలి కాని!'

శాస్త్రి గొంతులో బాధచూసి సావిత్రి జాలి పడింది.

'ఏడీ మీ అబ్బాయి నెల్లూరినించి ఎప్పుడు వచ్చాడు? నాకు చూపలేదేం? ఈ మారు నాకు చూపించండి మంచి మార్కులు వస్తే, కాలేజీలో స్కాలర్‌షిప్ కోసం ప్రయత్నిద్దాం' అంటూ సావిత్రి మేడమీదకి నడిచింది.

సావిత్రి, భర్తా యిద్దరూ ఉద్యోగస్థులే సావిత్రి విశాఖపట్నం స్త్రీల కళాశాలలో లెక్చరర్‌గావుంది. ఆమె భర్త శర్మ డాక్టరు. కె. జి. హెచ్. లో పని చేస్తున్నాడు. వాళ్లు ద్వారకానగరంలో కట్టిన క్రొత్తయిళ్లలో ఒకటి అద్దెకి తీసుకున్నారు. ఇద్దరూ ఉద్యోగస్థులే అవడంవల్ల యింట్లో వంటకి ఒకమనిషి కావాలి. సావిత్రికి పెళ్లైన మూడు సంవత్సరాలలో ఎంతోమంది వంటవాళ్లని పెట్టుకుంది. ఒక్కరూ ఆరునెలలూ, మూడునెలలూ కంటె పైన వుండేవారు కాదు. పైగా యింట్లో దుబారా ఎక్కువగా అయ్యేది. రకరకాల వంట మనుషులతో విసిగి పోయిన సావిత్రికి శాస్త్రి రాక కొంచెం తెరపినిచ్చింది. శాస్త్రి వారింటికి రావటం కూడా తమాషాగా జరిగింది. సావిత్రి, శర్మా వేసంగిలో మద్రాసునించి వస్తున్నప్పుడు శాస్త్రి రైల్లో కనిపాడు. తను బతికి చెడ్డ

వాడినని, ఏవరేనా గౌరవనీయులైన కుటుంబీకుల యిళ్ళల్లో వంటచేసుకు బ్రతకాలని వుందనీ శాస్త్రి అన్నాడు. సావిత్రీ, శర్మా వెంటనే తమయింటికి రమ్మని పిలిచారు.

శాస్త్రి చక్కగా వంట చేస్తాడు. నమ్మకస్తుడు. ముఖ్యంగా చాలా పొదుపరి. ఈ కారణాలవల్ల ఒక్క నెలరోజులలోనే భార్యాభర్తలిద్దరి అభిమానాన్ని చూర గొన్నాడు.

మర్నాడు ప్రొద్దున్న తొమ్మిది గంట లకి సావిత్రి, శర్మా ఫలహారం చేస్తున్నప్పుడు శాస్త్రి వచ్చి సావిత్రితో మెల్లిగ తన కొడుకు వచ్చినట్టు చెప్పాడు.

సావిత్రి వెనక్కి తిరిగి చూసింది. తెల్లగా, సన్నగా తలుపుని ఆనుకుని నుంచున్నాడు ఒకబ్బాయి. అతని పెద్ద కళ్ళల్లో అమాయకత్వం తొణికిసలాడుతోంది. చక్కటి కనుముక్కు తీరుతో ముచ్చటగా వున్నాడు.

'ఇలారా! నీ పేరేమిటి?'

'శ్యామాశాస్త్రి' అంటూ అతను సావిత్రి దగ్గరకి వచ్చాడు. నిక్కరు వేసుకున్న శ్యామాశాస్త్రి తన వయస్సు కంటె చాలా చిన్నవాడుగా వున్నాడు. 'ఏదీ నీ మార్కులు చూస్తాను, ఎస్. ఎస్. ఎల్. సి రిజిస్టరు చూపు.'

శ్యామాశాస్త్రి యిచ్చిన పుస్తకం విప్పి మార్కులు చూసిన సావిత్రి ముఖం వికసించింది.

'ఎంతమంచి మార్కులు వచ్చాయో చూడండి' అంటూ భర్తముందరకి తోసింది పుస్తకాన్ని. అన్ని సబ్జక్టులలో అరవైపైన వచ్చాయి. లెక్కలలో నూటికి నూరు వచ్చాయి. శర్మకూడా మెచ్చుకున్నాడు.

'పాటలేమైనా పాడగలవా?' నవ్వుతూ అడిగాడు శర్మ.

'ఊహూ' అన్నాడు సిగ్గుపడుతూ శ్యామాశాస్త్రి.

'శ్యామాశాస్త్రికి స్కాలర్‌షిప్పు కోసం ప్రయత్నించండి. కాలేజీలో చేరతాడు. లెక్కలు మెయిన్ తీసుకు చదువుతాడు' అంటున్న సావిత్రి మాటలకి అడ్డంగా 'లేదక్కా నేను బయాలజీ తీసుకుంటా' అన్నాడు శ్యామాశాస్త్రి.

'అక్కా' అన్న పిలుపు విని సావిత్రి ఒక్కసారి ఆశ్చర్యంగా చూసింది. శ్యామాశాస్త్రి అమాయకంగా చూస్తున్నాడు. వెంటనే మనస్సులో ఎందుకో శ్యామాశాస్త్రి అంటే యిష్టం కలిగింది.

'నేను యీ విషయం చూస్తాలే' అన్నాడు శర్మ ఫలహారం ముగించి, లేస్తూ.

శ్యామాశాస్త్రికి స్కాలర్‌షిప్పువచ్చింది. పి. యు. సి. లో చేరాడు. స్కాలర్‌షిప్పు డబ్బుతో హాస్టల్‌లో వుండేవాడు. శాస్త్రి తనకి యిచ్చేనెల జీతం కొడుక్కి యిచ్చేసేవాడు శ్యామాశాస్త్రి పి. యు. సి. కూడా ఫస్టుక్లాసులో మంచి మార్కులతో పాస్ అయ్యాడు;

'శ్యామాశాస్త్రి మెడికల్ కాలేజీలో చేరాలనుకుంటున్నాడుట. మిమ్మల్ని సహాయం చెయ్యమని శాస్త్రిగారు అడుగుతున్నారు' అంటూ ఒకరాత్రి శర్మతో, సావిత్రి చెప్పింది.

'మెడిసిన్ చదవటం అంత సులువు కాదు. బోల్డడబ్బు ఖర్చు అవుతుంది' శర్మ ఆలోచిస్తూ అన్నాడు.

'అతనికి స్కాలర్‌షిప్పు వస్తుందిగా?'

'ఆ డబ్బు సరిపోదు సావిత్రీ. ఎన్నో కొనవలసి వుంటుంది, పైగా ఆరేళ్ల చదువు'

'తెలివైనవాడు, పైకి రావలసినవాడు అతను. మనం సహాయం చేద్దాం. ఇలాంటి తెలివైన వాళ్ళు పైకి రాకపోతే దేశానికే నష్టం' సావిత్రి క్లాసులో పాఠం చెప్తున్నట్టు చెప్పింది. శర్మ నవ్వాడు. సావిత్రికి శ్యామాశాస్త్రి అంటే అభిమానం అని తెలుసు.

'సరేనండి టీచరుగారూ, తమరు ఆజ్ఞాపించి నట్టేచేస్తాం.' శర్మ హాస్యం చేశాడు. సావిత్రి చిరుకోపంతో తను చదువుతున్న పేపరు అతని మీదికి విసిరేసి లోలోపల నవ్వుకుంటూ ప్రక్కకి తిరిగి పడుకుంది.

'అక్కా. నేనివ్వాళ మెడికల్ కాలేజీలో చేరాను' అంటూ యింత ముఖం చేసుకుని సంతోషంగా వచ్చి చెప్పాడు శ్యామాశాస్త్రి.

'అంతా అమ్మగారి చలవ. బాబుగారి చలవ' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు శాస్త్రి సంతోషంగా.

తండ్రీ కొడుకు లిద్దరి సంతోషాన్ని చూసి ఆనందించింది సావిత్రి.

'బాగా చదువుకుని, మంచిపేరు తెచ్చుకో'

'తప్పకుండా అక్కా, డాక్టరుగారికి నా థాంక్స్ అందచెయ్యండి.'

శ్యామాశాస్త్రి కాలేజీలో చేరిన దగ్గిర నించీ శాస్త్రిలో చాలామార్పు వచ్చింది. ఇంట్లో అన్నీ వేళకి అమర్చి పెట్టడమే కాకుండా, సావిత్రిని అభిమానంగా చూసేవాడు. సావిత్రి కూడా శాస్త్రిని కనిపెట్టి చూసేది. పండగలు వస్తే, పిండివంటలు తీసుకువెళ్లి హాస్టల్‌లో వున్న కొడుక్కి యిచ్చి రమ్మనేది పుస్తకాలు కొనుక్కొడానికి శ్యామా శాస్త్రికి డబ్బు యిచ్చేది.

* * *

సావిత్రి ఒకనాడు సాయంత్రం యింటికి వచ్చే సరికి తలుపు తాళంవేసి వుంది. ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళని శాస్త్రి ఎక్కడికి వెళ్ళాడా అని ఆశ్చర్యపోతూ ప్రక్కవాళ్ళ దగ్గిర తాళం తీసుకు యింట్లోకి వెళ్లింది. శాస్త్రి బజారుకి వెళ్ళినా సాయంత్రం నాలుగింటి కల్లా యింటికి వచ్చేస్తాడు.

రాత్రి దీపాలు పెట్టాక, వగర్చుకుంటూ, దిగాలు ముఖంతో వచ్చాడు శాస్త్రి.

'ఎక్కడికి వెళ్లారండీ?' సావిత్రి గుమ్మంలోనే అడిగింది.

'ఏం చెప్పనమ్మా! మా శ్యాముడికి జ్వరం, వళ్ళు పేలిపోతోంది. పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. వాడి స్నేహితుడు వచ్చి చెబితే హాస్టల్‌కి వెళ్లాను' అన్నాడు శాస్త్రి కళ్లనీళ్లతో.

సావిత్రి భయపడింది. 'ఎప్పటి నించి జ్వరం?!'

'మూడురోజుల నించీ టమ్మా! ఇవాళ ఎక్కువగా వుంటే నాకు కబురు చెప్పారు! బాబుగారు వచ్చి ఒక్కసారి చూస్తే బాగుండును' శాస్త్రి చిన్న పిల్లవాడిలా ఏడుస్తూ నుంచున్నాడు.

సావిత్రి కంగారుగా శర్మ రాక కోసం ఎదురు చూసింది. శాస్త్రి కొడుకుమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.

# ఏరుం దాటారు

శర్మ రాత్రి ఎనిమిది గంటలకి వచ్చాడు రాగానే సావిత్రి, శ్యామాశాస్త్రి జ్వరం గురించి చెప్పి, వెంటనే అతనిని చూడటానికి వెళ్ళమని తొందర చేసింది. శర్మ, శాస్త్రిని వెంట బెట్టుకు తన స్కూటర్‌మీద హాస్టల్‌కి వెళ్ళాడు.

రాత్రి పదకొండు గంటలదాకా శర్మ కాని, శాస్త్రికాని యింటికి రాలేదు. సావిత్రి ఆదుర్దాగా ఎదురు చూస్తూ కూచుంది. ఈ నాలుగేళ్ళల్లోగా శ్యామా శాస్త్రి అంటె యిష్టం ఏర్పడింది. అతను 'అక్కా' అని పిలుస్తూ వుంటే, తనకి తమ్ముళ్ళు లేరనే కొరత తీరినట్టు అనిపించేది. శ్యామాశాస్త్రి ఆరోగ్యం కోసం, క్షేమంకోసం సావిత్రి దేముడిని ప్రార్థించింది. వంటింట్లోంచి ముందు గదిలోకి వచ్చేసరికి అలిసిపోయి నీరసంగా నస్తున్న శర్మ కనిపించాడు.

'ఎలా వున్నాడు శ్యామాశాస్త్రి?'

'టైఫాయిడ్ అని అనుమానంగా వుంది. హాస్పటల్లో చేర్చాం.'

శ్యామాశాస్త్రి పదిహేనురోజులు హాస్పటల్‌లో టైఫాయిడ్‌తో బాధపడుతూ వుండిపోయాడు. శాస్త్రి కొడుకుతోపాటు అక్కడే వుండిపోయాడు. సావిత్రి యింట్లోనూ, శర్మ హాస్పటల్లోనూ అన్నీ సమకూర్చి శాస్త్రికి, కొడుక్కి చాలా సహాయం చేశారు.

పథ్యం పెట్టిన మూడోరోజు హాస్పటల్ నించి పంపించేస్తామన్నారు శ్యామాశాస్త్రిని. ఆ సాయంత్రం శర్మతోపాటు, సావిత్రి హాస్పటల్‌కి వెళ్ళింది. సన్నగా, నీరసంగా, బక్కచిక్కిపోయి, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకు పడుకున్నాడు శ్యామాశాస్త్రి. మంచంప్రక్కనే, నిద్ర లేమివల్ల లోతుకుపోయిన కళ్ళతో, దిగులుగా కూర్చున్నాడు శాస్త్రి. వాళ్ళిద్దరినీ చూడగానే సావిత్రి హృదయం జాలితో నిండిపోయింది.

'హాస్పటల్‌లో పథ్యం ఏం జరుగుతుంది? పిల్లవాడు ఎప్పటికి కోలుకుంటాడు? మనింటికి తీసుకుపోదాం' అంది సావిత్రి భర్తతో.

తమ యింట్లో వరండాని అనుకునున్న మొదటిగదిలో శ్యామాశాస్త్రికి మంచం, పక్క అమర్చారు సావిత్రి, శర్మా. రోగి యింటికి రాగానే, అతని పథ్యం, పానం బాగోగులు చాలావరకు వాళ్ళమీదే పడ్డాయి. స్వంత తమ్ముడిని చూసుకున్నట్టే ప్రేమగా, జాగ్రత్తగా చూసుకుంది సావిత్రి. రోజూ సాయంత్రం అతని గదిలో కూచుని కాస్సేపు కబుర్లు చెప్పి అతని మనసుకి వుల్లాసం కలిగించేది.

శ్యామాశాస్త్రి ఆరోగ్యవంతుడయేసరికి నెల్లాళ్ళు పట్టింది. అప్పటికే పరీక్షలు దగ్గిరికి రావటంవల్ల, సావిత్రి అతనిని తమ యింట్లోనే వుంచేసుకుంది. పరీక్షలు రాసి, సెలవులకి నెల్లూరి దగ్గిర పల్లెటూళ్ళో వున్న తమ బంధువుల యింటికి వెళ్ళాడు శ్యామాశాస్త్రి.

* * *

పున్నమిరాత్రి. వరండాలో పడకకుర్చీలో, వెన్నెలలోకి చూస్తూ కూర్చున్నాడు శర్మ. ప్రక్కనే కుర్చీలో కూచుని, సావిత్రి భర్తకి తమలపాకులకి సున్నంరాసి అందిస్తోంది. ఇంత సావకాశంగా వెన్నెలలో కూచోడం వాళ్ళకి చాలా అరుదు.

'రేపు శ్యామాశాస్త్రి వస్తాడు' సావిత్రి తమలపాకులలో వక్కపొడివేస్తూ అంది.

'వూఁ వస్తే?'

సావిత్రి జవాబు చెప్పడానికి తటపటాయించింది.

'మనింట్లోనే వుండి చదువుకోమందాం. మేడమీది గది ఖాళీగానే వుంది కదా?'

సావిత్రి అంతగా ఎందుకు శ్యామాశాస్త్రిని గురించి చెపుతుందో శర్మకి తెలుసు. తను డాక్టరు. పగలనక, రాత్రనక ఎప్పుడుపడితే అప్పుడు హాస్పటల్‌కి వెళ్ళాలి. అర్జెంట్ కేసు వుంటే అర్ధరాత్రి పరిగెత్తాలి. ఒంటరిగా గడిపే సావిత్రికి, శ్యామాశాస్త్రి వుంటే బాగా పొద్దుపోతుంది.

'మనింట్లో పెట్టుకోవచ్చును. కాని దానివల్ల చాలా సమస్యలు వస్తాయి' శర్మ ఆలోచిస్తూ అన్నాడు.

'ఏం సమస్యలు వుంటాయి? డబ్బే కదా? పుస్తకాలవీ మనమే కొని యిస్తున్నాం. ఇంక తిండి పెట్టటమే కదా? అతని చదువు రెండేళ్ళలో పూర్తి అవుతుంది' సావిత్రి తనని తనే సమాధాన పర్చుకుంటున్నట్టు అంది.

'ఏమో! అతను హాస్టల్లో వుంటేనే మంచిదేమో!' శర్మ తన నిశ్చయంగా చెప్పాడు.

'శ్యామాశాస్త్రిని చూస్తే నాకు తమ్ముడిని చూసినట్లు వుంటుంది. అతనంటే నాకు యిష్టం' సావిత్రి ఎటో చూస్తూ, శ్యామాశాస్త్రిని తమ యింట్లోనే వుంచుకోవాలన్నట్లు తన యిష్టాన్ని పరోక్షంగా చెప్పింది.

మర్నాడు 'అక్కా' అంటూ తలుపు తట్టిన శ్యామాశాస్త్రిని చూసి ఆశ్చర్యపోయింది సావిత్రి. ఈ నాలుగేళ్లల్లో పొడుగు ఎదిగాడు, లావు కాలేదు. కాని టైఫాయిడ్ తర్వాత వంటపట్టిన మంచి భోజనంతో, మందులతో, సెలవులలో దొరికిన విశ్రాంతితో మనిషి పుష్టిగా, అందంగా తయారయ్యాడు.

తన పక్కచుట్టా, ట్రంకుపెట్టెతో బయలుదేరబోతున్న శ్యామాశాస్త్రిని చూసి సావిత్రి 'ఎక్కడికబ్బాయ్ బయలుదేరావ్' అంటూ నవ్వుతూ ఆపింది.

'నా గూటికి, హాస్టల్కి'

'నీ గూడింక మా మేడమీది గది. నీ సామాను అక్కడికి పట్టుకెళ్ళు' అంది సావిత్రి తిరిగి నవ్వుతూ.

కొడుకు వెనకే నీరుకావి పట్టిన పంచె కట్టుకుని వుంటున్న శాస్త్రి, వెంటనే వచ్చి సావిత్రి రెండుకాళ్లూ పట్టుకున్నాడు.

'అమ్మా నువ్వు దేవతవు. చెయ్యెత్తి మొక్కాలి' అన్నాడు గద్గదకంఠంతో.

సావిత్రి సిగ్గుపడుతూ యింట్లోకి వెళ్ళిపోయింది.

సావిత్రి యింట్లో చేరిన శ్యామాశాస్త్రి అలవాట్లల్లో, దుస్తులలో కొద్ది నెలలోనే చాలా మార్పు వచ్చింది సావిత్రి తమతో సహా షూక్స్ని, డైనింగ్ టేబిల్ మీదే శ్యామాశాస్త్రికి భోజనం ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు జతల బట్టలతో కాలం గడుపుతున్న అతని యిబ్బంది చూసి, బజారుకి తీసుకువెళ్ళి, అతనికి సరిపడినన్ని మంచి బట్టలు కొని యిచ్చింది.

శ్యామాశాస్త్రి సావిత్రిని 'అక్కా' అని పిలవడం వల్ల, సావిత్రి పరిచయస్థులు, స్నేహితులు, అతడిని సావిత్రి తమ్ముడిగానే భావించేవారు.

శ్యామాశాస్త్రి అందరితో సావిత్రి 'మా అక్క' అని గర్వంగా చెప్పుకునేవాడు. శ్యామాశాస్త్రి చేరిన తర్వాత, మొదటి నెలాఖరున శాస్త్రికి సావిత్రి ఆ నెల జీతం యివ్వబోతే, శాస్త్రి డబ్బు తీసుకోడానికి నిరాకరించేడు.

'అమ్మా. మీ దగ్గర డబ్బు తీసుకుంటానా? మా అబ్బాయిని మీ తమ్ముడిలా చూసుకుంటున్నారు. మా వాడికి మీరు చేస్తున్న సహాయానికి మేం ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము. నా చర్మం చెప్పులు కుట్టించి యిచ్చినా మీ ఋణం తీరదు తల్లీ' అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

* * *

సావిత్రీ వాళ్ళు విశాఖపట్నంలో వుండటం వాళ్ళకి పెద్ద యిబ్బంది తెచ్చిపెట్టింది. హాస్పటల్ పనిమీదో, కోర్టు పనిమీదో, యూనివర్శిటీ పనిమీదో ఎవరో ఒకరు ఎప్పుడూ వాళ్ల యింటికి అతిథులు, బంధువులూ వస్తూనే వుంటారు. ఆగష్టు నెలలో సావిత్రి మేనత్త, మొగుడూ వచ్చారు. మేనత్త మొగుడికి కోర్టులో పని వుంది.

డైనింగ్ టేబిల్ దగ్గర తమతో పాటు భోజనం చేస్తున్న శ్యామాశాస్త్రిని చూపించి, మేనత్త అడిగింది.

'ఎవరే యితను?'

'మా తమ్ముడు' అంది సావిత్రి గర్వంగా.

'నీకు తమ్ముడెవరే? నీ తరవాత మీ అమ్మకి పిల్లలు లేరుకదా?' అనుమానంగా అంది మేనత్త.

'అరువు తమ్ముడు' నవ్వుతూ అంది సావిత్రి

'అది తెలుస్తూనే వుంది. ఎక్కడినించి వచ్చాడని?'

'ఇక్కడినించే. మా శాస్త్రిగారి అబ్బాయి'

'సావిత్రి మేనత్త అర్థం అయినట్టు 'అలాగా' అంటూ తను భోజనం చెయ్యడంలో నిమగ్నమయింది.

'ఏ శాస్త్రిగారు?' అడిగాడు అర్థం కాని మేనత్త మొగుడు.

'అదేనండీ. ఆ వంటాయన కొడుకు.'

ఆ మాట వింటూనే శ్యామశాస్త్రి ముఖం చిన్నబోయింది. గబగబా నాలుగు ముద్దలు మింగి వెళ్ళిపోయాడు అక్కడినించి.

సంభాషణ అంతా వింటూ అక్కడే నుంచున్న శాస్త్రి ముఖం [illegible] చిరాకుగా మారిపోయింది. వాళ్లిద్దరి ప్రవర్తనా అర్థంకాని సావిత్రి ఆశ్చర్యపోయింది.

సాయంత్రం ఒంటరిగా దొరికిన శర్మతో, ఉదయం భోజనాల దగ్గర జరిగిన సంభాషణా, తండ్రీ కొడుకుల ప్రవర్తనా చెప్పింది. 'వంటాయన కొడుకు అంటే తప్పేమిటి? నిజాన్ని చెప్పుకోడానికి చిన్నతనం ఏమిటి?' ఉద్రేకంగా అడిగిన సావిత్రి ప్రశ్నలకి సమాధానంగా 'అదంతే' అంటూ నవ్వేసి శర్మ అక్కడినించి వెళ్లిపోయాడు. సావిత్రి అయోమయంగా, విసుగ్గా అలాగే నిలుచుండిపోయింది చాలాసేపు.

ఈ సంభాషణలే బంధువులు, అతిథులూ సావిత్రి యింటికి వచ్చినప్పుడల్లా మామూలైపోయాయి. 'వంటాయన కొడుకు' 'శాస్త్రిగారి అబ్బాయి' అని చెప్పకుండా ఎలా తప్పించుకోవాలో తెలియదు సావిత్రికి. సావిత్రి అలా చెప్పినప్పుడల్లా చిన్నబుచ్చుకునేవాడు రామశాస్త్రి. చుట్టాలు వున్న రెండుమూడు రోజులూ తండ్రీ, కొడుకూ ఆ యింట్లో యిబ్బందిగా తిరిగేవారు. శాస్త్రి, అతిథులు వున్నన్ని రోజులూ ఏదో సణుగుతూ, చికాకు పడుతూవుండేవాడు. భోజనం, కాఫీ, టిఫిన్లు అతిథులకి పెట్టటానికి విసుక్కునేవాడు.

జనవరి మొదటివారం కూతుర్నీ, అల్లుడినీ చూసిపోదామని వచ్చారు సావిత్రి ముసలి తల్లిదండ్రులు విశ్రాంతిగా వుందామని వచ్చిన వాళ్ల ఆశలన్నీ ఎదురుతిరిగాయి. సావిత్రి తల్లికి హఠాత్తుగా గుండె జబ్బువచ్చి, ప్రాణంమీదికి వచ్చింది. ఒకరాత్రి ఆవిడని ఆసుపత్రిలో చేర్చి, సావిత్రి అన్నలకి, అక్కలకి టెలిగ్రాములు పంపించారు.

ఇంట్లో అంతా ఆదుర్దాగా, భయం భయంగా తిరుగుతున్నారు సావిత్రి రోజంతా హాస్పిటల్కి, యింటికి తిరుగుతూ గడుపుతోంది. ఒక మధ్యాహ్నం

# ఏరు దాటారు

నాలుగు మెతుకులు నోట్లో వేసుకు వెళదామని యింటికి వచ్చిన సావిత్రికి వాకిట్లో రిక్షా, రిక్షాలో శ్యామాశాస్త్రి సామాను కనపడింది. వాకిట్లో నుంచు న్నాడు శ్యామశాస్త్రి. 'మీ కోసమే చూస్తు న్నాను. ఇక్కడ నాకు చదువు సాగటం లేదు ఫైనలియరు కూడా. మా స్నేహి తుడి గదికి వెళిపోతున్నాను. మీతో చెప్పి పోదామనే యిందాకటినించి కనిపెట్టు కున్నాను' అన్నాడు శ్యామశాస్త్రి. 'ఇప్ప డా శ్యాముడూ?' అర్థం కానట్టు అతని వేపే చూస్తోంది సావిత్రి.

'ఇప్పుడు చదువుకోకపోతే నాకు మంచి మార్కులు రావు. నా ముందు జీవితం అంతా పాడవుతుంది' అతని కళ్లల్లో కనిపించిన స్వార్థంచూసి మరి మాట్లాడ లేకపోయింది సావిత్రి.

'సరే మంచిది వెళ్ళు. గుడలక్' అంటూ గబగబ లోపలికి నడిచింది.

ఇన్నాళ్లూ ఎవరినైతే తన తమ్ముడిగా ఆప్యాయంగా చూసుకుందో, ఎవరి తెలివి తేటలు అందం గర్వంగా అందరితో చెప్పకుందో. ఆ శ్యామాశాస్త్రి యీరోజు తనని, 'నువ్వు నాకేం కావు. నీ కష్ట సుఖాలతో నాకు సంబంధంలేదు' అంటూ వెళిపోతున్నాడు. తింటున్న కంచంలో నీళ్ళ పోసేసి లేచిపోయింది.

టెలిగ్రాములు అంది సావిత్రి అక్కలూ, అన్నలూ దగ్గిర బంధువులూ కుటుంబా లతో విశాఖపట్నం తరలివచ్చారు. ఇంటి నిండా జనం. తల్లి ఆరోగ్యం గురించిన బెంగతో, యింట్లో మనుష్యులకి భోజ నాలు, కాఫీలు అందజెయ్యడంలో సావి త్రికి క్షణం తీరిక, మనశ్శాంతి లేకుండా పోయాయి.

రాత్రిపదకొండుగంటలైంది అందరూ నిద్రకి వుపక్రమిస్తున్నారు. వంటింట్లోకి శాస్త్రికోసం వెళ్ళింది సావిత్రి. శాస్త్రి అప్పుడే వంటింటిపక్క తన గదిలో చాప పరుచుకుని నిద్రకి వుపక్రమిస్తున్నాడు.

'శాస్త్రిగారూ! రేపు కొంచెం వేగిరం, అయిదుగంటలకే రెండు కప్పుల కాఫీ చేసిపెట్టాలి.'

శాస్త్రి ఏం మాట్లాడలేదు.

'ఈ రోజు వచ్చిన మా బాబయ్య, పిన్ని రేపు తెల్లవారుఝామున బండికి వెళుతున్నారు'

శాస్త్రి ఒక్కసారి విదిలించినట్లు మాట్లాడాడు— 'అమ్మా యింతమందికి నేను చెయ్యలేను. తెల్లవారు ఝామునే చలిలో లేవడం నా శక్యం కాదు. నేను మీ యింట్లో వంటకి వప్పుకున్నప్పుడు యిద్దరు మనుష్యులకే వండాలని చెప్పారు. కాని ఎప్పుడూ మీ యింట్లోకి ఎవరో ఒకరు వస్తూనేవుంటారు.'

'ఇల్లన్నాక మనుష్యులు రారా? ఇప్ప డేదో అమ్మకి బాగుండకపోబట్టి యింత మందివచ్చి యిన్నాళ్ళ వున్నారు. అస్త మానూ వచ్చి మనిళ్ళల్లో ఎవరు వుంటారు? మీరు యిలాంటి కష్ట సమయంలో విసుక్కుంటే ఎలా శాస్త్రి గారూ?'

'నేను చెయ్యలేను బాబూ యీ పని. యీ జీతం లేనిపని' శాస్త్రి చాపమీద చతికిలపడ్డాడు.

సావిత్రికి కోపం కట్టలు తెంచుకు వచ్చింది. శాస్త్రిని చూస్తే అసహ్యం వేసింది.

'మిమ్మల్ని జీతం ఎవరు తీసుకో వద్దన్నారు? ఇప్పుడే తీసుకోండి' అంటూ గదిలోకి వెళ్ళి బీరువాలోంచి నోట్ల కట్టలు తెచ్చి శాస్త్రి ముందు పడేసింది.

ఉదయం లేస్తూనే వంటింట్లో కాఫీ కలుపుతున్న తన అక్కని చూసి ఆశ్చర్య పోయింది సావిత్రి.


'ఇదేమిటి? నువ్వు కాఫీ కలుపు తున్నావ్? శాస్త్రిగా రేమయ్యారు?' అంటూ శాస్త్రి గది తలుపు తీసింది. అంతే! ఖాళీగా వున్న గది చూసి కొయ్య బారిపోయింది సావిత్రి.

బ్రష్ చేత్తో పట్టుకు అటే వస్తున్న శర్మ, సావిత్రిని చూసి 'ఏం అలా చూస్తూనుంచున్నావ్?' అన్నాడు దగ్గిరికి వస్తూ.

'శాస్త్రిగారు వెళ్ళిపోయారు'

శర్మ సావిత్రి దగ్గిరికి వచ్చి, చెయ్యి పట్టుకున్నాడు.

'పోనీవే వెళ్ళిపోతే పీడాపోయే! పాత్ర మెరిగి దాన మియ్యమన్నట్టే, మనుష్యు లని తెలుసుకు అభిమానం, ప్రేమ యియ్యాలి. నీ మంచితనాన్ని వాళ్ళు కొల్లగొట్టుకున్నారు.' ●



(ఛ) చదరంగపు బల్లమీది చదరాలు :


చదరంగపు బల్లమీద ఎన్ని చదరా లుంటాయి ?

* * *




(చ) అశ్వలాయనం :


ఇక్కడి బొమ్మలో 25 చదరాలున్నాయి. గుర్తుకోసం ఆ గదులలో ఒకమూల 1 నుంచి 25 వరకూ అంకెలు వేశాను ఈ సమస్యను సాధించే ముందు ఇటువంటిదే పెద్దబొమ్మను గియ్యి. ఆ గదులలో పట్టే గుండ్రని అట్టముక్కలు 24 కత్తిరించి, వాటిమీద 1 నుంచి 24 వరకూ




అంకెలు వెయ్యి. వేసి, ఆ అట్టముక్కలను ఈ బొమ్మలో చూపినట్లుగా అమర్చు. 25 వ గది కాళీగా మిగిలిపోతుంది. ఈ అట్టముక్కలను ఒకగదిలో నుంచి కాళీగా ఉన్న మరొక గదిలోకి 'గుఱ్ఱపు ఎత్తు' వేసి మార్చవచ్చు. చదరంగంలో గుఱ్ఱం ఎల్లా నడుస్తుందో తెలుసుగా ! ఉదాహరణకి : ఈ బొమ్మలో కాళీగా ఉన్న 25 వ గదిలోకి 1, 2, 10 అనే అంకెలు వేసిఉన్న అట్ట ముక్కలలో ఏదో ఒకదానిని మార్చవచ్చు. ఈ విధంగా మారుస్తూ, సాధ్యమైనన్ని తక్కువ మార్పులతో ఒకటవ గదిలో 1 అనే అంకె ఉన్న అట్టముక్క, రెండవగదిలో 2 అనే అంకె ఉన్న అట్టముక్క, మూడవగదిలో 3 అంకె ఉన్న ముక్క.. ఇరవై నాలుగవ గదిలో 24 అంకె ఉన్న ముక్క ఉండే టట్లు చెయ్యాలి.

ఉదాహరణకి మార్పులు ఈ క్రింది విధంగా చేయవచ్చు : 1–21–14–18 –22.....కాళీగా ఉండేది ఎప్పుడూ ఒక్కటేగది కనుక ఈ విధంగా వ్రాస్తే ఏముక్క తరువాత ఏముక్క కాళీజాగాను ఆక్రమిస్తుందో తెలుస్తుంది. సాధ్యమైనన్ని తక్కువ ఎత్తులలో ఈ సమస్యను సాధించడం ఎల్లాగ ?

* * *








(ట) బలగం అమర్చే పద్ధతి :

చదరంగపు బల్లమీద బలగాన్ని అమర్చినప్పుడు అటు చివర ఒక ఏనుగునూ ఇటు చివర ఒక ఏనుగును ఉంచుతారు కదూ. ఈ రెండు ఏనుగులకూ భేదం ఏమీలేదు. ఏదైనా ప్రత్యేకించి గుర్తు పెట్టుకుంటే తప్ప వాటిని వేరువేరుగా అనమాలు పట్టడమే కష్టం. కనుక వాటి స్థానాలను తారుమారు చేస్తే వచ్చే కొంపమునక ఏమీలేదు. అంటే బల్లమీద తెల్ల ఏనుగులను (లేదా నల్ల ఏనుగులను) రెండు విధాలుగా అమర్చవచ్చు అలాగే గుఱ్ఱాలను, శకటులనుకూడా రెండు రెండు విధాలుగా అమర్చవచ్చు. వీటిలో ఏ విధంగా అమర్చినా ఆటలో భేదం ఏమీ ఉండదు.

(64 వ పేజీ చూడండి)

# శర్మవంతు




కొడవటిగంటి కృష్ణమూర్తి

'ఇవాళ కాఫీ, చిట్లాట వగైరా విూ ఇంట్లో రాసిపెట్టినాయి శర్మా!' అన్నాడు వస్తూనే పార్వతీశం. వెంట గణపతి వున్నాడు.

'వగైరా కూడానా?' అన్నాడు గణపతి. శర్మ, పార్వతీశం నవ్వేశారు.

'నీకూ్కడా గణపతి చాదస్తం పట్టుకుంటున్నదా ఏమిటి? మగపెళ్లివారిలా దర్జాగా ఆలిస్యం చెయ్యటం మాత్రం, నీకు రాసిపెట్టివుంది!' అన్నాడు శర్మ. తనతప్పు లేనట్టుగా గణపతి నవ్వాడు. అంటే వస్తూ వస్తూ గణపతి దారిలో ఆగి, పార్వతీశాన్ని మామూలుప్రకారం అరగంట ఆలిస్యంగా తీసుకురాగలిగాడు అన్నమాట!

'అది నీకూ్కడా అంటుతుందేమోనని వాకో భయం లేకపోలేదు!' అన్నాడు పార్వతీశం.

'ఏమిటి—ఆలిస్యం చెయ్యటమా?' అన్నాడు గణపతి. శర్మ నవ్వాడు.

'కాదు—నీవేదాంతం!' అన్నాడు పార్వతీశం. శర్మ మళ్లీ నవ్వాడు.

'భయం దేనికి?' అన్నాడు గణపతి కొంటెగా.

'ఇష్టంలేని విషయం కనక!' అన్నాడు పార్వతీశం విసుగ్గా.

'ఎవరికి—నీకా, శర్మకా?' అన్నాడు గణపతి నవ్వుతూ. పార్వతీశం నీరసంగా చూడటంచూసి 'రాసిపెట్టివుంటే తప్పుతుందా?' అన్నాడు శర్మ. ముగ్గురూ నవ్వేశారు. 'అయినా మా ఇంట్లో కాఫీ, పేకాటకూ్కడా రాసిపెట్టి వుండాలా?' అన్నాడు శర్మ.

'అలా అనకు మరి! అనలివ్వాళ వంతు ప్రకారం మా ఇంట్లోకదూ!' అన్నాడు పార్వతీశం.

'కొంపేమి మునిగేవంతు కాదనుకో—మరి మీ వాళ్లు అనుకోకుండా వూరికి వెళ్లాలిసివచ్చిందన్నావుగా నిన్నవే?' అన్నాడు శర్మ.

'కనకనే—విూ ఇంట్లో—రాసిపెట్టి—వుందనటం!' అని పార్వతీశం ఒక్కొక్క మాటను నొక్కుతూ అంటే, అది అతని భావం స్పష్టపరచటమో లేక ఇష్టం లేకుండా నేర్చుకున్న పాఠం అప్పచెప్పటమో శర్మకు అర్థంకాలేదు.

గణపతి లేచి, కాలెండర్లు, పటాలు చూస్తున్నాడు. శర్మ ఏదో అనబోతూ అవతల

హాలులోంచి భార్య పిలవటం చూసి లోపలి కెళ్ళాడు.

శర్మ, పార్వతీశం, గణపతి సన్నిహిత స్నేహితులకింద సె లెక్క. వాళ్ళు వారానికో సాయంత్రం వంతు ప్రకారం ఒక్కొక్కళ్ళ ఇంట్లో కలుసుకుని, పేకాట ఆడుకోవటం రివాజు. అయితే గణపతి 'రాసిపెట్టివుందికామాల!' అనటం మాత్రం అర్థంకాక, శర్మకు ఉడుకుమోత్తనం వస్తూ వుంటుంది. పార్వతీశం కూడా వేడి ఎక్కటం కద్దు. కాని గణపతి చెప్పేదాంట్లో ఒక్కొక్కప్పుడు కొంత నిజంలాంటిది కనిపించటంవల్ల పార్వతీశం ఆ సిద్ధాంతాన్ని 'గణపతి ఉవాచ'గా ప్రకటిస్తాడు. వాళ్ళ స్నేహధర్మం అలా మూడు పాదాల నడుస్తోంది!

'ఇవాళ మా ఇంట్లో చీట్లాటకు వీల్లేదు—అనుకోకుండా బైటికి వెళ్ళాలిసి వచ్చిందంటే?' అన్నాడు శర్మ. మూడు కప్పుల కాఫీతో గదిలోకి వస్తూ. గణపతి మళ్ళీవచ్చి కూచున్నాడు.

'మా కివాళ కాఫీమాత్రమే రాసిపెట్టి వుందంటాడు — గణపతి!' అన్నాడు పార్వతీశం. ముగ్గురూ బిగ్గరగా నవ్వేశారు. వట్టికాఫీ ఇచ్చినందుకూడా పార్వతీశం ఆమాట అనిపుండచ్చుగా, అనుకున్నాడు శర్మ

'నువ్వెదవ్వా టీఫిసు చేస్తేతప్ప లోగు లేదు—తెలిసిందా?' అని ఇంట్లోకి అరిచాడు శర్మ. ముగ్గురూ మళ్ళీ నవ్వారు ఏదో చూద్దామన్నట్టుగా వచ్చిన శర్మ రెండేళ్ళ కూతురు, పెద్దలు నవ్వటంచూసి, లోపలికి వెళ్ళిపోయింది. ముగ్గురూ కాఫీ పూర్తిచేశారు.

'ఇవాళ దొడ్లో ఆడుకుందాం—చల్లగా వుంటుంది' అని శర్మ, దొడ్లో చాపలు వెయ్యమని మళ్ళీ ఇంట్లోకి కేక వేశాడు.

'వాన వస్తుందేమో?' అన్నాడు పార్వతీశం

'రాసిపెట్టివుంటే తప్పుతుందా! అయినా రేడియోలో చెబితే వీల్లేట్టుగా అడుగుతున్నావే!' అంటూ పేకను తీసుకొని శర్మ దొడ్లోకి నారితీశాడు.

'అయినా వానలో తడవటం మీకు సరదాగా!' అన్నాడు పార్వతీశం

'వాళ్ళా ఏళ్ళు తిరుగుతూవుంటారేమో?' అన్నాడు గణపతి.

'పక్క భాగంలో వాళ్ళు పొద్దుటే వాళ్ళ పక్కవూరు వెళ్ళారు. రేపుకాని రారు. ఇక మా ఆవిడ, పిల్లే!' అన్నాడు శర్మ.

శర్మ ఇల్లు పాతది—వీధి వీపాదకున్నది. ముందు కొద్దిభాగం మెట్లులేని డాబా, వెనక పెంకుటిల్లు. దాదాపు ఖాళీస్థల మంతా దొడ్డివేపే వుంది. పెద్దఇల్లు కాకపోయినా తాము ఇన్నేకు పొడికొవటంవల్లా, తోడుగా వుంటుందని కొంతబాగాన్ని శర్మ అద్దెకిచ్చాడు. బాదంచెట్టు, ఇంటినానుకునే పైన రేకులతో స్నానాలగది, పక్కనేబావి, రెండుమూడు అరటిచెట్లు, కొబ్బరిచెట్టు, నందివర్ధనం, కరివేపచెట్టు, పారిజాతం, ఎర్రగన్నేరు, పచ్చగన్నేరు—మధ్యలో తులసికోట, పొట్లపాదు, బచ్చలి దుబ్బులు, కంద మొక్కలు—అన్నీ చక్కగా సర్దినట్టున్నాయి. శర్మ భార్య వచ్చి కాస్త మేర చిమ్మతోంది.

పార్వతీశానికి ఆ దొడ్డిచూస్తే ఎంతో ముచ్చటవేసింది. అతను ఓ మేడపై భాగంలో అద్దెకుంటున్నాడు. గణపతికూడా ఓ పెంకుటింట్లో అద్దెకుంటున్నవాడే. గణపతి పొట్లపాదుదగ్గర నిలబడి చిన్నరాయి కట్టి వేళ్ళాడుతున్న పెద్దపొట్లకాయని వానచూస్తుంటే, పార్వతీశం వోగూరింది!

పార్వతీశం అటూ ఇటూచూసి ఓరాయి తీసి, శ్రీమతి శర్మ చీపురుతో ఇంట్లోకి పోగానే, పైన కనిపించిన బాదంపండుకేసి విసిరాడు! ఆ దెబ్బకాపండు విసురుగా అవతల ఏటవాలుగావున్న స్నానాలగది రేకుల మీదపడి, పార్వతీశం చూస్తుండగా, దొర్లుకుంటూవచ్చి బావిలో పడిపోయింది! ఆ చప్పుడుకు రేకులకీవాదవున్న ఉడత పైకి పారిపోయి స్నానాలగదికీ, ఇంటిచూరుకూ మధ్య గాలికోసం ఏర్పాటయిన కిటికీ చువ్వలు చేరటం, ఆ చువ్వల్లోంచి బైటికి రావటానికి వేళ అయిందా లేదా అని చూస్తున్న ఓ ఎలుక లోపలికే నిష్క్రమించటం, ఒక్కసారి జరిగాయి!

'మాఇంట్లో మనుషులున్నారనుకుంటేనే!' అన్నాడు శర్మ.

'బాదంపండు ప్రాప్తంలేదోయ్!' అన్నాడు పార్వతీశం.

'ఎందుకులేదో చూస్తాను!' అంటూ శర్మ, చీట్లపేకను గణపతికిచ్చి, బావి దగ్గరికెళ్ళి బొక్కెనవేసి, ఓనిమిషం శ్రమపడి బొక్కెనడు నీళ్ళతో బైటికితీస్తూ ఆ బాదంపండుతీసి, దాన్ని పార్వతీశాని కిచ్చాడు.

'భేష్!' అన్నాడు గణపతి. పార్వతీశం బాదంపండు కొరకటంచూసి, మళ్ళీ చిరు దొడ్లో చాపలుపరిచి పోతున్న శర్మభార్య మొహం అటు తిప్పుకుని నవ్వేసింది!

స్నేహితులు చాపలమీద చేరారు. 'ఇవాళ మనం కట్ థ్రోట్ బ్రిడ్జి ఆడాలని రాసి పెట్టివుంది!' అంటూ శర్మ పేక కలిపి, ముక్కలు పంచటం ఆరంభించాడు. పార్వతీశానికి నవ్వాగలేదు.

'నువ్వు నన్ను ఎన్నిసార్లు ఎగతాళి చేసినా మరేం ఫర్వాలేదు. ఆ మాటకొస్తే, నువ్వు గెలవాలనికూడా రాసిపెట్టి వుండేమోలే!' అన్నాడు గణపతి. ముగ్గురూ నవ్వుకున్నారు. వాళ్ళు సాధారణంగా ఆడేది రమ్మీ. కదాచిత్తుగా కట్ థ్రోట్ బ్రిడ్జి ఆడితే, శర్మ చిత్తయి పోవటం మామూలు. కాని మళ్ళీ ఆ ఫ్సోస్తతో గెలుస్తాడతనూ అది వాళ్ళలో ఎగతాళి అయిపోయినా గణపతి ఇష్టమైనాట అనత ఎతే బాగుండేదేమో ననుకున్నాడు పార్వతీశం.

ఆట జోరుగా సాగిపోతోంది. శర్మ కూతురు దొడ్డివాకిట్లో నిలబడి ఏదో తింటూ, వాళ్ళని చూస్తోంది 'దా! దా!' అన్నాడు పార్వతీశం. ఆ పిల్ల రానన్నట్టుగా తల అడ్డంగా ఆడించింది. కాని మెల్లిగావస్తూ, దాటిపరాసిన చారేడు కళ్ళతో పార్వతీశానికి అందకుండా ఎడంగా పోయి తండ్రిదగ్గిరికి చేరి, ఆటలో మునిగివున్న శర్మవళ్ళో కూచుంది. శర్మ దృష్టి మరల్చి కుమార్తెచేతిలో పకోడీ కనిపించగానే, దొడ్డి వాకిలివేపు చూశాడు. అతని భార్య ఓ పళ్ళెంతో ఆ వాకిట్లో నిలబడివుంది. శర్మ లేచివెళ్ళి ఆ పళ్ళెం తెచ్చి మూడు ప్లేట్ల పకోడీలూ, ఇంకో మూడుకప్పుల కాఫీ, మూడుగ్లాసుల మంచి నీళ్ళూ అలా ఒకరివక్కన పెట్టేశాడు. గణపతి ఒక పకోడీ తీస్తూ చేయి చాపేస్తే, శర్మకూతురు పార్వతీశం వంకా, గణపతి వంకా చూస్తూ, ఆ పకోడీని రెండోచేత్తో తీసుకుని తండ్రివళ్ళో వాలిపోయింది!

స్నేహితులు ఫలహారంచేస్తూ ఆట కొన

ఉత్తరాలు రాసేవారికి మనవి: ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి! కాగితానికి ఒకవయిపునసే రాసి ఉండాలి రాసినవారి పేరు, చిరునామా తెలుగు అక్షరాలలోనే రాయాలి. వీలయినంత దాకా ఇంగ్లీషు, ఇతర భాషల అక్షరాలు వాడవద్దని లేఖకులకు మనవి చేసుకుంటున్నాము. (సం)

# శర్మ పంతు

సాగించారు. కాని గణపతిమాట నిజం కాలేదు—శర్మ ఆట చెప్పినప్పుడల్లా ఓడిపోతున్నాడు! పార్వతీశం, గణపతి తమ ఆటలు ఓసారి ఓడినా మరోసారి గెలుచుకుంటున్నారు. శర్మ ఒక్కసారిగా కూతుర్ని పక్కన కూచోపెట్టి పేక కలిపి, ముక్కలు పంచాడు. ఆ పిల్లముఖం చిన్నబుచ్చుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది. తన ముక్కలు తీసిచూసి శర్మ తనదేం లేదన్నాడు. పార్వతీశం, గణపతి పోటీపడి చివరకు గణపతి షోర్ స్పేడ్సుతో, కిందిముక్కలు తీసుకున్నాడు. శర్మ ఇస్పేటు నాలుగు దిగాడు! సర్దు, కిందిముక్కలు పరిచాడు గణపతి. శర్మ దభాలున బచ్చలిమడి పక్కనే కనిపించిన చిన్నరాయిని తీసి విసిరాడు. అది చూశారు గణపతి, పార్వతీశం. ఆ రాయి ఇంటిగోడ పక్కగా పరిగెత్తిపోతున్న ఎలికకు తగిలింది. ఆ ఎలిక రెండుసార్లు గిజ గిజ కొట్టుకుని మరి కదల్లేదు! శర్మ నివ్వెరపోయాడు. అసలా రాయి ఆ ఎలికకు తగులుతుందని అతను అనుకోలేదు. ఎలిక చచ్చిందా అని ముగ్గురికీ ఒకేసారి అనుమానం వచ్చింది. అయిదుగజాల దూరంలో రాయిదెబ్బకు చర్మం చీల్చుకుపోయి కదలకుండా పడివున్న ఎలిక, ఇంకా బతికివుండట మేమిటి—ముగ్గురూ ఆశ్చర్యపోయినారు.

'యముగురి శర్మా—దెబ్బకు చంపేశావు ఎలికని!' అన్నాడు పార్వతీశం.

'నువ్వా రాయిని దానిమీదకు ఎందుకు విసరినట్టు?' అన్నాడు గణపతి.

'ఏం లేదు – బెదిరిద్దామనే!' అంటూ శర్మ చచ్చిన ఎలికని ఓ బాదం ఆకుతో పట్టుకుని తీసుకువెళ్ళి, వీధిలో పారేసి వచ్చాడు. ఎక్కణ్నుంచి వస్తోందో ఓ తెల్లపిల్లి బచ్చలి దుబ్బులకు అవతలగా వెడ పైకెత్తి, గోడమీద కూచుని తెగ అరుస్తున్న కాకివంక చూస్తూ, పొట్లపాదు వెనుక చేరి 'ఆహారం కాకపోయినా ఫలాహారమైనా దొరకదా' అన్న ఆశతో అక్కడ తిష్ఠవేసింది!

'ఆ ఎలికకు నీ చేతిలో అలా చావు రాసిపెట్టి వుందోయ్—సమయానికి నీకా రాయికూడా దొరకాలా!' అన్నాడు గణపతి.

'ఏదో నీ వాహనాన్ని నాశనం చేసినట్టు మాట్లాడతా వేమిటోయ్—వెధవ ఎలిక!' అన్నాడు పార్వతీశం. శర్మ బలహీనంగా నవ్వాడు!

హాయిగా వీస్తున్న గాలి విజృంభించటం ప్రారంభించింది. పేక ముక్కలు ఎగిరిపోకుండా వాళ్ళు కాస్సేపు ప్రయత్నించి చూశారు కాని లాభం లేకపోవటంతో, చాపలతో, పేకముక్కలతో, గ్లాసులు, ప్లేట్లు వగైరాలతో ముగ్గురు స్నేహితులూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

* * *

రాత్రి పదకొండుగంటలు దాటినా శర్మకు నిద్రరాలేదు. ఏదో పుస్తకం తీసుకుని ఎంత చదివినా నిద్ర పట్టలేదు... అదో చచ్చు ఎలికే కావచ్చు—భారత ప్రజల ఆహారానికి ప్రబల శత్రుకోటిలో ఓ భాగస్వామి కావచ్చు—కాని—అతను విసిరిన రాయికే, అది టుబుక్కున చావాలా? అతనింతవరకూ ఏ ప్రాణినీ రక్షించకపోవచ్చు—కాని ఏ ప్రాణినీ కావాలని నాశనం చెయ్యలేదు. బుద్ధి తెలిసింతర్వాత అతని చేతుల మీదగా అంత దారుణహత్య జరగలేదు—మరి ఆ ఎలికనైనా చంపాలని అతను రాయి విసర్లేదుగా...కరుణానిధి కాకపోయినా శర్మ మనస్సులో ఆ ఎలిక అలా మెదలటానికి కారణం, గణపతి అన్నమాట!

ఆ ఎలికకు నిజంగానే తన చేతుల్లో అలా చావు రాసిపెట్టివుందా? దానికి చావు మూడటంవల్లే తానా రాయి విసిరాడా? అప్పుడింకెవరు రాయి విసిరినా అది చచ్చేదా? ఆ రాయి దెబ్బకు అది చచ్చేదే కాదు...గోడకు, రాయికిమధ్య నలిగి, చర్మం చీల్చుకుపోయి, చచ్చింది అది.. అప్పుడా గోడ లేకపోతే ఆ ఎలిక అప్పుడక్కడికి రాకపోయి తే ...ఎన్నడూ అయిదు అడుగుల దూరంలో గోలీనికూడా కొట్టలేని తనకు అయిదుగజాల దూరంలో పారిపోయే ఎలికను చంపే గురిరావటం ఆశ్చర్యం—గణపతి మాట అలా నిజంకావటం శర్మకు నచ్చలేదు!

'మ్యావ్!'

శర్మ ముఖం తిప్పి చూశాడు. హాలుకు, గదికీ మధ్య గడపలో కూచుని తెల్లపిల్లి 'నా నోట్లో అన్నం తీశేసినవాడా! ఇప్పుడు

# సైంటిస్టులు
## నొప్పిని అతి శీఘ్రంగా తొలగించుటకై విధానమును
# కనుగొన్నారు
# క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రో

ఇప్పుడు, మొదటిసారిగా భారతదేశంలో ప్రవేశపెట్టబడినది

**బాధే మా సమస్య:** "ఆస్ప్రో" యొక్క పరిశోధన సంస్థలో, బాధ యొక్క సమస్య మీద పని చేస్తున్న సైంటిస్టులు ఇప్పుడు, క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోను కనుగొన్నారు — ఇది బాధను అతి శీఘ్రంగా పోగొట్టే సాధనము.

**మైక్రోఫైనడ్ అంటే ఏమిటి:** మైక్రోఫైనడ్ అంటే, ఆస్ప్రోలోని నొప్పిని పోగొట్టే పదార్థము మునుపటి కంటె సన్నగా క్రొత్త ప్రత్యేకమైన పద్ధతిలో చెయ్యబడినది. ప్రతి మాత్రలోను ఇప్పుడు ఇంచుమించు 15 కోట్ల అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి. అందువలన, రెండింతల కన్నా ఎక్కువగా నొప్పిని పోగొట్టే శక్తి అతి శీఘ్రంగా పని చేసి, మూడు రెట్లు శీఘ్రంగా నొప్పిని తొలగించును.


**అతి శీఘ్రంగా పని చేస్తుంది-చాలా సేపు వుంటుంది:** క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోలోని చురుకైన పదార్థము సునాయాసంగా, అతి త్వరగా ఇమిడి శరీరమందు 5 నుండి 7 గంటల దాకా వుంటుంది. ఇందువల్లనే, మైక్రోఫైనడ్ ఆస్ప్రో అతి శీఘ్రంగా నొప్పిని తొలగిస్తుంది, మరియు చాలా సేపు వుంటుంది.

**తీసుకోవడం చాలా సులభము:** క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రోను మీకు ఇష్టమైనట్లు తీసుకోవచ్చును. అలాగే కాని, నీళ్లలో కలిపి కాని, ఒక గ్లాసుడు నీళ్లతో కాని, లేక వేడి పానీయముతో కాని తీసుకోవచ్చును.


**వీటికోసం క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో'ను వాడండి:** నొప్పి, తల నొప్పి, ఒళ్లు నొప్పి, పంటి పోటు, కీళ్ల నొప్పి, జ్వరముతో కూడిన జలుబు, ఫ్లూ, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరము, గొంతుకనొప్పి.

**మోతాదు:** పెద్దవారికి: రెండు బిళ్లలు, అవసరమైతే మళ్లీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ల, లేక డాక్టర్ సలహా ప్రకారము వేసుకోవలెను.

క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో' ఈ విధంగా పనిచేస్తుంది



బిళ్లలోని అణువు ఎంత పెద్దదిగా వుంటే అంత నెమ్మదిగాను అది ఇముడుతుంది — అందువల్ల మీరు, నొప్పి తగ్గడానికి చాలా సేపు ఆగాలి.




అతి మైక్రోఫైనడ్ చెయ్యబడుట వలన, ప్రతి, క్రొత్త మైక్రోఫైనడ్ ఆస్ప్రో, బిళ్లలోను ఇంచుమించు 15 కోట్ల అతి సూక్ష్మమైన అణువులు వుంటాయి. ఇందువలన, అవి అతి త్వరగా ఇముడి, అతి శీఘ్రంగా నివారణ నిచ్చును.

క్రొత్త మైక్రోఫైనడ్ 'ఆస్ప్రో', నొప్పిని, నివారించుటకు, ఇప్పుడు మీకు లభించే, వాటిలో అతి ఆధునికమైన సాధనము.






క్రొత్త
మైక్రోఫైనడ్
ఆస్ప్రో
అతి శీఘ్రంగా నొప్పిని తొలగించును

బాగతి ఏమిటి?' అన్నట్టు శర్మవంక చూస్తూ మరోసారి 'మ్యావ్!' అంది. శర్మ చేయి విసిరి పిల్లిని బెదిరించాడు. 'బెదరలే!' అన్నట్టు పిల్లి శరీరం కుదించుకుంది—పైన పెంకుల్లో కిచకిచ శబ్దం వినిపిస్తే ప్రేమగా అటు చూసింది—కాని అక్కణ్ణించిమాత్రం కదల్లేదు. శర్మ లేచి కూచుని పుస్తకం విసిరినట్టు నటించాడు. 'హరి కిరాతకుడా!' అన్నట్టు పిల్లి కళ్ళెర్రచేసి, అతన్ని శపిస్తూ అవతలికి వెళ్ళిపోయింది.

శర్మ మళ్ళీ పడుకున్నాడు. 'అసలా ఎలిక ఎలాగూ ఆ పిల్లి నోట్లో పడదే! ఎక్కడయినా పగలు ఎలిక, బెదరినట్టుగా పారిపోతూనే వుంటుంది. అయినా మనిషి ఎందుకని ఎలుకల్ని, పిల్లుల్ని అలా బెదిరిస్తాడు? ఒక్కోసారి మనుషులు చేసే పన్లకు అర్థం వుండదు' అనుకున్నాడు శర్మ. ఒకవేళ ఈ పిల్లికూడా చావదుకదా—శర్మకు భయంవేసింది! ఎలా చస్తుంది? అతనేం దాన్ని కొట్టనుకూడా లేదు. చస్తే చావనీ—చచ్చేవాళ్లను ఎవరూ రక్షించలేరు అనుకున్నాడు శర్మ.

ఈ పాడు ఆలోచనల్ని మానేసి • ఎలాగైనా నిద్రపోవాలనిపించింది శర్మకు. అవతల మంచంమీద భార్య, పిల్లలు నిద్రపోతున్నారు. ఆతను పుస్తకం అవతలపెట్టి, దీపం ఆర్పి పడుకుని కళ్ళు మూసుకున్నాడు...అసలు వస్తూనే పార్వతీశం తనకెందుకు గణపతి వేదాంతంతో పురి ఎక్కించటం? అది గణపతి వేదాంతంకూడా కాదు—చేతకాని ప్రతివాడూ అనాదినుంచి తెరుస్తూన్న ఓ గొడుగు! పోనీ పార్వతీశం అయినా, బావిలో పడితే ఆ బాదంపండు తినే ప్రాప్తం లేదనటమేమిటి? అది గణపతిని ఎగతాళి చెయ్యటమా? మరి తను బాదంపండు తీసి ఇచ్చాడా లేదా? బొక్కెనకు రాకపోతే ఎవరినైనా పిలిచి వరలబావిలోకి దింపి అయినా, ఆ పండునే తీయించి ఇచ్చేవాడే తాను. అంత పట్టుదల కలిగింది అప్పుడు—తలుచుకుంటే శర్మకు నవ్వు వచ్చింది.

ఆ ఉత్సాహంతోనే తను రమ్మీకి బదులు కట్‌థ్రోట్‌బ్రిడ్జి ఆటకు ముక్కలు పంచాడు. కాని అది ఆడాలని 'రాసిపెట్టి వుంది' అని అనకుండా వుండాలిసిందా తను? అంటేమాత్రం—పరీక్షించినట్టుగా తాను ఓడిపోవాలా? కాని నిజానిక్కి తాను గెలవా

# శర్మ వంతు

లని రాసిపెట్టివుందేమోలేనవే అన్నాడు గణపతి. అది—ఎగతాళా? అయితే ఎన్నిసార్లు పార్వతీశం ఎగతాళి చెయ్యలేదు? ఎన్నిసార్లు తాను గణపతి చాదస్తాన్ని ఎగతాళి పట్టించలేదు? కాని గణపతి ఎగతాళిగా అనటం, తాను ఓడిపోతూ రావటంవల్ల పట్టుదల—అదే కసి—పెరిగిన మాటనిజం! ఆ కసిమీదేనా రాయి విసిరింది?

గణపతి చాదస్తం అతని కెప్పుడూ మింగుడు పడకుండానే వుంది. కాని అదొక గొప్ప విషయం అయినట్టు; దాంతో గణపతి బాగుపడుతున్నట్టు, అది తనకు చేతకానట్టు అసూయతో కసి దేనికి? మనుషులు అర్థంలేని కసి పెంచుకుంటా రెందుకో! డబ్బులో, హోదాలో, తెలివితేటల్లో, రూపురేఖల్లో, సాధ్యమయిన ఇతర విషయాలన్నిట్లో సమానులయితేనే కసి వుండదా? లేక మనతో సమానమా అని ఇంకా కసిగా వుంటుందో! మరి ఈ సమానమనేది నేతి బీరకాయలో నెయ్యి! ఇక తక్కువ వాళ్లయితే అసహ్యం—ఎక్కువ వాళ్లయితే గౌరవం, లోపలకసి! ఇదంతా తెలిసిన వాళ్లయితేనే——కొత్త వాళ్లమీద ఎలాగూ గౌరవం వుంటుంది, వాళ్ళ పాతబడే దాకా!

ఎప్పుడు ప్రారంభమైందో వానజల్లు కిటికీలోంచి పడుతుంటే శర్మ చప్పున లేచి కిటికీ మూసి మళ్లీ పడుకున్నాడు.

జ్యోతిష్యంలో సుతరాం నమ్మకం లేని వాళ్ళు కూడా గృహ ప్రవేశాలప్పుడు, పెళ్లిళ్లప్పుడు ముహూర్తం పెట్టిస్తుంటారు! జ్యోతిష్యంలో శర్మకు ఒకటి రెండు దాఖలాలున్నయ్యి. కాని ఈ రాసి పెట్టటమే అర్థం కాకుండా వుంది. ఎవరీ రాసిపెట్టేది—భగవంతుడా—అష్టదిక్పాలకులా—నవగ్రహాలా — ముక్కోటి దేవతలా—శతకోటి నక్షత్రాలా—ఎవరు? ఈరాసి పెట్టటానికి మొదలూ, చివరా ఎక్కడ? మనిషి పుట్టినప్పటినుంచీ మరణించే వరకూ అంతా రాసిపెట్టి వుంటుందా లేక సందర్భాన్ని బట్టి సమయానుకూలంగా రాయబడుతూ వుంటుందా? కలిసివస్తే అదృష్టం, కలిసి రాకపోతే ఖర్మ అవుతూ వుంటుందా? ఒకరి అదృష్టం మరొకరి ఖర్మ కాగలుగుతున్నప్పుడు ఎవరు దేనికి బాధ్యులు? ఏమిటీ మాయ? ఈరాసి పెట్టటం సంఘానికీ, దేశాలకు కూడా వుంటుందా? ప్రపంచంలో, దేశాల్లో, జీవితాల్లో ఇంత అభివృద్ధి కేవలం అదృష్టం, రాసి పెట్టటం వల్లనే జరుగుతోందా? శర్మ లేచి కూచున్నాడు. గణపతి చెప్పేది పట్టి తప్పల తడక——తేలిపోయింది!

...కాని అవాళ హోటల్లో తనచేతిలోంచి జారినగాజు గ్లాసు కిందపడి పగల్లేదు! 'దీనికేమంటావ్?' అని గణపతి రెట్టించాడు. అప్పుడు కొంత ఆశ్చర్యం కలిగినా అదొక చచ్చు ఉదాహరణగా భావించాడు తను. ఆ గ్లాసు ఎందుకు పగిలి వుండక పోవచ్చో తను, పార్వతీశం వాదిస్తే గణపతి అంగీకరించాడు కూడా. కాని ఆ మధ్య ఎవరో చిన్నపిల్ల, రెండో అంతస్థునుంచి పడిపోయి చెక్కు చెదరకుండా బతికి బాగుపడుతూ వుండటం పత్రికలో పడితే, తనే ఆ సంగతి గణపతికి చూపించాడు.

'ఆ పిల్ల ఎలా బతికివుందో చెపుమా?' అని గణపతి అడిగితే, తాను చెప్పలేక పోయాడు. ఆ పిల్ల బతకాలని రాసివుంది!' అని గణపతి, చివరకు సినిమాలో జ్ఞానికి మల్లే చెప్పితే, తను అప్పుడు ఒప్పుకోక తప్పలా, నమ్మకం లేకపోయినా!

అంటే మనిషి మేధకు, వూహకు తెలిసేలా నిదర్శనం కావాలి అన్నమాట! రుజువు లేకపోతే అబద్ధం అంటాడు. వాళలా కనిపిస్తే ఏదో తెలివి కారణం వుందంటాడు——కాని నమ్మడు! మరి ప్రతి దానికీ ఏదో కారణం వుంటుందాయె. అయితే మనకు తెలిసినదాని కంటె తెలియనిదే లక్షరెట్లు వుందంటారు పెద్దలూ, తెలిసిన పిన్నలూ! మరి గణపతి వాదన అందరికీ వర్తిస్తుందా లేక చేసుకున్న వారికి చేసుకున్నంత అవుతుందా? కాని గణపతికా నమ్మకం వుండటానికీ, తన ఎదుట ప్రకటించటానికీ అతని కధికారం లేనట్టుగానే వుంది, తన ప్రవర్తన ఎంత సేవటికీ! శర్మకు నిద్ర రాక పోవటానికి తోడు చిరాకు ఎక్కువయింది — అతను బనీను విప్పి అవతల పడేశాడు!

శర్మ మనస్సు పరిపరి విధాల పోవటం వల్ల శరీరమంతా బిగపట్టి పట్టయింది. గాలికోసం లేచి కిటికీ తెర

తుండగా పక్కన గోడమీద, ముఖాని కెదురుగా బల్లమీద, రేడియం డయలు గడియారం కనిపించింది. అయిదుంబావు! తెల్లారగట్ల అయిదుంబావు? నమ్మలేక గడియారం చెవిదగ్గిర పెట్టుకున్నాడు. గడియారం సలక్షణంగా సాగిపోతోంది!

కిటికీ తెరిచాడు. ఇంకా వాన కురుస్తోంది. కొద్దిగా జల్లు అతనిమీద పడితే హాయిగా వుంది! బయటికి వెళ్లి—చిన్నప్పటిలాగా గెంతులు వేయకపోయినా—హాయిగా కాస్సేపు తడిస్తే? పక్క ఇళ్ల వాళ్లెవరూ ఆ వానలో చూడరు కాని వెలుతురు బాగా రాకుండానే తడవటం మంచిది!

శర్మ కిటికీ మూసి, పైజామా తీసి తువ్వాలు చుట్టుకుని హాలులోకి వచ్చి, దొడ్డితలుపులు తీసి బైటికి వచ్చి, తలుపుల్ని మళ్లీ మూశాడు. శరీరమంతా వానపడి ఇంకా హాయిగా ఒక్కసారి ఝల్లు మనిపించింది. ఆ వానలో కాస్సేపు అటూ ఇటూ తిరిగాడు. చిన్నప్పుడు ప్రతిసారీ గొడుగు పారేసుకోవటం, స్కూలు నుంచి వానలో రావటం—ఆ సరదా జ్ఞాపకం వచ్చింది! అప్పటికి మల్లేనే వానలో స్నానంకూడా చేస్తే? అప్పుడెంతో బాగుండేది—పైగా ఇప్పుడు చివాట్లు పెట్టే వాళ్లుకూడా లేరు. వాన తగ్గుతున్నట్టు వుంది — వెలుతురుకూడా వచ్చేస్తోంది — ఛలో!

శర్మ బావిదగ్గిరి కెళ్ళాడు. బొక్కెన్లో వాననీళ్లు పారబోసి, దాన్ని గిలకమీదగా బావిలోకి వేశాడు. ఎక్కణ్ణించో 'మ్యావ్' మని వినిపించింది. శర్మ నిర్ఘాంతపోయి బావిలోకి చూశాడు. ఆ కొద్ది వెలుగులో తెల్లపిల్లి బావిలో ఈదుతూ కనిపించింది! అతను చూడటం చూసి అది ఇంకోసారి బలహీనంగా అరిచింది. శర్మ గుండె జల్లుమంది. బొక్కెన్ను జాగ్రత్తగా పిల్లిదగ్గిరికి చేర్చాడు. నీళ్లున్న బొక్కెనలోకి చేరక పిల్లి, బొక్కెనపైన తాడును నోటితో కరచుకుంది!


ఆలా పైకి లాగితే సగందూరం వచ్చి, బెదిరి మళ్లీ బావిలోపడితే పిల్లి? ఈసారి తప్పకుండా మునిగి, చచ్చి మరీ తేలుతుంది—కాని తప్పదు! ఓ క్షణం చూశాడు—పిల్లి బొక్కెనతాడు వదల్లేదు

శర్మ పిల్లివంక చూస్తూ బొక్కెన్ను మెల్లిగా పైకి లాగాడు. వర్షంవల్ల గిలక చప్పుడులేదు. ఏ క్షణంలో భయపడి పిల్లి బావిలో పడుతుందోనని అతని భయం! శర్మ లాగుతూవుంటే, తాడును కరచుకున్న పిల్లి ఆ బొక్కెన పక్కగా వేళ్లాడుతూ, బావి బొడ్డుపైకి వచ్చేసింది. ఇక ఆ పిల్లితో ఆ బొక్కెన్ను ఇవతలికి తీయాలి. చేయి చాస్తే పిల్లి భయపడి; ఇంత శ్రమ వృథాకాదు కదా? పిల్లివంక చూస్తూ తీస్తున్న బొక్కెన, పిల్లితో బొడ్డు ఇవతలికి రాగానే శర్మ ఒక్కసారిగా వాటిని బావి చప్టామీద జారవిడకుండా వుండలేకపోయాడు! అంతవరకూ వూపిరి పీల్చకపోవటంవల్ల ఒక్కసారి గాలి పీల్చగానే ఆయాసం వచ్చింది.

శర్మ చూపంతా పిల్లిమీదే వుంది. బొక్కెన వొరిగి నీళ్లు కారిపోయినా, పిల్లి ఆ తాడు వదల్లేదు. దాని భయం దానిది—మరి తియ్యని ప్రాణం! చుట్టూ ఓసారి చూసి నీళ్లు కనిపించక పోగానే, మెల్లిగా నోరు తెరిచి తాడు వదిలింది పిల్లి. లేచినిలబడింది. వళ్లు దులుపుకుంది. యుద్ధంలో గెలిచి విశ్రాంతి చెందిన వీరుడిలా, మెల్లిగా నడిచిపోతోంది!

శర్మకు ఒక్కటే అనుమానం—అది ఎలా బావిలో పడ్డది? చుట్టూ చూశాడు. ఇంట్లో గోడమీదగా పక్కవాళ్ల భాగంలోకిచేరి, ఏదో ఎలికను పట్టుకోబోతూ కిటికీ మీదికెగిరి, పట్టు తప్పి చువ్వల్లోంచి స్నానాల గది రేకులమీదపడి, జారుతూ వచ్చి బావిలో పడివుండాలి—అంతా క్షణంలో అయిపోయివుండాలి. కాని ఏరాత్రివేళ పడ్డదో, ఎప్పటినుంచి బావిలో, వానలో ఈదుతూ అరుస్తోందో—శర్మ వళ్లు జలదరించింది!

వెలుతురు బాగా వచ్చేసింది. ఎప్పుడు వెలిసిందో వానకూడా లేదు—గాలి మాత్రం వీస్తోంది. శర్మకు తాను స్నానానికి రావటం జ్ఞాపకం రాగానే చప్పున చలి వేసింది! మరి ఇంతకూ తాను వచ్చింది—!? అవతల ఆ పిల్లి ఆగుతూ, వళ్లు దులుపుకుంటూ వెళ్లిపోతోంది. ఎవరో తనకు తెలియకుండా తన చేత మహా వాజ్ఞాకుగా పని చేయించుకున్నట్టు వుంది శర్మకు! అతను దొడ్డివాకిలి చేరగానే, లోపల గడియ లేకుండా వున్న తలుపుల్ని ఆశ్చర్యంతో తెరుస్తూ అతని భార్య బయట తుండుగుడ్డతో తడిసి ఏదో ఆలోచిస్తున్న భర్త కనిపించగానే, నిద్ర మొహం అంతా పోయి ముంగురుల్ని వెనక్కు తోసుకుంటూ, చిరునవ్వుతో అందంగా శర్మ వంక చూసింది!



# బతికిఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకురమ్మని శలవునించి తిరిగొచ్చిన అధికారికి ఉత్తర్వు

కొన్నాళ్ళు శలవుపెట్టి, తిరిగి పనిలోకి చేరిన ఒక ఆఫీసరును ఆ శాఖ (అతను పనిచేసే ఆఫీసు) తను బ్రతికేవున్నట్టు ఒక సర్టిఫికెట్టు కూడా జత చేసి పంపమన్నాడట. రెవెన్యూబోర్డు (ఫస్టు) మెంబరు శ్రీ వి. కె. రావు తన స్వానుభవాన్ని గురించి చెబుతూ కొన్నాళ్ళక్రితం తను శలవులో వెళ్ళి, తిరిగొచ్చి, శలవుజీతానికి దరఖాస్తు పెడితే "మీరింకా బ్రతికేవున్నట్టు సర్టిఫికెట్టు దీనితో జతచేసి పంపు"అని ఆ కాగితంపై అధికారులు రాసి తిప్పి పంపేశారని ఆయన అన్నారు. అయినా యిది ఢిల్లీలోనే జరిగిందండి.

* * *

శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ హత్యకేసును పరిశోధిస్తున్న పోలీసు సి. ఐ. డి. శాఖ ఆయన "చెప్పింగు" కనుక్కున్నట్టు ప్రకటించారు. అయితే యింక హంతకులను కనిపెట్టేసినట్టే లెక్క.

* * *

కర్నూలుకు సమీపంలోని వర్ల పంచాయితీ అధ్యక్షుడు శ్రీ పెద్ద హుస్సేన్ రెడ్డిని ఎవరో —(ఎవరు?) కాల్చి చంపేశారట.




## లా చదువుతూ దొంగతనాలా!

పాటియాలలో యువ్నెర్సిటీలో 'లా' చదువుతున్న విద్యార్థి ఒకడు కనీసం లేదంటే నో ఆరు దొంగతనాలు చేశాడట. నో మోటారు సైకిలు దొంగిలిస్తుండగా పట్టుబడ్డాడట. లా పూర్తయ్యాక తను చేసేవి చట్టబద్ధమైన పనులేనని వాదించుకోగలడా అతను?

## మినీస్కర్ట్లూ - లైంగిక నేరాలూ

స్త్రీల అవయవాలను, వాటి వంపు సొంపులను బాహాటంగా చూపి, చకే దుస్తుల (మినీస్కర్ట్ల) వల్ల లైంగిక నేరాలు పెరిగిపోతున్నాయని, 1967 నుంచి తొమ్మిది నెలల లెక్కల ప్రకారం 2,627 'ఆ' రకమైన నేరాలు జరిగాయని టోక్యో పోలీసులు తెలియజేసి, విచారపడింది. ఇది టోక్యోకే గాక సమస్త ప్రపంచానికి వర్తిస్తుంది. మన ఇండియాకి కూడా. (ఐమీన్ ఈ రకం దుస్తుల — నేరాలు.)

## తెల్లారేసరికి గోడలమీద పోస్టర్లు!

కోయంబత్తూరులో కమ్యూనిస్టు చైనా నాయకుడు మావో ప్రవచనాలతోవున్న పోస్టర్లు పట్టణంలో ముఖ్యవీధుల గోడలమీద 20వ తారీఖు తెల్లవారేసరికల్లా అంటించి ఉన్నాయట. ఇది ఎలా ఎవరు అతికించారో అని ఆశ్చర్యపడుతున్నారు. మహాత్ముడు వచ్చి ఇలా [illegible]

## చావు తప్పింది

'ఉజాన్ జ్యోతి' అనే వో చెన్నకాయిలు తిన్న ఫలితంగా బంబుసెర్ అనే చోట (ఫిబ్రవరి 15) వో 51 మంది విద్యార్థులు హాంతువు చేసుకుని వైద్యశాఖ ధర్మమాని చావు తప్పి బయటపడ్డారట.

## విద్యార్థుల అపహరణ

ఆగ్రా జిల్లాలో జాగిగర్ అనే చోట వో హయ్యర్ సెకండరీ హైస్కూలులో ఏడుగురు విద్యార్థులను ఎవరో ఎత్తుకుపోయారు. ఒక స్టేట్ - ప్రయాణీకుల బస్సుమీద అగంతకులు కాల్పులు జరిపి ఆ డ్రయివరు మెహంలో ఏలగదా దాచేసటూ బస్సులోని ప్రయాణీకులను - జూన పద సినిమాకథ విన్నట్లుందిలాంటి వింటే, కదా! కాని నిజం!

## యాత్రికుల గుంపు మీదనుంచి రైలు

పాట్నాకి 80 మైళ్ళ దూరంలో లాభిసెరి స్టేషను ప్రాంతంలో 14 వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఢిల్లీ—హవురా ఎక్స్‌ప్రెస్ యాత్రికుల గుంపుమీదనించి పోయిందట. 17 మంది చనిపోయారని, 12 మంది గాయపడ్డారని లెక్క తేలింది. ఈ రైలు (పట్టాలు దాటుతున్న) యాత్రికులను దున్నుకుంటూ పోయిందట. ఆగ్రహం పట్టలేని జనం స్టేషనుమీద విరుచుకుపడి దానికి తగినంత నష్టం కలుగజేశారు. తంతులను మూటకొనుట, పట్టాల మీద నడచుట ప్రమాదానికి కదా!

## మంచు తుఫాన్‌లో సైనికుల మరణం

శ్రీనగర్ వద్ద మంచు తుఫానులో చిక్కుకుని 14 మంది భారతీయ యుద్ధ సైనికులు చనిపోయారు. వీరి దేహాలు ఎందులో పాతుకుపోయాయట. (బనిహాల్ టనెల్ ప్రాంతంలో) ఈ తుపాను 27, 28 తేదీలలో వచ్చిందట.

## బంగారానికి 25 లక్షలు విమానానికి 10 లక్షలు

106 బంగారు కడ్డీలను సరియైన పత్రాలు లేకుండా తీసుకువచ్చిన కారణాన్ని భారత ప్రభుత్వ కస్టమ్స్‌శాఖ ఒక బి వో ఏ సి (BOAC) విమానాన్ని, ఆ బంగారాన్ని తన అధీనం చేసుకుంది. 25 లక్షల రూపాయలు జరిమానా కట్టి బంగారాన్ని, 10 లక్షల జరిమానా కట్టి విమానాన్ని విడిపించుకోవాలని ప్రకటించింది.

## పదవీవిరమణ— తేలని లెక్క— ఖైదు

పూనమల్లి (పూనదమల్లి అవాలు) సంఘ యూనియన్ పాత అధికారి శ్రీ టి. యస్. కె. చారి పదవీ విరమణ చేసేనాటికి 38,600 రూపాయలు లెక్క తేలలేదని ఆయనను ఖైదు చేశారట.

## లేడీడాక్టర్ కరువైన జిల్లా

బార్మెర్ (దోధపూర్) జిల్లా మొత్తంమీద ఎన్నో ఆసుపత్రులు వున్నాయని, కాని జిల్లా మొత్తం మీద కనీసం ఒక్క స్త్రీ డాక్టరు కూడా లేదని ఇది చాలా విచారణీయమని అన్నారు— రాజ్యసభలో.

## పట్టలేని ఆగ్రహం

కలకత్తా కార్పొరేషన్ వారి సమావేశంలో ఎదురుపార్టీ ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గలేదన్న కోపంతో ఆ ఎదురు పార్టీ కౌన్సిలరు ఆగ్రహం పట్టలేక, వో బావుపాటి పుస్తకాన్ని మేయరుమీదికి విసిరేశారట. ఆ పుస్తకం దెబ్బ తట్టుకోలేని విక్లేసం గాత తగిలిందట. ఇది ఫిబ్రవరి 10 నరిగ్రాం.

—ఫాలాక్షుడు ●



iam fff-i-h

# భార్య



'భార్య'లో శోభన్‌బాబు, వాణిశ్రీ

స్త్రీలని ఆకర్షించగలిగే చిత్రం విజయాన్ని సాధిస్తుంది అని ఇక్కడి చలనచిత్రరంగంలో తరచు వినిపిస్తున్నది. స్త్రీల మక్కువని కనిపెట్టి చిత్రాలని ఆ విధంగా మలచడమూ జరుగుతున్నది. స్త్రీలకి ప్రత్యేకంగా చిత్రాలని నిర్మించే పద్ధతి మంచిదేగాని, జుగుప్సాకరమైన సెక్సీ దృశ్యాలు స్త్రీలని ఆకర్షిస్తాయనుకోవడంలో ఎంత నిజముంది?

భర్తని ప్రత్యక్షదైవంగా ఎంచుకునే భార్యపై విడాకుల చట్టం పప్పులుడకవు అనే ఇతివృత్తంమీద 'భార్య' కథ నడిచింది. నాగభూషణం అమ్మాయిలంటే ఎంత చపలచిత్తంగా వ్యవహరిస్తాడో, అతని భార్య కృష్ణకుమారి అంత పతివ్రత. భర్త ఆమెని చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. విజయలలితతో పరిచయం పెంచుకున్న నాగభూషణం కృష్ణకుమారికి విడాకులిస్తాడు. భర్త సుఖంకోసం సర్వస్వాన్నీ త్యాగం చేస్తుంది భార్య. నాగభూషణం విజయలలితని పెళ్లి చేసుకుంటున్నతరుణం చిత్రానికి క్లయిమాక్సు. ఇక్కడ ఎంతో రసాభాస జరుగుతుంది. చట్టాన్ని గుట్టుగావుంచి, విడాకులు పుచ్చుకున్న భార్యాభర్తలిద్దరూ ఏకమైపోతారు!

కథని రసవత్తరం చేసే మరో రెండు జంటలున్నాయి శోభన్‌బాబు — వాణిశ్రీ, రాజబాబు-రమాప్రభ. శోభన్‌బాబు వాణిశ్రీల పాత్ర రచన సరికొత్త సంవిధానంతో నడిచింది. పెళ్లయ్యేవరకూ వారిద్దరినీ చూసి ప్రేక్షకులు ఎంతో ముచ్చటపడతారు! రాజబాబు ఉపకథ మరువరానిది.

పాత్రలో లేని కొత్తదనాన్ని కృష్ణకుమారి నటన కల్పించింది. ఈ రకం పాత్రల్ని నిర్వహించడంలో ఆమెకి ఆమే సాటి. నాగభూషణం కథానాయకుడు ఎంతో చాతుర్యంతో నటించాడు. శోభన్‌బాబు—వాణిశ్రీలు ఎక్కువ తక్కువలు లేకుండా సరిసమంగా ఘనంగానే నటించారు. ఉపకథలో రాజబాబు అందించిన హాస్యం, రమాప్రభ సహకరించిన విధం - ఎక్కువ ప్రశంసల నందుకుంటుంది. పద్మశ్రీ నాగయ్య, శాంతకుమారి తమతమ పాత్రల్ని ప్రతిభావంతంగా పోషించారు. విజయలలిత అతి శృంగారమైన నటన, వొళ్లు పులకరింపజేసే జ్యోతిలక్ష్మి క్లబ్ డాన్సు చిత్రానికి విశేషాకర్షణలు! రమణారెడ్డి హాస్యం పాత్రోచితంగా వుంది.

భార్య సహనంలోగాని, భర్త తిరుగుళ్లలోగాని, మరది చెయ్యి చేసుకోవడంలోగాని పరిమితం ఉన్నట్లయితే సహజంగా వుండి వుండేది. పతివ్రతామహాత్మ్యాన్ని వెల్లడిస్తూ ఈ సాంఘిక చిత్రంలో కథ సుఖాంతమవడం ఒక ప్రత్యేకత! మరది భర్తని కొట్టినప్పుడు అతను రక్తం కక్కుకుంటున్నా, చనిపోయే అత్తగారికి సేవ చేసిన 'భార్య' ధన్యురాలు!

మాస్టర్ వేణు సంగీతం బాగున్నది. మాటలు అనిసెట్టి రాశారు. కె. యస్. ప్రకాశరావు కట్టుదిట్టమైన దర్శకత్వంలో తయారయిన ఈ చిత్రానికి నిర్మాత ఎం. యస్. రెడ్డి.

—సికరాజు



'మంచికుటుంబం'లో చంద్రమోహన్, విజయశ్రీ.

## సినిమా

ప్రస్తుత కాలంలో ప్రాధాన్యత వహిస్తున్న కొన్ని దురాచారాలను కళ్లకు కట్టినట్లు వెండితెరపై చూపించి, మానవుని మనోప్రవృత్తిని మంచి వైపు త్రిప్పడానికై నిర్మాతలు శ్రీ సుందర్‌లాల్ నహతా, డూండీలు తాము నిర్మించే చిత్రంలో శ్రీ కొసరాజుచే ఒక పాటను వ్రాయించి, పి బి, శ్రీనివాస్‌చే ఇటీవల వాహిని స్టుడియోలో శ్రీ చలపతిరావు సంగీత సారధ్యంలో రికార్డు చేయించారు.

'నిజాన్ని నమ్మదు లోకం
నీతిని మెచ్చదు లోకం
వేషంవేసి—మోసంచేసి
తిరిగేవాడిదే లోకం !'

ఈ పాటను చిత్రంలో కథానాయక పాత్రధారి కృష్ణ పాడాడు తమిళంలో విజయవంతమయిన 'తంగై' చిత్రంలో పద్మశ్రీ శివాజీ గణేశన్ నటించిన యీ పాత్రను తెలుగులో కృష్ణ నటిస్తాడు ఈ చిత్రంలో చందకళ లేడీ డాక్టర్‌గా, రాంమోహన్ యిన్‌స్పెక్టరుగా నటిస్తున్నారు. శ్రీ ఎం మల్లికార్జునరావు డైరెక్టు చేస్తున్నారు.

**'ఇప్పట్లో కుదిరేట్లు లేదు'**

రికార్డింగ్ థియేటర్లో శ్రీ డూండీని కలిసినప్పుడు ఆయనలోని కార్యదీక్ష నిర్మాణంపట్ల వున్న శ్రద్ధ అర్థమైంది ఈ రెండు సుగుణాలు వుండడంవల్లనే ఆయన పట్టిందల్లా బంగారమౌతూ వుంది 'ఫర్జ్' హిందీ చిత్రం బ్రహ్మాండంగా కలెక్టు చేసిందికదా! మరి తర్వాత హిందీ చిత్రం యేదయినా ప్రారంభించే వుద్దేశ్యంలేదా?' అని ప్రశ్నించాను, 'ఇప్పట్లో అది కుదిరేటట్లులేదు హిందీ నిర్మాతలు, పంపిణీదారులు మనవాళ్ల ప్రాజెక్టును కొంత కాలంవరకు ఆమోదించకూడదనే నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలియవస్తుంది' అన్నాడాయన.

* * *

'ఇల్లాలు' చిత్రాన్ని విజయవంతంగా డైరెక్టు చేసిన సంజీవరావు 'అత్తగారు—కొత్తకోడలు' చిత్రాన్ని ప్రేక్షకులకు నచ్చే



'లక్ష్మీనివాసం లో భారతి.

విధంగా కథను మలిచి, 'బిగువయిన సన్నివేశాల్ని సహజంగా చిత్రించి, మోతాదు మించని హాస్యరసాన్ని జొప్పించి రెండు మాసాల వ్యవధిలో చిత్రనిర్మాణాన్ని ముగించాలని ప్రయత్నించిన శ్రీ బాబురావుమాటను నిలబెట్టారు ఇన్‌డోర్ పని అంతా అయిపోయింది మార్చిలో భీమవరంలో ఔట్‌డోర్ ముగించుకొని, ఏప్రిల్‌లో చిత్రాన్ని విడుదల చెయ్యాలనుకుంటున్నట్లు శ్రీ బాబూరావు వెల్లడించారు

* * *

'నేను విలన్‌పాత్రలనే కాదు — కరుణరసాన్ని చిందించే పాత్రలను ప్రతిభావంతంగా పోషించగలను' అని నిరూపించే విధంగా శ్రీ సత్యనారాయణ 'అత్తగారు—కొత్త కోడలు' చిత్రంలో అసమానమయిన నటనను ప్రదర్శించారు.

**'పాత్రలు సరైనవి రావాలి'**

'ఆర్టిస్టుకు పాత్రలు సరయినవి రావాలిగానీ, ఆ పాత్రలకు పరిపూర్ణ న్యాయం చేకూర్చడానికి ఆర్టిస్టు యెంతయినా కృషి చేస్తుంది' అన్నారు శ్రీమతి జమునా రమణారావు యీ మధ్య వీనస్ స్టుడియోలో ఆవిడను కలసినప్పుడు, 'సూర్యచిత్ర నిర్మి

## 18 క్లూలకు తెలుగు అనువాదం

1 కళాకారులు / ఆదర్శవాదులు సాధారణంగా కల్పనావాదులుగాను అవ్యవహారిక జనులుగాను పరిగణించ బడుదురు

2 ఏ సార్వజనిక / మానవీ సమస్య అయినా ఏకాంతంగా ప్రత్యేకించిన యెడల సంతృప్తికరంగా పరిష్కరించ బడజాలదు

3 అన్యాయము మరియు అపరాధిత్వం / క్రూరతనిరంకుశాధికార పద్ధతిలో, అంతర్నిహితమై వుండును

4 మానవులు యంత్రములకంటె ఎక్కువ ప్రమాదకరమైన / విలువైనవారు

5 భారతీయ పరిస్థితి ఆర్థిక / వైజ్ఞానిక అభివృద్ధిని ఆశ్చర్యజనకంగాను అపూర్వంగాను పొందియున్న ఆధునిక దేశాల పరిస్థితికి స్పష్టంగా విభిన్నమై యున్నది.

6 ఏ వ్యక్తియైనా పురుషుడుగాని లేక స్త్రీగాని ఆర్థికంగా / సంపూర్ణంగా అన్యుని పై ఆధారపడిన వారికి అసలైన స్వతంత్రతా మరియు సమానతానందానుభవం లభ్యం కానేరదు

7 శిక్ష / ధర్మంద్వారా జనులకు సక్రమ మరియు ప్రయోజనకారియైన యోచనలు ప్రబలియుండే యెడల నేటి అనేకమైన యుద్ధాలు వైమనస్యాలు అంతరించేవి

8 మనము భారతవర్ష ఆర్థిక భవిష్యత్తు యొక్క మార్గాన్ని రూపొందించ తలంచే మనకు మూడు విశ్వాసములు కావలెను అవి భారతవర్ష భవిష్యత్తు / ప్రజల యందు విశ్వాసం, అర్థశాస్త్రమందు విశ్వాసం మరియు తర్కశాస్త్రమందు విశ్వాసం

9 మన చారిత్రిక / ఆధ్యాత్మిక అజ్ఞానం విభజనకు, పోరాటమునకు, కలహమునకు, యుద్ధమునకు బాధ్యతయై వున్నది

10 స్వాతంత్ర్యం నమ్రతను / బాధ్యతను సమకూరుస్తుంది ఏకఛత్రవాదమును కాదు ఒక్కరి నిరంకుశత్వమును కాదు కాని పలువురి సహనశీలతను సమకూరుస్తుంది.

11 నైతికత / సమృద్ధి యొక్క పతనం మరియు నాశనం భగవత్సంబంధమైన జ్ఞానం పట్ల మానవ నిర్లక్ష్యత వల్లనే సంభవనీయం

12 దుఃఖం / సుఖం ప్రాపంచిక సంసార జీవిత పద్ధతి ననుసరించి యుండును

13 లోకతంత్రం నిదానంగా పెంపొందే మొలక దీనికి ధైర్యం, శాంతి / అభ్యాసం మరియు జీవశక్తి కావలెను

14 మనము మానవకృత ఆర్థిక సంకటంలో చిక్కుపడ్డాము, దీనికి ప్రబల బాధ్యులు మన ప్రణాళికా కర్తలు / రాజనీతిజ్ఞులు అయివున్నారు

15 దేశాభ్యుదయం వ్యవసాయదారుల ఉత్పాదకత / సమృద్ధిపై ఆధారపడియున్నది

16 ఆధునిక ప్రపంచంలో అత్యంత సూక్ష్మంగా యోచించబడిన ప్రణాళికా ప్రయోజనం ప్రచారం / యుద్ధం

17 అన్నిటిని మించిన అత్యుగ్ర నీతిశాస్త్రీయ స్థితి వాస్తవికత / ధార్మికత

18 ఎవరిని పూజించని / హానిపరచని వారు దేనికీ భయపడరు

## No. 30: 18 CLUES

1. Artists / Idealists are generally classed as visionaries unpractical people
2. No Common / Human problem can be satisfactorily tackled in isolation
3. Injustice and Criminality / Cruelty are inherent in a system of totalitarian dictatorship
4. Human beings are more Dangerous / Precious than machines
5. The Indian situation is in glaring contrast with the situation in modern countries where Economic / Scientific progress has been astounding and unprecedented
6. No person man or woman, who is Economically / Entirely dependent on another can ever feel the real pleasure of freedom and equality
7. If sound and beneficial ideas are inculcated through Education / Religion many of the conflicts and dissensions of to day will disappear
8. When we plan the economic future of India we have need for three faiths namely faith in the Future / People of India faith in economics, and faith in logic
9. It is our Historical / Spiritual ignorance that is responsible for division and strife, conflict and war
10. Freedom implies Humility / Responsibility, not absolutism, it implies not the tyranny of the one, but the tolerance of the many
11. Degeneration and decline of Morality / Prosperity are attributed to the neglect of man's knowledge of god
12. Pain / Pleasure is in the very constitution of worldly life
13. Democracy is a plant of slow growth, It needs patience Peace / Practice and staying power
14. We are in the midst of a man made economic crisis for which our Planners / Politicians must take the largest share of responsibility
15. On the Productivity / Prosperity of the cultivators depends the progress of the country
16. The most minutely planned operation in the modern world is Propaganda / War
17. The highest ethical stage is Reality / Religious
18. He who Worships / Wrongs no one fears no one

గమనిక పై క్లూలు భారతీయ గ్రంథకర్తల, పుస్తకముల నుండి తీసుకొనబడినవి అవి పూర్తి వాక్యములు మరియు వేరువేరుగా పూర్తి అర్థవంతమైనవి గ్రంథకర్తలు, వారి పుస్తకముల పేర్లు అఫిషియల్ సొల్యూషన్‌తోపాటు లిట్ క్విజ్ పిక్టోలో ప్రచురించబడును. రు 6,10,000లు పైగా గావంచబడినది.

## సినిహా

మున్నా పెళ్లిరోజు చిత్రంలో కమల సోదరి మణిమాల పాత్రను అమిత శ్రద్ధాసక్తులతో పోషించేందుకు, రెండు పాత్రల మధ్యవున్న విభిన్న మనస్తత్వాన్ని ప్రేక్షకులకు తెలియపరచడానికి ఆ పాత్రలపై మనస్సును కేంద్రీకరింపచేసానండి' అన్నారు

'సంవత్సరానికి రెండు చిత్రాలు'

'రెండు కథలు సిద్ధంగా వున్నాయండి! ఒకటి జానపదం, మరియొకటి సాంఘికం. రెండిటిని జి కృష్ణమూర్తి వ్రాసారు. ఏప్రిల్‌లో పద్మశ్రీ రామారావు నాయకుడిగా నా కుమారుని దర్శకత్వంతో ప్రారంభించి, కాంతారావును పెట్టి జానపదాన్ని మొదలు



'పాపకోసం'లో బేబీ రాణి.

పెడ్తాను' అన్నారు నిర్మాత, దర్శకుడు విఠలాచార్య 'ప్రతి సంవత్సరం విఠల్ కంబైన్స్ బ్యానర్‌లో రెండుచిత్రాలు తప్పకుండా వస్తాయండి' అన్నారు. 'నేను బయటి నిర్మాతలు నిర్మించే చిత్రాలను అరడజనుదాకా డైరెక్టు చెయ్యాల్సివుంది. ఏప్రిల్‌లో మధు వాళ్ళకి చేసిపెట్టాలి. లక్ష్మీనారాయణకు చెయ్యాలి ప్రసాద్ ప్రొడక్షన్స్‌కు ప్రారంభించాలి ఇవి గాక నిర్మాతలు ఒకరిద్దరు వచ్చిపోతున్నారు. మనపై నమ్మకం పెట్టుకున్నవాళ్ళని మనమేగదండి చూడాలి' అన్నారు చిరుమందహాసం చేస్తూ విఠలాచార్య.

# * ఒకేసారి 3 బహుమతులు గెలుచుకోండి!
# * ఫిలిప్స్ మర్ఫీ అదనము!

ఆఖరు ముగింపు తేది: 13—3—68.
సొల్యూషన్ భారత్‌జ్యోతిలో: 17-3-68
సొల్యూషన్ ఆంధ్రప్రభ లో: 19-3 68.
ఫలితాలు భారత్ జ్యోతిలో: 31 3-68.
* సొల్యూషన్ వెంటనే పొందుటకు 6 పైసల స్టాంపు, స్వంత అడ్రసుగల కార్డును వెంటనే పంపవలెను. * లిట్‌క్విజ్ పీక్లి 10 సం॥ కలకు రు 2/- పంపవలెను. * మీ ఎంట్రీలను తేది 12 3-68 బుధవారమునాడు కూడా పంపవచ్చును. కాని వాటిని ఎక్స్‌ప్రెస్ డెలివరీలో పంపవలెను.



—— లిట్ క్విజ్ నెం. 30 అధికార ఎంట్రీ ఫారము ——

ADDRESS · LITQUIZ No 30, ALANKAR, BALARAM STREET, BOMBAY-7. (W B)

గమనిక: (1) ఒక్కొక్క కాలంలో మీరు వద్దనే పదమును కొట్టివేయండి. (2) ఒక కూపన్‌మాత్రం పంపినచో ఇతర కూపనులను కొట్టివేయండి. (3) ఎంట్రీరుసుము M.O. ద్వారా పంపినచో, పోస్టాఫీసునుండిపొందిన M.O. రసీదును ఎంట్రీ ఫారమునకు జతపరచవలెను. M. O రసీదు లేని ఎంట్రీలు నిరాకరింపబడును. (4) I. P. O. క్రాస్ చేయవద్దు. అది లిట్‌క్విజ్ నెం 30 బొంబాయి-7 వారికి చెల్లించునట్లు ఉండవలెను.

| No. | 1 | | 2 | | 3 | | 4 | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ARTISTS | IDEALISTS | ARTISTS | IDEALISTS | ARTISTS | IDEALISTS | ARTISTS | IDEALISTS |
| 2 | COMMON | HUMAN | COMMON | HUMAN | COMMON | HUMAN | COMMON | HUMAN |
| 3 | CRIMINALITY | CRUELTY | CRIMINALITY | CRUELTY | CRIMINALITY | CRUELTY | CRIMINALITY | CRUELTY |
| 4 | DANGEROUS | PRECIOUS | DANGEROUS | PRECIOUS | DANGEROUS | PRECIOUS | DANGEROUS | PRECIOUS |
| 5 | ECONOMIC | SCIENTIFIC | ECONOMIC | SCIENTIFIC | ECONOMIC | SCIENTIFIC | ECONOMIC | SCIENTIFIC |
| 6 | ECONOMICALLY | ENTIRELY | ECONOMICALLY | ENTIRELY | ECONOMICALLY | ENTIRELY | ECONOMICALLY | ENTIRELY |
| 7 | EDUCATION | RELIGION | EDUCATION | RELIGION | EDUCATION | RELIGION | EDUCATION | RELIGION |
| 8 | FUTURE | PEOPLE | FUTURE | PEOPLE | FUTURE | PEOPLE | FUTURE | PEOPLE |
| 9 | HISTORICAL | SPIRITUAL | HISTORICAL | SPIRITUAL | HISTORICAL | SPIRITUAL | HISTORICAL | SPIRITUAL |
| 10 | HUMILITY | RESPONSIBILITY | HUMILITY | RESPONSIBILITY | HUMILITY | RESPONSIBILITY | HUMILITY | RESPONSIBILITY |
| 11 | MORALITY | PROSPERITY | MORALITY | PROSPERITY | MORALITY | PROSPERITY | MORALITY | PROSPERITY |
| 12 | PAIN | PLEASURE | PAIN | PLEASURE | PAIN | PLEASURE | PAIN | PLEASURE |
| 13 | PEACE | PRACTICE | PEACE | PRACTICE | PEACE | PRACTICE | PEACE | PRACTICE |
| 14 | PLANNERS | POLITICIANS | PLANNERS | POLITICIANS | PLANNERS | POLITICIANS | PLANNERS | POLITICIANS |
| 15 | PRODUCTIVITY | PROSPERITY | PRODUCTIVITY | PROSPERITY | PRODUCTIVITY | PROSPERITY | PRODUCTIVITY | PROSPERITY |
| 16 | PROPAGANDA | WAR | PROPAGANDA | WAR | PROPAGANDA | WAR | PROPAGANDA | WAR |
| 17 | REALITY | RELIGIOUS | REALITY | RELIGIOUS | REALITY | RELIGIOUS | REALITY | RELIGIOUS |
| 18 | WORSHIPS | WRONGS | WORSHIPS | WRONGS | WORSHIPS | WRONGS | WORSHIPS | WRONGS |

SEND FIRST TWO COUPONS & ENTER MINIQUIZ (A) FREE — SEND FOUR COUPONS & ENTER BOTH MINIQUIZ (A & B) FREE

30

BLUES FREE COUPON (MINIQUIZ A)

| | |
|---|---|
| ARTISTS | IDEALISTS |
| COMMON | HUMAN |
| CRIMINALITY | CRUELTY |
| PROPAGANDA | WAR |
| REALITY | RELIGIOUS |
| WORSHIPS | WRONGS |

BLUES FREE COUPON (MINIQUIZ B)

| | | | |
|---|---|---|---|
| DANGEROUS | PRECIOUS | HUMILITY | RESPONSIBILITY |
| ECONOMIC | SCIENTIFIC | MORALITY | PROSPERITY |
| ECONOMICALLY | ENTIRELY | PAIN | PLEASURE |
| EDUCATION | RELIGION | PEACE | PRACTICE |
| FUTURE | PEOPLE | PLANNERS | POLITICIANS |
| HISTORICAL | SPIRITUAL | PRODUCTIVITY | PROSPERITY |

**30** (ASVP)

ఈ క్విజ్ ప్రవేశమునకు చెందిన నిబంధనలను షరతులను పాటించుటకు అంగీకరిస్తున్నాము. మరియు కాంపిటీషన్ ఎడిటరు గారి నిర్ణయమును తుది నిర్ణయముగాను, న్యాయబద్ధమైనదిగాను అంగీకరించుటకు ఆమోదిస్తున్నాను. ప్రతి కూపనుకు ఎంట్రీ ఫీజు రు. 1/-. ఈ పూర్తి ఎంట్రీ ఫారము (4 కూపనులు) ఫీజు రు. 4/-. M. O. రసీదు/I.P.O./లిట్‌క్విజ్ క్యాష్ రసీదు/ప్రైజు కార్డు జతపరుస్తున్నాను. వాటి నెం..........

CAPITAL LETTERS

NAME ..............................................

ADDRESS ..............................................

..............................................

—— ఈ పూర్తి ఫారమును కత్తిరించి పంపవలెను ——

మినిక్విజ్ (బి): నాలుగు కూపనులు పంపువారు మాత్రమే మినిక్విజ్ (బి) పంపుటకు అర్హులు. మినిక్విజ్ (బి) యందు ఆల్ కరెక్టు విజేతకు బహుమతితో పాటు ఫిలిప్స్ ట్రాన్సిస్టరుకూడా యివ్వబడును. (మోడల్ విజేతల సంఖ్యపై ఆధారపడి యుండును.) ట్రాన్సిస్టర్లతో చేరి బహుమతి మొత్తం రు 5000/- లిట్‌క్విజ్ నెం. 28 లో ఆల్ కరెక్టు ఎంట్రీ ఒకటి కూడా రాలేదు. ఒక తప్పుతో 7 గురు గెలుపొంది-ఒక్కొక్కరు రు. 2286 బహుమతి పొందిరి.

## శ్రీమతి అయిన నటి దేవిక


ప్రముఖ కథానాయికల్లో ఒకరిగా ప్రేక్షకులచే గుర్తింపబడ్డ కుమారి దేవిక చడీ, చప్పుడు లేకుండా గత వారంలో శ్రీమతి అయింది. ఈమెను పరిణయమాడిన వ్యక్తి ఇంజనీరూ కాదు, డాక్టరూ కాదు, పెద్ద వ్యాపారి కాదు, శ్రీమంతుడూ కాదు, సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన సద్గుణ సంపన్నుడూ, దేవదాస్ నామధేయుడూ. వీ రిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గత రెండు సంవత్సరాలుగ వీ రిద్దరిమధ్య ప్రేమానురాగాలున్నా, పెళ్లి జరిగింది యిటీవలనే. శ్రీ దేవదాస్

## సినిమా

ప్రముఖ దర్శకుడు భీంసింగ్‌కు సహాయకుడిగా వుండేవారు ఇప్పుడు సర్వోత్తమా నిర్మించే చిత్రాన్ని డైరెక్టు చేస్తున్నారు 'పళని' చిత్రం యొక్క షూటింగు జరుగుతూ వుండే రోజుల్లో వీ రిద్దరి మధ్య ప్రేమ అంకురించింది.

* * *

'చిలకా—గోరింక' చిత్రంలో కథానాయకుడిగా నటించిన కృష్ణంరాజు సుజాత చిత్ర నిర్మిస్తున్న 'నాన్' తెలుగుచిత్రంలో దుష్టనాయక భూమికను ధరిస్తున్నారు. తమిళంలో మనోహర్ వేసిన వేషాన్ని



'తారాశశాంకం'లో దేవిక.

తెలుగులో కృష్ణంరాజు వేస్తున్నాడు. శ్రీ మల్లికార్జునరావు, శ్రీ బాబ్జీలు కలిసి నిర్మిస్తున్న యీ చిత్రాన్ని శ్రీ వి. రామచంద్రరావు డైరెక్టు చేస్తున్నారు. ముఖ్యపాత్రలను కృష్ణ, కాంచన, కృష్ణంరాజు నాగభూషణం ధరిస్తున్నారు. శ్రీ కోదండపాణి సంగీత సారథిగా నియమింపబడ్డారు. ఈ మధ్యన శ్రీమతి సుశీల, బాలసుబ్రమణ్యం పాడిన ప్రేమగీతాన్ని, శ్రీమతి జానకి పాడిన మరియొక పాటను రికార్డు చేసారు

### వేళాకోళంచేస్తే ఏడిపించినఅమ్మాయి

హీరో కృష్ణను, కాంచన ఏడ్పించే ఒక తమాషా పాటను శ్రీ నారాయణరెడ్డి 'నాన్' చిత్రానికి బహు చక్కగా వ్రాసారు. ఆ పాటకు కోదండపాణి కమ్మటి 'ట్యూన్'ను వినిపించారు. ఆ ట్యూనుకు తగ్గట్టు శ్రీమతి జానకి తన మృదుమధురమయిన స్వరంతో పాటను రక్తి కట్టించింది

'నేనే వున్నాను — నీ కోసం ఎదురు
చూస్తున్నాను,
నువ్వే, నువ్వే, నన్ను చేరుకోవా
నా కళ్లలోన నీ కళ్లు దాచి;
అందాలు దోచుకోవా!'

'నాన్' తెలుగు చిత్రంలో కృష్ణ నాయకుడు. అతడు తమ్మ్రదిలోన షికారు

## సినిమా డైరీ

● ప్రముఖ హిందీతార షర్మిళాటాగూర్ క్రికెట్ వీరుడు పటౌడీ నవాబుని నవంబరులో వివాహమాడటానికి నిశ్చయించింది. ఇంతవరకు తాను అంగీకరించిన చిత్రాలను నవంబరులోగా ముగించి యిచ్చేసి, నెమ్మదిగా గృహస్థ ధర్మాన్ని నలుగుపాదాల ఆచరించడానికి నిర్ణయించింది.

● పూమాళ్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న శుస్తున్‌కేర్ చిత్రంలో రవిచంద్రన్, జయలలిత ముఖ్యపాత్రధారులు. శ్రీధర్ దర్శకత్వంలో యీ చిత్రంయొక్క షూటింగు ఫిబ్రవరి 14 న ప్రారంభిస్తుంది

● కె సి ఫిలింస్ నిర్మించే ఉన్నతన్ కలర్ చిత్రంలో నాయికగా వాణిశ్రీ నటిస్తోంది. శ్రీ ఎం జి ఆర్ నాయకుడిగా నిర్మింపబడే ఈ చిత్రానికి తాపీ చాణక్య దర్శకుడు

● బాబూ మూవీస్ చిత్రంలో జమున, కృష్ణ నాయిక, నాయకులుగా నటిస్తున్నారు. శ్రీ కె విశ్వనాథ్ డైరెక్టు చేస్తున్నారు.

● శ్రీ డి మధుసూధనరావు, వి మధుసూధనరావులు కలిసి సారథి స్టూడియో చిత్రానికి పని చేస్తున్నారు.

● శ్రీ డి యోగానంద్ వర్మాగారి పిక్చర్స్ అనే నూతన నిర్మాణ సంస్థను స్థాపించారు. వీరి మొదటి చిత్రంలో జయలలిత, పద్మశ్రీ రామారావు నాయికి, నాయకులు

● నవభారత్ ఫిలింస్ చిత్రాన్ని శ్రీ జి విశ్వనాథం డైరెక్టు చేస్తున్నారు. రాజశ్రీ, కాంతారావు నాయిక, నాయకులుగా నటిస్తున్న యీ చిత్రాన్ని శ్రీపూర్ణచంద్రరావు గోల్డెన్ స్టూడియోలో నిర్మిస్తున్నారు

● 'మంచిసాటి' నారన్ దర్శకత్వంలో ఎం జి ఆర్ ప్రప్రథమంగా నటిస్తున్నారు. ఇందులో కథానాయిక వాణిశ్రీ

● విజయా మూవీస్ నిర్మించే చిత్రంలో పద్మశ్రీ రామారావు నటించేందుకు అంగీకరించారు.

● "ప్రజాపతిత్ర నిర్మిత చిత్ర గ్రై" చిత్రంలో తమిళంలో నాగేష్ ధరించిన పాత్రను తెలుగులో రాజబాబు ధరిస్తున్నారు

● ప్రముఖ హాస్య నటుడు శ్రీ చలం నిర్మిస్తున్న చిత్రంలో కృష్ణ, హరనాథ్, శోభన్‌బాబులు నాయకులుగా నటిస్తున్నారు

● ఎస్ వి ఎస్ ఫిలింస్ చిత్రంలో పద్మశ్రీ రామారావు, దర్శకుడు కె విశ్వనాథ్‌లు కలిసి పని చేస్తున్నారు

● పద్మశ్రీ బిరుదాన్ని పొందిన ముగ్గురు కళాకారులయిన శ్రీయుతులు శంకర్, జైకిషన్, శ్రీమతి వైజయంతిమాల "[illegible]" చిత్రంలో కలిసి పని చేస్తున్నారు

"తిరుమాల్ పెరమై" చిత్రంలో పద్మశ్రీ శివాజీగణేశన్ విప్రనారాయణస్వామిగా నటించారు.

వెళ్తూవుండేప్పుడు అందమయిన అమ్మాయిల గుంపు కన్పిస్తుంది పిల్లను మొదట్లో ఏడిపిస్తాడు. దానికి బదులుగా కాంచన పై విధంగా వేళాకోళం చేస్తుంది.

**'పరిశ్రమ వదలిపోదల్చుకోలేదు'**

'ప్రయివేటు మాస్టారు' చిత్రంలో నాయకుడిగా నటించి ప్రేక్షకుల అభిమానాన్ని అమితంగా పొందిన రాంమోహన్ అజంతా ఆర్ట్సు 'తల్లి ప్రేమ'లో పద్మశ్రీ రామారావు తమ్ముడిగా చాల బాగా నటించినట్లు రష్షెస్ చూసినవారి అభిప్రాయం. పిక్చర్‌లో కొంత భాగాన్ని చూచి, రాంమోహన్‌ను అభినందించేందుకు అతగాడి దగ్గర కెళ్ళాను. అప్పుడే నిద్ర లేస్తూవున్న రాము నన్ను సాదరంగా ఆహ్వానించి కుశల ప్రశ్నల అనంతరం తాను 'శ్రీరామకథ'లో లక్ష్మణుడిగా నటిస్తున్నట్లు చెప్పారు. 'తంగై'లో ఇనెస్పెక్టరుగాను, అజంతా ఆర్ట్సులో జానపద నాయకుడిగానూ నటిస్తున్నట్లు వెల్లడించారు 'నేను యీ పరిశ్రమను వదలిపోను — పోదల్చుకోలేదు, ఏనాటికయినా నేనెంత, నా నటనవిలువెంత? అని నిరూపించుకోగలననే నమ్మకం 'ప్రయివేటు మాష్టారు' చిత్రం యేర్పరిచింద'ని వ్యక్తపర్చారు. అతని విశ్వాసం, దీక్ష, పట్టుదల, దృఢసంకల్పం తప్పక అతనికి మంచి భవిష్యత్తును అందిస్తాయి.

**అనివార్యమైన మార్పు**

నవజ్యోతి పిక్చర్స్‌లో కథానాయిక మార్పు అనివార్యమయినట్లు, కాంచన కాల్‌షీట్లు తమకు దొరకడం కాస్త అడ్డు తగలడంవల్ల, విజయ నిర్మలను నియమించాల్సివచ్చినట్లు నిర్మాతలు సాంబశివరావు, వందనం వ్యక్తపర్చారు. ఆర్టిస్టు, నిర్మాత ఒకరినొకరు అర్థం చేసుకొని యీ అంగీకారానికి వచ్చినట్లు తెలిసి చాల సంతోషించాను ఈ చిత్రం వేసుకున్న షెడ్యూలు ప్రకారం జరుగుతూవుంది. శ్రీ తాతినేని రామారావు దర్శకత్వంలో హరనాథ్, విజయనిర్మల, రాజనాల, రాజబాబు, విజయలలిత రావికొండలరావు, సత్యనారాయణ ముఖ్యపాత్రలను పోషిస్తున్నారు శ్రీ చలపతిరావు వినిపించే సంగీతం ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తుంది.

* * *



'జీవితచక్ర'లో కాంచన

## మీకు తెలుసా?

నటి కాంచనకు రంగు, రంగుల చీరెలంటే చాల యిష్టం.

వాణిశ్రీకి వెక్కాయ (పచ్చిది కాదు!) వుంటే చాలు భోజనంకూడ అక్కర్లేదు.

నటి రాజశ్రీకి గ్రేసీ అని మరియొక పేరు వుంది

శ్రీమతి సావిత్రిగణేష్‌కి నిత్యజీవితంలో మేకప్ చేసుకునేందుకు ఇష్టం లేదు.

పద్మశ్రీ రామారావు యింటికి ప్రతిరోజా వందమంది అభిమానులు వచ్చిపోతూ వుంటారు.

పద్మశ్రీ నాగేశ్వరరావుకు పాండిచ్చేరిలోని ఒక సంస్థలో భాగం వుంది

రమాప్రభకు ముక్కుమీదవుంటుంది కోపం; కానీ మనస్సు చాల సున్నితమయినది

హాస్యనటుడు రమణారెడ్డికి మ్యాజిక్ చెయ్యడం అంటే మంచినిళ్ళప్రాయం.

శ్రీ రేలంగికి తాడేపల్లిగూడెంలో ఓ సినిమా థియేటరు వుంది.

ప్రసాద్ ఆర్ట్సు పిక్చర్స్ 'బ్రహ్మచారి' బాగా వసూలు చేస్తున్నట్లు నిర్మాత శ్రీ ఎ. వి సుబ్బారావు తెలియచేసారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కేంద్రాలలో యీ చిత్రం అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకర్షిస్తూవుందని, తన చిత్రాలపట్ల ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలకు తాను సర్వదా కృతజ్ఞుడిగా వుండగలనని వెల్లడించారు. మన మనస్సు మంచిదయితే, మనం చేసే పనికూడ బాగానేవుంటుంది, మంచి ప్రతిఫలాన్నే యిస్తుంది అని నిర్ణయించడానికి శ్రీ ఎ వి సుబ్బారావు ప్రత్యక్ష సాక్షి. వీరి తర్వాతి చిత్రం జూన్‌లో ప్రారంభింపబడుతుంది

**తెలుగులో చక్రతీర్థ**

'చక్రతీర్థ' కన్నడ చిత్రం 15 వారాలకు పైగా ప్రదర్శింపబడింది. శ్రీ పేకేటి యశోపరంపరలను తెచ్చిపెట్టింది. దర్శకుడిగా తన ప్రతిభను చూపెట్టి 'ఏస్ డైరెక్టరు' అని మొదటి చిత్రంతోనే రుజువుపర్చుకున్నాడు. ఇప్పుడు అదే చిత్రాన్ని శ్రీ దేవిప్రొడక్షన్స్ బ్యానర్‌లో తెలుగులో జయంతి ద్విపాత్రాభినయంలో పేకేటి దర్శకత్వంలో మార్చి నెలలో సెట్సుకు వెళ్ళబోతుంది నాయకుడిగా జగ్గయ్య నటిస్తారు వీరుగాక హరనాథ్, గుమ్మడి అంజలీదేవి ముఖ్యపాత్రలను పోషిస్తారు.

**ఇతరభాషలలో...**

శ్రీమతి సావిత్రిగణేష్ 'చక్రతీర్థ' తమిళ హక్కులను కొన్నారు. హిందీలో శ్రీ బి. ఆర్. చోప్రా నిర్మించవచ్చు అని పేకేటి వెల్లడించారు శ్రీ పేకేటి గత మూడు దశాబ్దాలుగా సినీరంగంలోని అన్ని శాఖల్లో శ్రమించి, విశేషానుభవం గడించారు.

**'ఈసారి మంచి సాంఘికం'**

'గోల్లభామ'ను 'భామావిజయం'గా నిర్మించిన శేఖర్ ఫిలింస్ ప్రస్తుతం కథలను యెన్నుకునే ఘట్టంలో వున్నారు. 'తగిన కథ దొరకగానే నటీ, నటులను నిర్ణయించేసుకుని ఏప్రిల్‌లో సెట్సుకు వెళ్ళాలని, బహుశా ఈసారి ఒక మంచి సాంఘికాన్ని నిర్మించగలమేమోనని నిర్మాతల్లో ఒకరయిన శ్రీ సాంబశివరావు తెలియచేసారు.

—శ్రీనివాస్

అటీ-ఇటీ...

# మద్రాసులో మరొక అందాల పోటీ

ఆంగ్ల పక్షపత్రిక ఫెమినా, అలంకరణ సాధనాల తయారీ సంస్థ ఇ కె పాలిస్ కర్టిస్‌వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న మిస్ ఇండియా ప్రాంతీయ ఎన్నిక పోటీ ఒ మద్రాసులోని సఫైర్ థియేటరులో జరిగింది

మొత్తం 9 కేంద్రాలలో నిర్వహించబడుతున్న ప్రాంతీయ ఎన్నికలలో గెలుపొందిన అందగత్తెలు మార్చి 30వ తేదీన బొంబాయిలో జరిగే మిస్ ఇండియా పోటీలో పాల్గొంటారు మిస్ ఇండియాగా ఎన్నికైన సుందరి జూన్‌లో ఫ్లోరిడాలోని మియామిలో జరిగే 'విశ్వసుందరి' పోటీలో పాల్గొంటుంది బొంబాయిలోనూ, మియామిలోనూ జరిగే అందాల పోటీకి ఎన్నికైన అమ్మాయిల రాకపోకలకు, బసకీ, ఆహార విహారాదులకి అయే ఖర్చు మొత్తాన్ని పోటీ నిర్వాహకులే భరిస్తారు

మద్రాసులో జరిగిన అందాల పోటీకి ప్రధాన అతిథిగా మద్రాసు ఆహారమంత్రి శ్రీ ఎ. ది యుళగన్ వచ్చారు మిస్ ఫెమినాగా ఎన్నికైన కుమారి సోనియా సాసే శిరస్సుపై కిరీటాన్ని శ్రీమతి మదియుళగన్ అలంకరించారు

ఈ పోటీలో రన్నర్స్ అప్‌గా కుమారి మీనాక్షి సింగ్, కుమారి పెర్సిస్ వకీల్‌లు వరుసగా వచ్చారు

ఈ అందాల పోటీతో పాటు ఆకర్షణీయమైన ఫేషన్ షో కూడా నిర్వహించారు ప్రముఖ వస్త్రాల తయారీ సంస్థలు తాము రూపొందించిన వివిధరకాల వస్త్రాలని మొత్తం 108 ఫేషన్‌లలో ప్రదర్శించారు

# అంతర్జాతీయ ప్రదర్శనలో అమర్‌జోతి ఫాబ్రిక్స్

భారత అంతర్జాతీయ వాణిజ్య పరిశ్రమల ప్రదర్శనలో అమర్‌జోతి ఫాబ్రిక్స్ ప్రదర్శనశాల అన్నితరగతుల ప్రేక్షకులని ఆకట్టుకొనే విధంగా రూపొందించబడింది

1940లో శ్రీ పి. దొరస్వామిగౌండర్ అమర్‌జోతి ఫాబ్రిక్స్‌ని కరూర్‌లో స్థాపించారు. చేతితో నేసిన వారి దుప్పట్లు, టేబుల్ క్లాత్, దిండు గలీబులు, ఫాన్సీ టవల్స్, చీనా ఎంబ్రాయిడరీ చీరలు మొదలైనవన్నీ దేశం అంతటా ప్రాముఖ్యాన్ని పొందాయి

దాదాపు 1800 మగ్గాల ద్వారా తయారవుతున్న అమర్‌జోతి ఫాబ్రిక్స్‌వారి ఉత్పత్తి దేశంలోని వివిధ ప్రాంతాలకి సరఫరా చేయడమే కాకుండా తూర్పుఆఫ్రికా, మధ్యప్రాచ్యదేశాలు, ఆగ్నేయ ఆసియా, ఇంగ్లండ్‌లకి కూడా ఎగుమతి చేస్తున్నారు

మద్రాసు, బొంబాయి, ఢిల్లీలలోనే వీరి బ్రాంచి కార్యాలయాలు ఉన్నా, దేశంలోని ఏ ఒక్క జిల్లా వీరి ప్రాతినిధ్యం లేకుండా విస్మరింపబడలేదు

మద్రాసులోని అంతర్జాతీయ ప్రదర్శనలోని అమర్‌జోతి ఫాబ్రిక్స్ ప్రదర్శనశాలలో చూపరుల్ని విరివిగా ఆకర్షించేందుకు బహుమతి పథకాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేశారు. పది రూపాయలు, అంతకి ఎక్కువ విలువగల అమర్‌జోతి ఫాబ్రిక్స్ ఉత్పత్తులని కొన్నవారిలో అదృష్టశాలులకి ట్రాన్సిస్టర్, వర్‌బ్లాంకెట్, టేబుల్ ఫాన్, కుక్కర్, చీనా ఎంబ్రాయిడరీ చీర, ఫాన్సీలైట్, ఎలక్ట్రిక్ ఇస్త్రీపెట్టె, అమర్‌జోతి దుప్పట్ల జత, దివాన్ కంబళి, అమర్‌జోతి ఫాన్సీటవల్స్ జత (మొత్తం పది బహుమతులు)లలో ఏదో ఒకటి లభించే అవకాశం ఉంది ప్రదర్శన ఆఖరిరోజు పెద్దల సమక్షంలో జరిగే లాటరీ ఆ అదృష్టవంతుల్ని నిర్ణయిస్తుంది.

—మాధవ్ ●



మద్రాస్‌లో జరిగిన మిస్ ఫెమినా పోటీలో ఎన్నికైన కుమారి సోనియా సాసే తలమీద శ్రీమతి మదియుళగన్ కిరీటాన్ని అలంకరిస్తున్న దృశ్యం. బహుమతుల నందజేస్తున్న మద్రాసు ఆహారమంత్రి శ్రీ మదియుళగన్‌ని కూడా యిందులో చూడవచ్చు.

---

# ధర్మపథం

(14-వ పేజీ తరువాయి)

సమయానికి శ్రీరాముడు తులసీదాసు ఆశ్రమ ప్రాంతానికి వస్తాడని చెప్పాడు.

తులసీదాసు ఆ సమయంకోసం కాచుకుని వున్నాడు సమయం దాటిపోయింది గాని, శ్రీరాముడు రానూ లేదు, దర్శనం యివ్వనూ లేదు అశ్వారూఢుడై ఒక నవాబు కుమారుడు మాత్రమూ మార్గమున పోయెను

తులసీదాసు తిరిగి వృద్ధవేషంలో ఉన్న హనుమను కలుసుకుని తనకు శ్రీరాముని దర్శనం లభించలేదని వాపోయాడు హనుమ నవ్వుతూ 'పిచ్చివాడా! ప్రభువు నీ దగ్గరకు వస్తే, నీవు సత్కరించకుండా ఉపేక్ష చేశావు ఇప్పుడు విచారిస్తే లాభం యేమిటి? అశ్వారూఢుడైన నవాబు కుమారుడే శ్రీరాముడు! ఆయన తనకు నచ్చినరూపంలో వస్తాడు ఆయనను గుర్తుపట్టే బాధ్యత మనదే! 'నేనే రాముడను' అని ఆయన చెప్పుకోవడం జరగదు' అన్నాడు.

'మారు వేషంలో వస్తే నావంటి అల్పజ్ఞుడు ఎలా తెలుసుకుంటాడు? ఆయన యదార్థ రూపంలోనే దర్శన మిచ్చేటట్లు అనుగ్రహించాలి' అని మళ్ళీ ప్రార్థింపడ్డాడు, తులసీదాసు.

ఎలాగైతే నేమి, హనుమంతుడు అనుగ్రహించాడు. తర్వాత తులసీదాసుకు తాను కోరిన రూపంలో శ్రీరాముని దర్శనం లభించింది.

వినోదం కోసం భక్తులను ఒక ఆట ఆడింపడమూ భగవంతుని విలాసమే! ●

# పుస్తకాలు

## విశ్వనాథం (నవలిక)

శ్రీ ఆకుండి నారాయణ మూర్తి రచన. (క్రౌన్ ఆక్టేవో 154 పేజీలు. వెల: రు. 3—25. ప్రచురణ: బృందావన్ పబ్లిషింగ్ హౌస్, మారిస్ పేట, తెనాలి.

మనస్సు కోతివంటిదన్నారు. అందులోనూ బ్రహ్మచారి మనస్సు మరీని.

ఈ నవలలో విశ్వనాథం అలాంటివాడే. చదువుకున్నవాడు, తెలివయినవాడు, స్ఫురద్రూపి, అందగాడు. ఇన్ని సుగుణాలకూ తీసిపెట్టుగా అతనిలో ఒకేఒక లోపమున్నది— మనో దుర్బలత. అతన్ని ఎవరే దృష్టితో చూసినా సరే, అతని దృష్టి మాత్రం ఒక్కటే— వాళ్ళు తనని ప్రేమించేస్తున్నారేమోనని. అదే అతని భయం, జంకు, బెరుకు.

మొదట్లో రాధ పొరబడినా, విశ్వనాథం మనస్సు గ్రహించిన మీదట తప్పుకుంది. సుజాతని అంచనా వెయ్యటంలో అతనే పొరబడ్డాడు.

లక్ష్మి మనస్ఫూర్తిగా విశ్వనాథాన్ని ప్రేమించింది. అయినా అతని మనస్సు నిలకడ లేదు. దృష్టి భారతి మీదికి వాలింది. అక్కడా దెబ్బ తిన్నది. భారతికోసం లక్ష్మి త్యాగం చెయ్యటానికి సిద్ధపడింది, కాని, ఓడిపోయింది. లక్ష్మినీ విశ్వనాథాన్నీ కలపగలిగే అదృష్టం భారతికే దక్కింది.

భారతి, సుజాత— ఇద్దరికిద్దరూ ఈ నవలలో గొప్ప పాత్రలే. ఉదాత్తమయిన వ్యక్తులే. వీళ్ళని విలువ కట్టడంలో విశ్వనాథం పొరపాటువల్ల ఈ పాత్రలకు ఇంకా విశిష్టత, చేవ, మరింత గౌరవమూ చేకూరాయి.

ఇంటిలో వచ్చే ఏడేళ్ళ అమ్మాయి రాధ ముచ్చటయిన చిలిపి మాటలతో, అల్లరి చేష్టలతో కళ్ళముందు కట్టినట్టు వుంటుంది.

విశ్వనాథం చావు బతుకుల మధ్యని ఉండగా భారతి నారాయణబాబుతో జరిపిన వైద్యశాస్త్ర చర్చ సముచితంగా లేదు.

చక్కగా సాఫీగా నడిచిన ఈ నవలిక చివరికి వచ్చేటప్పటికి సినిమా ఫక్కీలో ముగియటం తెచ్చిపెట్టినట్టుంది. రంగనాథన్ని అవమానించటానికి బదులు, అతనిలో పశ్చాత్తాపం కలిగించి, అతన్నీ ఒక పెళ్ళి పెద్దనిచేస్తే— కథకు మరికొంచెం బిగి— బిగి వచ్చేదేమో?—

చూడ చిన్నదే అయినా, ఈ నవలిక పాఠకుని ఆలోచనకు ఎంతయినా దోహద మిస్తుంది. కథా నాయకుడైన విశ్వనాథంతోపాటు పాఠకులనూ తప్పుదోవ పట్టించి, చివరికి ఓడించి వేస్తుంది.

నారాయణమూర్తిగారి రచనా పటవమూ ప్రజ్ఞా ఆయన కథానికలలోనే వ్యక్తమవుతుంది. అదే ప్రతిభతో సాగిన ఈ నవలిక చేత పట్టిందే చివరికంట వదల్ని లాక్కుపోతుందంటే అత్యుక్తి కాదు.

—శివకుమారి

ఆటలు

## మన ఆటగాళ్ళు నేర్చుకోవలసినవి



పాడినపాటవే మళ్ళా పాడవలసి వస్తోంది! మన ఆటగాళ్ళలో శ్రద్ధ ఏకాగ్రత తక్కువ అనిపిస్తుంది. పరిస్థితి బాగా లేనప్పుడు బాట్‌చేసేవారు జాగ్రత్తగా ఆడాలి. గొప్పకోసం విసురుగా ఆడరాదు. తప్పులు చెయ్యకుండా ఉండటంలోనే ఉంది గొప్పతనమంతా.

### 10 వ సారి

బొంబాయి క్రికెట్టు ఆటగాళ్ళకి ఈసత్యం బాగాతెలుసుననుకుంటాను! అందుకనే క్రికెట్టులో వారిదే ఎప్పుడూ పయిచెయ్యి. 10 ఏళ్ళగా రంజీ ట్రాఫీ వారి వారిని వదిలి వెళ్ళలేదు. ఏకాగ్రత, దృఢనిశ్చయంతో ఆడతారు ఈ జట్టువారు. భారతదేశం జట్టు వారిని అనుకరిస్తే మంచిది. (కాని అనుకరించటం అంటూ ఉండదనుకోండి).

ఈ ఏడు బొంబాయికి పేరు తీసుకువచ్చిన మొనగాడి పేరు ఏకనాథ్ సోల్కార్. ఎస్. వెంకట రాఘవన్, వి. వి. కుమార్ల స్పిన్ బవులింగ్‌ని ఎదుర్కొన గలిగాడు ఇతను. మాజీ ఆలిండియా స్కూల్స్ కాప్టెన్ ఇంచుమించు నాలుగు గంటలు ఆడాడు. బొంబాయి పరిస్థితే ప్రమాదంలో ఉన్నప్పుడు 55 పరుగులుచేసి, కాప్టెన్ హార్డీకర్‌తోబాటు శతం పూర్తిచేసి బొంబాయిని రక్షించాడు. బొంబాయి రెండవ ఇన్నింగ్సు మొదలుపెట్టేసరికి 5 వికెట్లు పడిపోయాయి. 390 నిముషాలే మిగిలాయ్, 249 పరుగులు చెయ్యవలసి వచ్చింది కాని, సోల్కార్ ధీమాతో ఆడి తన టీమ్‌కి గెలుపు తెప్పించాడు.

మదరాసు బాటింగ్ చేసినప్పుడు నలుగురు బవులర్లు బాగా బాట్ చేశారు! ప్రభాకర్, సి. కె. భాస్కర్లు 67, 76 పరుగులుచేసి తమ జట్టు మొత్తాన్ని 258 చేశారు. పెద్ద బాట్స్‌మన్ అనుకున్న వారంతా ముందే చవకగా అవుటయి పోయారు కొత్త బంతితో స్టంపులకి అవతల ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈ సూత్రాన్ని మరిచిపోయి ఇలా ఇంటికి వెళ్ళిపోయారు వీరంతా!

న్యూజిలాండులో భారతదేశం మొదటిసారిగా విజయం సాధించింది. న్యూజిలాండుని 5 వికెట్లతో గెలిచింది. అబిద్‌అలీ, ప్రసన్నలు బంతితో, వాడేకర్ బాట్‌తో భారత వీరులయిపోయారు. ఇంతదాకా భారతదేశం 105 టెస్టులు ఆడి 11 సార్లు గెలిచింది—అన్నీ ఈ దేశం నేలమీదనే (అప్పుడుకూడా వెస్టిండీస్‌ని మాత్రం గెలవలేక పోయింది.) అందుకనే ఇది విశేషమయిన విజయం. నాలుగు సీరీస్‌లోనాటవుడినవాటి మొదటి గెలుపు.

భారతదేశం 14 నెలలలో వెస్టిండీస్, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో టెస్టుసీరీస్‌లాడింది..

### రాజమండ్రి టెన్నిస్

రాజమండ్రి కాస్మో పోలిటన్ క్లబ్ ఆంధ్రరాష్ట్రం టెన్నిస్ పోటీలని చక్కగా నడిపింది. ఇవి 18 ఫిబ్రవరి ముగిశాయి. రుమానియా ఆటగాడు టిరియాక్ సింగిల్స్ గెలుచుకున్నాడు. శ్యామ్ మినోత్రా (బొంబాయి) ఈ పోటీలలో చాలా బాగా ఆడాడు. రుమానియా నెం.2 నాస్టాసెని, ప్రేమ్‌జిత్‌లాల్‌ని (ఇతను జాతీయ ఛాంపియన్) ఓడించి, ఉజ్వలంగా పోరాడి టిరియాక్‌తో ఓడిపోయాడు.

టిరియాక్ నాస్టాసెలు లాల్— ముఖర్జీలతో ఎంతో సేపు యుద్ధం చేసి, రెండుజట్లూ చెరి రెండు సెట్లు గెలుచుకోవటంతో 'టయిటిల్'ని ఇద్దరూ పంచుకున్నారు!

—కె. ఎస్. నరసింహన్

బలగం అమర్చినప్పుడు ఏ ఏనుగని (లేదా ఏ శకటుని, ఏ గుర్రాన్ని) కుడివైపున ఉంచాలి, దేనిని ఎడమవైపున పెట్టాలి అని ఎవ్వరూ ఆలోచించరు. అల్లాగే 8 బంట్ల స్థానాలనూ ఏ విధంగా అమర్చినా ఒకటే. అయితే, ఒక ప్రశ్న. బలగాన్ని మొత్తం ఎన్నివిధాలుగా అమర్చవచ్చు? ఒకసారి అమర్చిన పద్ధతిలో సరిగ్గా మరోసారి (అనుకోకుండా) బలగాన్ని అమర్చడం ఎప్పుడైనా సంభవిస్తుందా? రోజూ ఒక కొత్తరకంగా బలగాన్ని అమర్చి ఆడుతూ ఉంటే, అమర్చిన పద్ధతిలో మళ్ళీ అమర్చకుండా ఎన్నాళ్ళపాటు చదరంగం ఆడవచ్చు?

### జవాబులు

(క) 'చదరంగపు బల్లమీద 64 చదరాలు ఉంటాయి' అని మీ సమాధానం అయితే పప్పులో అడుగు వేశారన్నమాటే. మరోసారి ఆలోచించండి. చదరం అంటే పొడవు వెడల్పులు సమానంగా ఉన్న సమకోణ చతుర్భుజమనే కదా అర్థం. ఒంటి గది చదరాలు ఎన్ని అని అడిగితే 64 అన్న మీ జవాబు రైటే. పొడవు రెండు గదులు, వెడల్పు రెండు గదులు ఉన్న చదరాలు కూడా ఉంటాయికదా! అల్లాగే పొడవు మూడు గదులు, వెడల్పు మూడు గదులు ఉన్న చదరాలో? అలాగే ఇంకా రకరకాల చదరాలు చదరంగపు బల్లమీద కనిపిస్తాయికదా. వాటి అన్నింటి మొత్తం 204. కావాలంటే లెక్కపెట్టి చూచుకోండి. మీ పని సుళువు చెయ్యడానికి ఏవి ఎన్నెన్నిఉంటాయో చెప్తాను.

ఒక్క గది చదరాలు = 8 × 8 = 64
2 × 2 గదుల చదరాలు = 7 × 7 = 49
3 × 3 గదుల చదరాలు = 6 × 6 = 36
4 × 4 గదుల చదరాలు = 5 × 5 = 25
5 × 5 గదుల చదరాలు = 4 × 4 = 16
6 × 6 గదుల చదరాలు = 3 × 3 = 9
7 × 7 గదుల చదరాలు = 2 × 2 = 4
8 × 8 గదుల చదరాలు = 1 × 1 = 1
మొత్తం = 204 చదరాలు.

*　　*　　*

(చ) ఈసమస్యలో 3, 6, 7, 8, 9, 12, 14, 15, 17, 18, 20, 23, 24 అనే అంకెలుగల అట్టముక్కలు సరిగ్గా

## మెదడుకి మేత

(47 వ పేజీ తరువాయి)


ఉండవలసిన స్థానాలలోనే ఉన్నాయి. కనుక వాటిని అసలు కదపనక్కరలేదని అనుకుంటారేమో. వాటిని కదుపకపోతే 32 ఎత్తులలో సమస్యను సాధించవచ్చుననుకోండి కాని వీటిలో 6నుగాని 15నుగాని రెండవ ఎత్తులో కదిపి, మళ్ళ 19వ ఎత్తులో వెనుకకు తెచ్చుకుంటే మొత్తం 30 ఎత్తులలోనే సమస్యను సాధించవచ్చును.

2—6—13—4—1—21—4—1—10—2—21—10—2—5—22—16—1—13—6—19—11—2—5—22—16—5—13—4—10—21.

*　　*　　*

(ట) ఇటువంటి సమస్యలను అర్థం చేసుకోడానికి ఈ ఉదాహరణ గమనించండి:


1, 2 అనే అంకెలు వేసి ఉన్న అట్టముక్కలు రెండు తీసుకుని ఒకదాని పక్కన



ఒకటి రెండురకాలుగా అమర్చవచ్చు. ఆ రెండు రకాల పద్ధతులనూ ఇక్కడ చూపించాను.

ఇటువంటి అట్టముక్కలు 1, 2, 3 అనేవి మూడు ఉంటే వాటిని ఇక్కడ చూపినట్లు 1 × 2 × 3 = 6 వేరువేరు రకాలుగా అమర్చవచ్చు.

1, 2, 3, 4 అనే నాలుగు అట్టముక్కలు ఉంటే వాటిని 1 × 2 × 3 × 4 = 24 వేరువేరు రకాలుగా అమర్చవచ్చు. ఐదుముక్కలుంటే 1 × 2 × 3 × 4 × 5 = 120 వేరువేరు రకాలుగా అమర్చవచ్చు. ఇల్లాగే ఎన్ని వస్తువులున్నా వాటిని ఎన్నిరకాలుగా అమర్చవచ్చునో సులభంగా చెప్పవచ్చు. చదరంగంలో తెలుపు బలగాన్ని ముందర చూద్దాం: ఇందులోని 8



బంట్లనూ 1 × 2 × 3 × 4 × 5 × 6 × 7 × 8 = 40,320 రకాలుగా అమర్చవచ్చును. రెండు ఏనుగులను రెండు రకాలుగానూ, రెండు శకటాలను రెండు రకాలుగానూ, రెండు గుర్రాలను రెండు రకాలుగానూ అమర్చవచ్చు కనుక మొత్తం తెల్ల బలగాన్ని అంతనూ 40320 × 2 × 2 × 2 = 3,22,560 వేరువేరు రకాలుగా అమర్చవచ్చు. నల్లబలగాన్ని సరిగ్గా మరో ఇన్నిరకాలుగా అమర్చవచ్చునుకదా! కనుక, మొత్తం చదరంగపు బలగాన్ని అంతనూ 322560 × 322560 = 104,044,953,600 రకాలుగా అమర్చవచ్చును. ఇంతేకాదు, చదరంగపు బల్లను రెండు విధాలుగా పెట్టవచ్చును. (ప్రతి ఆటగాడికి కుడివైపు ఏనుగు గది తెల్లనిది అయి ఉండాలనే నియమం ఉంది. కనుకనే రెండువిధాలుగా అమర్చవచ్చును) అంటే బల్లమీద బలగాన్ని 2 × 104,044,953,600 = 208,089,907,200 వేరువేరు రకాలుగా అమర్చవచ్చు!

రోజుకి ఒక కొత్తరకంగా బలగాన్ని సుమారు 57 కోట్ల సంవత్సరాలపాటు అమరుస్తూ ఉండవచ్చు!

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

